

ఆంధ్రజ్యోతి

విజయవాడ సిటీ

వెల: రూ. 5.00



శుక్రవారం | 23-3-2018 | పేజీలు: 32 + 20 | సంపుటి: 58 | సంచిక: 337

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి మ. 12.03 తదుపరి సప్తమి; నక్షత్రం: రోహిణి సా. 4.57 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ. 9.19-10.50; దుర్ముహూర్తం: ఉ. 8.46-9.34, మ. 12.47-1.35; అమృతఘడియలు: మ. 1.54-3.26; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 6.24

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai




అఖిలపక్ష ఆందోళనతో విజయవాడ కనకదుర్గమ్మ వారధి వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు.. (ఇన్‌సెట్) విజిలేస్తున్న సీపీఎం మధు, నటుడు శివాజీ

ఏపీపై 'గరుడ'

- జాతీయ పార్టీ దుర్మార్గ ఆపరేషన్
- 'గురు' ఆదేశాలతో శ్రీకారం
- రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారితో అమలు
- రాష్ట్రంలో అధికార పార్టీ నిర్వీర్యమే లక్ష్యం
- పావులుగా ఇప్పటికే ఉన్న పార్టీ, కొత్త పార్టీ
- అధికార పార్టీపై కేసులు, ఆర్థిక చక్రబంధం
- ఇప్పటికే ఉన్న పార్టీ నేతపై 'హాని' లేని దాడి
- ఆ తర్వాత రాష్ట్రంలో అల్లర్లు, అలజడులు
- సెప్టెంబరు 1న రాష్ట్ర ప్రభుత్వం రద్దు
- కొత్త నేతకు 'కేంద్ర మంత్రి పదవి ఆఫర్'
- చివరికి.. జాతీయ పార్టీ నుంచి ఏపీ సీఎం
- దక్షిణాది లక్ష్యంగా 'ఆపరేషన్ ద్రవిడ'
- నటుడు శివాజీ విప్పిన వ్యూహం

2



ఎంపీలను మీ వద్దకే తీసుకొస్తాం

- సంతకాలూ సమర్పిస్తాం.. అఖిలపక్షాన్ని పిలవండి
- అవిశ్వాసంపై స్పీకర్ సుమిత్రకు టీడీపీ అభ్యర్థన
- మేడమ్ నుంచి సానుకూల స్పందన రాలేదు
- ఇక ఎవరి వద్దకెళ్లాలి: సుజనా ఆవేదన
- ప్రతిష్టంభన వీడేదెలా?.. సర్కారులో చిరు కదలిక
- విపక్ష నేతలతో మంత్రి విజయ్ గోయల్ భేటీ

5

కేంద్రంపై దండుయాత్ర

'దిగ్బంధం'తో సత్తా చాటిన ఆంధ్రులు

మోదీ అన్యాయం, ద్రోహాలపై రాష్ట్రమంతా నిరసనల రణం

హైవేలపై ఉరిమిన ఉద్యమం.. అఖిలపక్షం ఆందోళనల సెగ


తెలుగు వాడి పిడికిలి బిగిసింది. ఉద్యమ వేడి ఎగిసింది. గోడు వినని కేంద్రంపై నిరసన పెల్లుబికింది. ఇచ్ఛాపురం నుంచి అనంతపురం దాకా... హైవేల దిగ్బంధంతో కొన్ని గంటలపాటు రవాణా చక్రం ఆగిపోయింది. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఇచ్చిన పిలుపునకు... అధికార పక్షం, విపక్షం, వామపక్షం, ప్రజాసంఘాల మద్దతుతో ఊరూ దారీ ఏకమయ్యాయి. 'ప్రజల్ని రోడ్లెక్కేలా చేస్తున్నారు' అని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ చేసిన వ్యాఖ్యలపై మండలిలో అన్ని పార్టీల సభ్యులు మండిపడ్డారు. మరోదారి లేకే ప్రజలు ఉద్యమిస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

దీక్షలతో తెలుగు తమ్ముళ్ల పోరు

- ఉభయ సభల్లో ఐదో రోజూ సాగిన ఆందోళన
- అవిశ్వాసానికి మళ్లీ అన్నాడీఎంకే, టీఆర్ఎస్ గండి
- లోక్‌సభ వెల్‌లోకి దూసుకెళ్లి రచ్చ రచ్చ
- తనకేమీ కనబడడం లేదన్న స్పీకర్
- తీర్మానం అనుమతికి నిరాకరణ
- మళ్లీ నోటీసిచ్చిన తెలుగుదేశం, వైసీపీ

5

హోదాకు ఏపీ అర్హమైనదే: కాగ్ మాజీ డైరెక్టర్



కేంద్రం మళ్లీ అదే తొండి

- ఈశాన్యానికి మరో 3వేల కోట్లు
- నవ్యాంధ్ర విషయంలోనే సాకులు

3 పార్టీల మహా కుట్ర!

టీడీపీపై బురద చల్లడమే అజెండా.. ప్రతి గ్రామంలో చర్చ జరుగుతోంది

ప్రజలకు అన్నీ వివరించండి.. ఎంపీలకు చంద్రబాబు ఆదేశం

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 'మూడు పార్టీలు కలిసి నాపై ముప్పేట దాడి చేస్తున్నాయి. ఈ మహా కుట్రపై ఇప్పుడు ప్రతి గ్రామంలో చర్చ జరుగుతోంది. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వెన కంజ వేసే సమస్యే లేదు' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఆయన టీడీపీ ఎంపీలు, అసెంబ్లీ వ్యూహ కమిటీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "పార్టీల వైఖరిని ప్రజలు నిశితంగా

మిగతా 2వ పేజీలో...

మేం నీతిలో నంబర్ 1

- నా జీవితం తెరిచిన పుస్తకం.. లాలూచీ పడే అలవాటే లేదు
- కేసులు ఎందుకు, ఎలా పెడతారు?.. పట్టిసీమలో అవినీతి ఎక్కడ?
- ఇప్పుడు పోలవరంపైనా కుట్రలు.. జరగరానిది జరిగితే జనం ఊరుకోరు
- నాపై కోపం పోలవరంపై చూపొద్దు.. కుట్రలు మానండి: సీఎం ఫైర్

2

రూ. 20 లక్షల వరకూ పన్ను లేదు!

- గ్రాట్యుటీ ఉపశమనం రెట్టింపు
- సవరణ బిల్లుకు పార్లమెంటు ఓకే

11

ఫేస్'బుక్'

- 62 మందికి లైంగిక వేధింపులు
- డబ్బుల కోసం బ్లాక్‌మెయిలింగ్
- బాధితుల్లో అత్యధికులు మెడికోలే
- కాకినాడలో కలకలం



నిందితుడు శ్రీనివాసరావు

అవకాశవాద పొత్తులుండవు!

- బీజేపీకి విలువలున్నాయి.. వైసీపీతో దోస్తీపై షా
- అవిశ్వాసంపై చర్చకు రెడీ.. ఏపీకి చాలా చేశాం
- ప్రతి పైసాకూ లెక్కలున్నాయి: బీజేపీ చీఫ్




2



ఏడీజీ లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి?

స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు.. జనసేనలోకి?

2



దంతాల మధ్య నాలుక మసలుకున్నట్లు..


జీవితమన్నాక ఏవేవో సమస్యలు, నష్టాలు, కష్టాలు వస్తూనే ఉంటాయి. ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. అలాంటి సందర్భాల్లో సర్దుబాటు మనస్తత్వం, సమయస్ఫూర్తి క్షమా గుణం వంటి లక్షణాలు ఉన్నవారు అశాంతికి గురి కారు. వారి మనసు కలవరపడదు. 32 పళ్ల మధ్య ఉండే నాలుక.. ఆ దంతాల మధ్య పడకుండా ఉండేందుకు అనుక్షణం ఎలా చురుగ్గా, చాకచక్యంగా మసలుకుంటుందో మానవులు కూడా అలాగే వ్యవహరించడం నేర్చుకోవాలి. దంతాల మధ్య మెలగడం నాలుకకు ఎలా తప్పనిసరో.. సుఖసంతోషాలు, కష్టనష్టాలు కలగలిసిన బతుకు బాటలో సాగడమూ మనిషికి అంతే తప్పనిసరి. 'మన' అనుకున్నవాళ్లే మనకు పలు బాధలకు లోను చేయవచ్చు. కంటతడి పెట్టించవచ్చు. కష్టనష్టాలకు కారణం కావచ్చు. ఆ సమయంలో మనకు కావలసింది ఓర్పు, నేర్పు, క్షమాగుణం, మనను బాధపెట్టిన వారిపై ద్వేషం, పగ పెంచుకోకుండా ఉండగలగడం. అశాంతితో ఉడికిపోవటానికైనా ప్రశాంతిగా బ్రతకటానికైనా ఎవరికి వారే కారణంగాని ఇతరులు కానేకాదని తెలుసుకుంటే ఆ ప్రశాంత చిత్తం సాధ్యమే. అంతులేని కోరికలు, స్వార్థం, ఈర్ష్యాద్వేషాలు వంటి అవాంఛనీయ గుణాలే అశాంతికి అసలైన కారణం. నలుగురితో కలిసి జీవించటం, అవసరంలో ఉన్నవారికి కాస్త చేయూతనివ్వటం, సహాయమందించటం, ఎప్పుడూ తనను గురించేగాక ఇతరులను గురించి కూడా కాస్త ఆలోచించటం వంటి ఉత్తమ లక్షణాలు ప్రశాంత జీవన యానానికి రాచ బాట. నిజానికి జీవితమంటే ఇదే. ఇందుకు భిన్నంగా వ్యవహరించేవాళ్లు అశాంతి బాట పట్టక తప్పదు.

- మాదిరాజు రామచంద్రరావు



Paramjyothi పరంజ్యోతి

మేం నీతిలో నంబర్ 1



- నా జీవితం తెరిచిన పుస్తకం
- లాలూచీ పడే అలవాటే లేదు
- పోలవరం పూర్తి నా జీవితాశయం
- నాపై కోపం పోలవరంపై చూపొద్దు
- పీఎంవోలో నేరగాడికి ఏం పని?
- అసెంబ్లీ, మండలిలో చంద్రబాబు ధ్వజం

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి):నవ్యాంధ్ర జీవనాడి పోలవరాన్ని అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీని దెబ్బతీసేలా ఏదైనా జరగరానిది జరిగితే రైతులు, ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. 'నాపై కోపాన్ని పోలవరంపై చూపొద్దు' అని కేంద్రానికి, విపక్షాలకు సూటిగా చెప్పారు. నీతివంతమైన పాలన అందిస్తున్నామని, తన జీవితం తెరిచిన పుస్తకమని చెప్పారు. గురువారం శాసనసభలో, మండలిలో సీఎం ప్రసంగించారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా ప్రకటన చేస్తూ పట్టిసీమ, పోలవరం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. బీజేపీ, వైసీపీ, జనసేనలపై విరుచుకుపడ్డారు. "ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయి. రాష్ట్రాన్ని, టీడీపీని ఇబ్బంది పెట్టేందుకు కుట్రలు, కుయుక్తులు చేస్తున్నారు. కేసులకు, బెదిరింపులకు భయపడేది లేదు. టీడీపీ అంటేనే ఆత్మగౌరవానికి, ఆత్మ విశ్వాసానికీ ప్రతీక" అని తెలిపారు. పట్టిసీమను కాగ్ తప్పుపట్టిందంటూ బీజేపీ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ.. "కేంద్ర ప్రభుత్వంలోని అనేక అంశాలను కూడా కాగ్ తప్పుపట్టింది. మరి కేంద్రంపై ఎన్ని కేసులు పెట్టాలి? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎక్కడుంది అవినీతి?: ఒక్క రూపాయి అవినీతి లేకుండా ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. "సీబీఐ విచారణ జరిగితే నిధులు ఆపొచ్చని కొందరు భావిస్తున్నారు. కుట్రలు మానండి. ఇప్పుడు కూడా పుండు మీద కారం చల్లినట్లుగా మాట్లాడొద్దు" అని కేంద్రాన్ని, విపక్షాలను కోరారు. "పోలవరానికీ ఎన్నో అడ్డంకులు సృష్టిస్తున్నారు. కాంట్రాక్టర్ల నియామకం అంతా కాంగ్రెస్ పాలనలోనే జరిగింది. కాంక్రీటు పనుల కోసం నవయుగను కూడా కేంద్రం అనుమతించాకే నియమించాం. లాభాపేక్ష లేకుండా, పాత ధరలకే ఈ పనులు చేస్తామని ఆ సంస్థ ముందుకు వచ్చింది. అయినా ఇష్టానుసారంగా మాట్లాడుతూ దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు" అని బాబు మండిపడ్డారు. "ఒక పత్రిక వరుసగా ఈ అంశంపై తప్పుడు కథనాలు రాసింది. పోలవరం ముందుకు సాగకూడదని, ఏపీ బాగు పడకూడదనే కదా ఇదంతా! భూసేకరణ ఖర్చు రాష్ట్రమే భరిస్తుందని నేను చెప్పినట్లుగా పవన్ కల్యాణ్ పేర్కొంటున్నారు. ఆ మాట నేను ఎక్కడ చెప్పాను?ప్రభుత్వ ఉద్దేశాలను అర్థం చేసుకొని వారిని ప్రజలు ఛీకొట్టాలి" అని చంద్రబాబు అన్నారు.

ఒక్క పైసా ఎక్కువ ఇవ్వలేదు

పట్టిసీమలో కాంట్రాక్టరుకు ఒక్క పైసా అదనంగా ఇవ్వలేదని సీఎం తెలిపారు. ఫ్రెజర్ మెయిన్‌కు రూ.725 కోట్లు మాత్రమే అయ్యిందని, పంపుసెట్లకు ఒప్పందం ప్రకారమే నిధులు చెల్లించామని అన్నారు. "ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లారు. ఆ పిటిషన్ తప్పు అని కోర్టు చెప్పింది. అయినా మీకు కనిపించడం లేదా?" అని బీజేపీని ప్రశ్నించారు.

నేరస్తుడిని ఎలా కలుస్తున్నారు...

'దేశంలోనే నీతివంతమైన పాలన అందిస్తోన్న నంబర్ వన్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్' అని సీఎం ఉద్ఘాటించారు. "నేను ఒక్క రూపాయి అవినీతి చేయను. నా జీవితం తెరిచిన పుస్తకం. నా కుటుంబమే నాకు డబ్బులు ఇస్తుంది. మా కంపెనీల్లో ఎక్కడా ప్రభుత్వం నుంచి రూపాయి పెట్టుబడి లేదు" అని తెలిపారు. పైసా అవినీతి లేదు కాబట్టే పెట్టుబడులు పెట్టేందుకు ఏపీకి వస్తున్నారన్నారు. తనపై చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని పవన్‌ను, విజయసాయి రెడ్డిని డిమాండ్ చేశారు. "పవన్ ఆరోపణల్లో పద్ధతి, హుందాతనం లేదు" అని తెలిపారు. విజయసాయి సిగ్గులేకుండా ప్రధానిని కలుస్తున్నారని విమర్శించారు. "ఒక దొంగ, నేరస్తుడు ప్రధానిని కలిస్తే ఎలా సహకరిస్తారు? బీజేపీకి, కేసులకు మేం భయపడాలా?" అని నిలదీశారు. దొంగలా విజయసాయిరెడ్డి పీఎంవోలో దాక్కుంటున్నాడని ఎద్దేవా చేశారు. 'నా వద్దకు ఏ నేరస్తుడూ రాడు. మీరెలా రానిస్తున్నారు' అని ప్రశ్నించారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ స్పందిస్తూ... ఎంపీగా ప్రధానిని కలిస్తే తప్పేముందని అడిగారు. "ఎంపీగా వెళ్లడంలో అభ్యంతరం లేదు. కానీ... దాక్కోవడం ఎందుకు? పైగా నన్ను బోనులో పెట్టేదాకా వెళ్తానే ఉంటానని అంటున్నారు. పెట్టండి.. కాపురాలు పెట్టండి. మాకేం అభ్యంతరం లేదు' అని వ్యాఖ్యానించారు.

కేంద్రంలో పదవులు అడిగానా?

"29సార్లు ఢిల్లీ వెళ్లాను. నేనైఫైనా గవర్నర్, కార్పొరేషన్, మంత్రి పదవులు అడిగానా? రాష్ట్ర ప్రయోజనాల గురించే అడిగాను. పట్టించుకోలేదు. గ్రీన్ సిటీ కడతారట అని ఎగతాళి చేశారు. రూ.2500 కోట్లు రాజధానికి ఇచ్చి పదే పదే చెబుతున్నారు. ముంబై, అహ్మదాబాద్‌కు ఎందుకు ఇచ్చారు? అదేమంటే యూపీ, బిహార్ వాళ్లు అడుగుతారని సాకులు చెబుతున్నారు. అక్కడ విభజన జరగలేదు కదా? బడ్జెట్‌లో ఏపీ గురించి ఒక్క మాట లేదు. ఇప్పుడు యుద్ధం చేస్తామంటున్నారు. దేని కోసం చేస్తారు? రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. జైట్లీ ఏం ఇచ్చేది లేదన్న తర్వాతే, ప్రయోజనం లేదనుకుని నిర్ధారించుకుని బయటికి వచ్చాం" అని సీఎం తెలిపారు.

రాష్ట్రం సంగతి చూడండి..

"పోలవరం ప్రాజెక్టులో బీజేపీ నాయకులు వేరే రాష్ట్రాల ప్రయోజనాల గురించి మాట్లాడుతున్నారు. ముందు మన అవసరాలు చూడండి. పోలవరం పూర్తిచేసే బాధ్యత కేంద్రానిదేనని విభజన చట్టంలోనే ఉంది. కానీ, మీ దురుద్దేశం ఏంటి? జాతీయ పార్టీగా ఇది మీకు తగదు' అని బీజేపీని నిలదీశారు. పోలవరం ఖర్చును కేంద్రమే భరించడంతో పాటు అన్ని అనుమతులూ తీసుకొస్తామని చట్టంలో పెట్టారని, ఇప్పుడు చేయాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు.

కేంద్రం చేతిలో పెట్టి ఉంటే...: పోలవరం ప్రాజెక్టును మిగిలిన జాతీయ ప్రాజెక్టుల తరహాలో కేంద్రం చేతిలో పెట్టి ఉంటే ఇప్పటికీ పనులు ప్రారంభమయ్యేవి కావని సీఎం అన్నారు. దేశంలో మొత్తం 16 జాతీయ ప్రాజెక్టులు ఉండగా అందులో 11 ప్రాజెక్టులు ఇంతవరకూ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. పోలవరాన్ని కూడా ఇలాగే చేసేవారని, ఎప్పటికీ పూర్తయ్యేది కాదని, అందుకే తాము చేపట్టామని అన్నారు. మొత్తం 16 జాతీయ ప్రాజెక్టుల స్థితిని ఆయన సభలో చదివి వినిపించారు. "పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కావాలని తీసుకోలేదు. నీతి ఆయోగ్ సిఫారసు, త్వరగా పనులు పూర్తిచేయాలన్న లక్ష్యంతోనే చేపట్టాం. ఆ ప్రాజెక్టును మేమేదో కావాలని తీసుకున్నట్లు ప్రతిపక్ష పార్టీలు, ఈ మధ్య కొత్తగా పార్టీ పెట్టిన వ్యక్తి మాట్లాడుతున్నారు. పోలవరం పూర్తి నా జీవితాశయం" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.



ప్రజల్ని నియంత్రించలేరు!

ప్రజలు రోడ్లపైకి వచ్చేలా చేశారని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అనడంతో మండలిలో గందరగోళం నెలకొంది. సభ్యులందరూ పెద్దగా నినాదాలు చేశారు. అధికార పార్టీ సభ్యులతో సహా పీడీఎఫ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మాధవ్ మాటలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కడుపు కాలి రోడ్లపైకి వస్తే ప్రజల్ని అంటారా?' అని నిలదీశారు. అయితే, తాను ప్రజల్ని అనలేదని, ప్రభుత్వం సహకరించిందని మాత్రమే అన్నానని మాధవ్ సమాధానమిచ్చారు. దీనిపై సీఎం తీవ్రంగా స్పందించారు. "పాలనతో ప్రజల్ని మెప్పించగలం తప్ప వారిని నియంత్రించలేం. వేరే మార్గం లేకే ప్రజలు రోడ్లపైకి వచ్చారనే విషయం తెలుసుకోవాలి. రహదారి దిగ్బంధం సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు" అని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు హోదా పేరు తొలగించారని... ఏపీకి 90:10 చొప్పున నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మాధవ్ తెలిపారు. దీనిపై సీఎం మాట్లాడుతూ... "అదనంగా వచ్చే 30 శాతం నిధులను ఈశాన్య రాష్ట్రాలకు నేరుగా ఇస్తున్నా... ఏపీకి మాత్రం ఎస్పీవీ అని ఎందుకు అంటున్నారు?" అని సీఎం ప్రశ్నించారు.

ఏపీపై 'గరుడ'

- రాష్ట్రంలో అధికార పార్టీ నిర్వీర్యమే లక్ష్యం
- దక్షిణాదిన 'ఆపరేషన్ ద్రవిడ'!: శివాజీ

విజయవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ద్రవిడ! దక్షిణ భారత దేశాన్ని రాజకీయంగా జయించేందుకు ఒక జాతీయ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని సినీ నటుడు, హోదా సాధన ఉద్యమ నాయకుడు శివాజీ ఆరోపించారు. మొత్తంగా ద్రవిడ రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడానికి వ్యూహాత్మకమైన స్కెచ్‌ను జాతీయపార్టీ రూపొందించిందన్నారు. ఎవరి పేర్లు, పార్టీలను ప్రత్యక్షంగా ప్రస్తావించకుండా... సంచలన ఆరోపణలు చేశారు. ఆపరేషన్ ద్రవిడలో ప్రధానమైన వ్యక్తిని 'గురు'గా సంబోధించారు. గురు ఆదేశాలను స్థానికంగా రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వాళ్లు అమలు చేస్తారని తెలిపారు. "నేను ఎవరి పేర్లూ చెప్పను. నాకున్న ఇబ్బందులు నాకున్నాయి. మీకు విషయం అర్థమవుతుంది. అర్థమైన వాళ్లు అర్థం కాని వాళ్లకు వివరించి చెప్పండి" అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఒక జాతీయ పార్టీ ఆపరేషన్ ద్రవిడ అమలు చేస్తోందన్నారు. ఏపీ, తెలంగాణ లక్ష్యంగా 'ఆపరేషన్ గరుడ', కర్ణాటకలో ఆపరేషన్ కుమార, తమిళనాడు, కేరళకు కలిపి ఆపరేషన్ రావణ పేరిట ఈ తతంగం నడుస్తోందని చెప్పారు. ఇప్పుడు ఏపీలో జరుగుతున్నది కూడా ఇందులో భాగమే అని తెలిపారు.

ఏం చేస్తారంటే...

పసిబిడ్డలాంటి ఏపీని అతిదారుణంగా దెబ్బ తీసేందుకు జాతీయ పార్టీ స్కెచ్ వేసిందని శివాజీ పేర్కొన్నారు. అధికార పార్టీని దెబ్బతీయడమే లక్ష్యంగా ఇది జరుగుతుందన్నారు. సీబీఐ కేసులు తెరవడం, ఆ పార్టీకి చెందిన వారి ఆర్థిక మూలాలు దెబ్బతీయడం, చక్రబంధంలో ఇరికించడం... 2019 నాటికి ఆ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేయడమే 'ఆపరేషన్ గరుడ' లక్ష్యమని తెలిపారు. దీనికోసం... రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మరో ముఖ్య పార్టీని, కొత్త పార్టీని ఉపయోగించుకుంటారని చెప్పారు. "ఈ వ్యూహంలోకి కొందరు అభిమన్యుల్లా ప్రవేశిస్తారు. ఇలా వచ్చే వారిలో ఒక కొత్త నాయకుడు ఉన్నారు. అందరికంటే ఇతను ప్రమాదకరం. తనకు రాష్ట్రంపై బాధ్యత ఉన్నట్లు, తాను పరిశోధన చేసినట్లు ప్రజల్లోకి కొన్ని సంకేతాలు పంపిస్తారు. ఆయనకు ఇద్దరు విశ్రాంత ఐఏఎస్‌లు, ఒక సీనియర్ పాత్రికేయుడు సహకరిస్తారు. నిజానికి... కొత్త నాయకుడి వ్యూహం గురించి వీరికి కూడా తెలియదు! అధికార పార్టీని అలజడిలోకి నెట్టడమే ఈ కొత్త నాయకుడి పని" అని శివాజీ వివరించారు. నలుగురు వ్యక్తులు ఢిల్లీలో కూర్చుని ఇప్పటికే సీబీఐ కేసులు తెరిచే పని మొదలుపెట్టారన్నారు. ఇదే క్రమంలో... ఇప్పటికే ఉన్న పార్టీ నాయకుడికి (కేసుల నుంచి) కొంత ఊరట లభిస్తుందని చెప్పారు.

అల్లర్లకు కుట్ర

ఆపరేషన్ గరుడలో రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన పార్టీయే అసలు బలి పశువు అవుతుందని శివాజీ తెలిపారు. ఆ పార్టీ నాయకుడిపై ఉన్న కేసులను అడ్డు చేసుకుని దగ్గరికి తెచ్చుకుంటారన్నారు. ఆ ముఖ్య నాయకుడిపై 'ప్రాణహాని' లేకుండా దాడి చేయిస్తారని శివాజీ తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్, గుంటూరులో రెక్కీ కూడా జరిగిందని తెలిపారు. ప్రాణహాని లేని దాడి తర్వాత అల్లర్లు సృష్టిస్తారన్నారు. ఈ దాడిని రాయలసీమకు చెందిన ఒక ముఖ్య నాయకుడి కుటుంబంపై వేసే యోచన కూడా ఉందని తెలిపారు. 'ఒడిసా, బిహార్ వ్యక్తులు హింసకు పాల్పడతారు. రాష్ట్రంలో అలజడి మొదలవుతుంది' అని తెలిపారు. అధికార పార్టీ ఇబ్బందుల్లో పడుతుంది. అప్పటికే ఉన్న సీబీఐ కేసులూ ఇక్కట్లలోకి నెడతాయన్నారు. చివరగా... ఈ ఆపరేషన్‌కు 'సెప్టెంబరు 1' క్లైమాక్స్ పడుతుందన్నారు. అల్లర్లు, అలజడిని కారణంగా చూపి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేస్తారన్నారు.



చివరికి జరిగేది...

'ఆపరేషన్ గరుడ'లో భాగంగా ఏపీలోని ప్రాంతీయ పార్టీలన్నీ నిర్వీర్యం అవుతాయని శివాజీ చెప్పారు. "ఎన్నికల్లో జాతీయ పార్టీకి, కొత్త పార్టీకి సీట్లు వస్తాయి. కేసులు, ఆర్థిక ఇబ్బందులు, అలజడుల సుడిలో చిక్కుకున్న అధికార పార్టీ దెబ్బతింటుంది. మరో ముఖ్య నాయకుడిని పెండింగ్ కేసుల్లో జైలుకు పంపిస్తారు. ఆ పార్టీ కథ ముగుస్తుంది. అధికార పార్టీలో ఉన్న నేతలంతా ఇతర రెండు మూడు పార్టీల్లోకి వెళతారు. ఎన్నికలు జరుగుతాయి. కొత్తపార్టీకి, ముఖ్యపార్టీకి సీట్లు వస్తాయి. ఇక... కొత్త పార్టీ నాయకుడికి కేంద్ర మంత్రి పదవి ఇస్తామంటారు. ఆయన తనకు వద్దని అలిగి వెళ్లిపోతాడు. మొత్తంగా మూడు పార్టీల కథ ముగుస్తుంది. దీంతో ఆపరేషన్ గరుడకు తెర పడుతుంది" అని శివాజీ తెలిపారు. ఆపై... జాతీయ పార్టీకి చెందిన తెలుగు వ్యక్తే ఏపీకి ముఖ్యమంత్రిగా వస్తారన్నారు. 'ఆ వ్యక్తి ఎవరో మీకూ తెలుసు. నేను చెప్పాల్సిన అవసరం లేదు' అని అన్నారు. 2013 నుంచి తనకు దేశం పట్ల అవగాహన ఉందని, దీంతో తనకు ఢిల్లీలో కొందరు పరిచయమయ్యారని తెలిపారు. జాతీయ పార్టీకి అనుబంధంగా ఉండే 'కల్యాణ్‌జీ' అనే వ్యక్తి తనకు ఈ వివరాలు చెప్పారన్నారు. సంస్థాగతంగా కల్యాణ్‌జీ అని పిలుచుకున్నప్పటికీ... అసలు పేరు వేరే ఉండవచ్చునన్నారు.

'జేడీ' లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ!

- మహారాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు
- రాజకీయాల్లోకి వస్తారని.. జనసేనలో చేరతారని ప్రచారం
- టచ్‌లో బీజేపీ నేతలు?



అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ రాజకీయాల్లోకి వస్తున్నారా? జనసేనలో చేరబోతున్నారా? మహారాష్ట్రలో అడిషనల్ డీజీగా ఉన్న ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. దాంతో ఈ సీనియర్ ఐపీఎస్ అధికారి రాజకీయాల్లోకి వస్తున్నారని, జనసేనలో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. బీజేపీ నేతలు కూడా ఆయనతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. కర్నూలు జిల్లా శ్రీశైలానికి చెందిన లక్ష్మీనారాయణ 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. హైదరాబాద్‌లో సీబీఐ జాయింట్ డైరెక్టర్(జేడీ)గా ఉన్న సమయంలో తెలుగు ప్రజలకు ఆయన సుపరిచయం. వైసీపీ అధ్యక్షుడు జగన్ అక్రమాస్తుల కేసు, ఓబుళాపురం గనులు వంటి కేసుల దర్యాప్తునకు నేతృత్వం వహించడంతో బాగా పాపులర్ అయ్యారు. సీబీఐలో డిప్యూటేషన్ పూర్తయిన తర్వాత మహారష్ట్రకు తిరిగి వెళ్లిపోయారు. అక్కడ విధులు నిర్వహిస్తున్నా.. ఏపీ, తెలంగాణలో పాఠశాలల మరమ్మతు పనులు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆ సమయంలోనే ఆయన రాజకీయాల్లోకి వస్తారని ప్రచారం జరిగింది. కానీ ఎక్కడా ఈ అంశంపై మాట్లాడింది లేదు. ఇప్పుడు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేయడంతో ఆ ప్రచారం మళ్లీ జోరందుకుంది. పవన్ కల్యాణ్‌తో కలిసి రాజకీయ రంగంలో అడుగులు వేస్తారని ప్రచారం జరుగుతోంది. వీటిపై ఆయన స్పందించకపోయినా..ముందుగా తన దరఖాస్తును రాష్ట్ర ప్రభుత్వం, ఆపై కేంద్ర ప్రభుత్వం ఆమోదించాల్సి ఉందని పేర్కొన్నారు. తాను రాజకీయాల్లోకి వస్తాననడం ఊహాజనితమైనదిగా ఆయన కొట్టిపారేస్తున్నారు.

వస్తే టీడీపీకే మంచిది:కేశవ్

లక్ష్మీనారాయణ కొత్తగా రాజకీయ పార్టీ పెట్టినా.. ఏదైనా పార్టీలో చేరినా అది టీడీపీకే లాభమని ఆ పార్టీ ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శాసనసభ లాబీలో స్పందిస్తూ.. గతంలో జయప్రకాశ్ వల్ల ప్రతిపక్షంలో ఉన్న తమకు నష్టం జరిగిందని.. ఇప్పుడు లక్ష్మీనారాయణ వల్ల ప్రతిపక్షాలకే నష్టమని వివరించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసేందుకు ఎవరు వచ్చినా స్వాగతిస్తామన్నారు.

నా క్రెడిట్ కార్డు బిల్లూ వారే కడతారు

- అవినీతికి పాల్పడే అవసరం లేదు: మంత్రి లోకేశ్

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడాల్సిన అవసరం తనకు లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అలాగే తన శాఖలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగడం లేదని తెలిపారు. తన కుటుంబం పాలు, కూరగాయలు అమ్మి డబ్బు సంపాదిస్తోందని.. చివరికి తన క్రెడిట్ కార్డు బిల్లు కూడా వారే కడతారని చెప్పారు. తన శాఖలో అవినీతి జరుగుతున్నట్లు ఆధారాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. గురువారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో తాగునీటి ట్యాంకర్లలో అవినీతి జరుగుతోందని బీజేపీ పక్షనేత సోము వీర్రాజు ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ పైన చెప్పిన విధంగా స్పందించారు.

3 పార్టీల మహా కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

గమనిస్తున్నారు. మూడు పార్టీలు కలిసి నాపైనా, లోకేశ్‌పైనా, మంత్రులపైనా ఆరోపణలు గుప్పిస్తున్నాయి. టీడీపీపై బురద చల్లడం వాటి ఉమ్మడి ఎజెండా. ఇటువంటి కుట్రలు, కక్షసాధింపు చర్యలు ఇంకా పెరుగుతాయి. అన్నింటికీ, అందరూ సిద్ధంగా ఉండాలి. ప్రజలను చైతన్యపర్చాలి. ప్రజలే మనకు కొండంత అండ. అంతిమ విజయం మనదే" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిపై సీబీఐ దర్యాప్తు ఖాయమని వైసీపీ నేతలు పదేపదే అంటున్నారని, బీజేపీ కూడా అసెంబ్లీలో అదే డిమాండ్ చేసిందని యనమల రామకృష్ణుడు చెప్పినప్పుడు దానిని చంద్రబాబు తోసిపుచ్చారు. తన జీవితం తెరిచిన పుస్తకమని, ఏ తప్పూ చేయని తనను ఎవరూ ఏమీ చేయలేరని ఆయన వ్యాఖ్యానించారు. ఎంపీలు ఇంకా ఉధృతంగా పోరాడాలని, పార్లమెంటు నిరవధిక వాయిదా వేస్తే ప్రజల్లోకి వెళ్లాలని ఆయన సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో సుజనా చౌదరి, తోట నరసింహం, ఎంపీలు జయదేవ్, అవంతి శ్రీనివాసరావు, పల్లె రఘునాథ తదితరులు కూడా మాట్లాడారు.

అవకాశవాద పొత్తులుండవు!

- వైసీపీతో దోస్తీపై అమిత్ షా
- అవిశ్వాసంపై చర్చకు సిద్ధం
- ఏపీకి ఎంతో చేశాం
- ప్రతి పైసాకూ లెక్కలున్నాయి: బీజేపీ చీఫ్

న్యూఢిల్లీ, మార్చి 22: అవకాశవాదంతో తాము పొత్తులు పెట్టుకోబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా చెప్పారు. కాంగ్రెస్‌లా కాకుండా బీజేపీకి కొన్ని విలువలు ఉన్నాయని అన్నారు. ఒక జాతీయ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వైసీపీ, టీఆర్ఎస్‌లతో పొత్తు ఉంటుందా అని ప్రశ్నించినప్పుడు... అమిత్‌షా ఇలా సమాధానం ఇచ్చారు. 'కేంద్రంలో మాకు పూర్తి మెజార్టీ ఉంది. మా ప్రభుత్వంలోని ప్రతిపార్టీకి గౌరవనీయమైన స్థానం ఇచ్చాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పద్ధతి పాటిస్తున్నాం. త్రిపురలో మాకు పూర్తి మెజార్టీ ఉన్నా.. మా మిత్రపక్షం ఐపీఎఫ్‌టీకి సముచిత స్థానం ఇచ్చాం. అవకాశవాదంపై ఆధారపడి స్నేహాలు ఉండబోవు' అని అమిత్‌షా స్పష్టం చేశారు. నాలుగేళ్లగా ఆంధ్రప్రదేశ్‌కు మోదీ ప్రభుత్వం ఎన్నో నిధులు ఇచ్చిందని, గతంలో ఏ కేంద్ర ప్రభుత్వమూ ఇలాంటి సాయం చేయలేదని ఆయన అన్నారు. ఏపీకి ఇచ్చిన నిధుల్లో ప్రతీపైసాకు తమ దగ్గర లెక్క ఉందన్నారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మరి ఎందుకు సభ జరగడం లేదని ప్రశ్నిస్తే.. 'పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీలు గందరగోళం సృష్టిస్తున్నారా?' అని షా ఎదురు ప్రశ్నించారు. 'మొదటి వారమంతా సభను కాంగ్రెస్ అడ్డుకుంది. ఆ తర్వాత సభ జరగకుండా చంద్రబాబు అడ్డుకున్నారు. ఇప్పుడు టీఆర్ఎస్, అన్నాడీఎంకే సభ జరగకుండా ఆందోళన చేస్తున్నాయి' అని చెప్పారు. అవిశ్వాసంపై చర్చ జరిగితే అన్ని విషయాలు ప్రజలకు తెలుస్తాయని షా అభిప్రాయపడ్డారు. సమస్య పరిష్కారం కోసం స్పీకర్ రెండుసార్లు అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేశారని, ఒకసారి కేంద్రమంత్రి జైట్లీ అందరితో మాట్లాడారని, ఇదే విషయంపై మరోసారి కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా చర్చించారని తెలిపారు. ఇందులో తాము దాచడానికి ఏమీ లేదని..చర్చ జరగాలనే కోరుకుంటున్నట్లు అమిత్ షా పేర్కొన్నారు. ఎన్డీయే నుంచి టీడీపీయే వెళ్లిపోయిందని.. వెళ్లిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత మేం ఎలా ఆపగలమని ఆయన మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఏపీలో బీజేపీ బలపడటానికి అవకాశం చిక్కిందని తెలిపారు.



లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కడప	40.0	23.0
గుంటూరు	39.4	23.1
అనంతపురం	39.0	24.8
చిత్తూరు	39.0	25.2
విజయవాడ	37.9	24.6
హైదరాబాద్	37.8	23.3
నెల్లూరు	37.5	24.9
ఏలూరు	37.0	22.0
విశాఖపట్నం	35.8	25.6
ఒంగోలు	35.6	25.6
విజయనగరం	35.0	24.0

కొనసాగిన ఎండ తీవ్రత

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ, కోస్తాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. పడమర గాలులతో వేడి పెరిగింది. మధ్యాహ్న సమయానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. తెలంగాణలో కూడా ఎండ ప్రభావం పెరిగింది. గురువారం కర్నూలు, తెలంగాణలోని కొత్తగూడెంలో 40, అనంతపురంలో 39.2 డిగ్రీలు నమోదైంది. మధ్య భారతంలో ఎండ తీవ్రత పెరుగుతున్నందున ఆ ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తాలో ఒకటి, రెండు చోట్ల ఉరుములతో వర్షాలు కురిసే అవకాశం వుందని పేర్కొన్నారు.



ఎప్పటి నుంచో సిక్కులకు ఐఎస్ఐ శిక్షణ


పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ సిక్కు యువకులకు ఉగ్రవాద శిక్షణ ఇచ్చి భారత్‌పై ఉసిగొల్పుతోంది. ఇది ఎప్పటి నుంచో సాగుతోంది.

- పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్‌సింగ్



నీటిసంరక్షణపై నిబద్ధత పాటించాలి

నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ నిబద్ధత పాటించాలి. ఎప్పుడైతే నీటిని సంరక్షిస్తామో.. అప్పుడు గ్రామాలు, కష్టపడి పనిచేసే రైతులు గొప్ప ప్రయోజనం పొందుతారు. - ప్రధాని మోదీ



గ్రిల్డ్, రోస్టెడ్ మాంసాహారంతో హైబీపీ!

బోస్టన్, మార్చి 22: అదే పనిగా గ్రిల్డ్, రోస్టెడ్ మాంసాహారం తింటున్నారా? అలా తినే వారికి అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉందని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చేసిన సర్వేలో తేలింది. బాగా రోస్ట్ చేసిన మాంసాన్ని అప్పుడప్పుడూ తీసుకునే వారికన్నా అదేపనిగా మాంసాహారం తినే వారిలో రిస్క్ 15 శాతం అధికమని పరిశోధకులు తేల్చారు.

కొత్త ప్రొటీన్‌తో లివర్ కేన్సర్‌కు చెక్

జెనివా, మార్చి 22: లివర్ కేన్సర్‌ను నియంత్రించే కొత్త ప్రొటీన్ ఎల్‌హెచ్‌పీపీని పరిశోధకులు కనుగొన్నారు. ఇది కేన్సర్ నిరూపణకు, చికిత్సకు బయోమేకర్‌గా పనిచేస్తుందని స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బాసెల్‌కు చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌పీపీ యాంటీ కేన్సర్ ప్రొటీన్‌గా పనిచేయడమే కాకుండా వ్యాధి ఏ దశలో ఉందో కూడా తెలియజేస్తుందట.

ఆర్టీసీ ఎండీగా సురేంద్రబాబు



అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సురేంద్రబాబు నియమితులయ్యారు. ప్రభుత్వం బుధవారం ఆయనకు డీజీపీగా పదోన్నతి కల్పించింది. అనంతరం ఆర్టీసీ ఎండీ బాధ్యతలను అప్పగించింది. హోంశాఖ కార్యదర్శి అనురాధ కూడా డీజీపీగా పదోన్నతి లభించింది. కాగా, సురేంద్రబాబు 2001 నుంచి 2004 వరకూ విజయవాడ పోలీసు కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం అక్టోపస్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు మళ్లీ ఆప్షన్లు

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సూపరింటెండెంట్ల విభజన కోసం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు మళ్లీ ఆప్షన్లు కోరుతున్నాయి. సీనియారిటీ విషయంలో తలెత్తిన వివాదంతో విభజన కొలిక్కి రాకపోవడంతో రెండు రాష్ట్రాల ఎక్సైజ్ ఉన్నతాధికారులు మళ్లీ ఆప్షన్లు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సాధారణ పరిపాలనా శాఖ అంతర్గత ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో పనిచేస్తున్న 63మంది ఈఎస్‌లు ఇదివరకే ఆప్షన్లు ఇచ్చారు. కానీ సీనియారిటీ వివాదంతో కొంతమంది కోర్టుకు వెళ్లడంతో దానిపై స్టే విధించింది. దీంతో కొత్తగా ఆప్షన్లు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఇరు రాష్ట్రాల అధికారులు ఇచ్చే ఆప్షన్లు, వారి స్థానికతను పరిగణలోకి తీసుకుని, విభజన ప్రక్రియను మళ్లీ చేపట్టనున్నామని అధికారులు చెబుతున్నారు.

నేటి నుంచి జార్ఖండ్ పర్యాటక మేళా

రాంచీ, మార్చి 22: ఎటుచూసినా పచ్చదనంతో అలరారే అడవులు.. అందమైన జలపాతాలు! ప్రకృతి సోయగాలతో కట్టిపడేసే జార్ఖండ్ విశిష్టతనూ, పర్యాటక అవకాశాలనూ చాటిచెప్పేందుకు ఆ రాష్ట్ర సర్కారు నడుం బిగించింది. ఇందులో భాగంగా శుక్రవారం నుంచి జార్ఖండ్ పర్యాటక మేళాను ఆరంభించనుంది. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను పర్యాటక మంత్రి అమర్‌కుమార్ రాంచీలోని మెగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభిస్తారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన టూర్‌ఆపరేటర్లు, వ్యాపారవేత్తలు ఈ మేళాలో పాల్గొంటారు. రెండో రోజు శనివారం జార్ఖండ్ ముఖ్యమంత్రి రఘువర్‌దాస్ టెక్స్‌టైల్ షోను, సాంస్కృతిక కార్యక్రమాలను ఆరంభిస్తారు. ఆదివారం వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి.

మీ సేవలోనే నాలా

ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి.. మీ సేవలో దరఖాస్తు చేస్తే చాలు

- ఆర్డీవో సంతకంతో ధ్రువపత్రం వచ్చేస్తుంది
- ఉపముఖ్యమంత్రి కేఈ వెల్లడి
- ప్రభుత్వ సేవలను ఉపయోగించుకోవాలని పిలుపు
- పరిశ్రమలకు నాలా బాధ్యత ఏపీఐఐసీదేనని స్పష్టీకరణ



అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భూ వినియోగ మార్పిడి పత్రం (నాలా) తెచ్చుకోవాలంటే ఎన్ని తిప్పలో! ఎన్ని ఖర్చులో!. కాళ్లరిగేలా తిరిగి.. అడిగిన వారందరికీ మామూళ్లు సమర్పించుకుంటేగానీ పత్రం చేతికి వచ్చేది కాదు. ఇప్పుడీ కష్టాలకు ప్రభుత్వం ముగింపు పలుకుతోంది. ఏ కార్యాలయానికీ తిరగక్కర్లేదు. ఎవరి చేతులూ తడపక్కర్లేదు. ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి.. మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే చాలు.. నాలా పత్రం చేతికి వచ్చేస్తుంది. వ్యవసాయ భూమి వినియోగ మార్పిడి విజ్ఞలను ప్రభుత్వం తగ్గించింది, నాలా కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే చాలని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి స్పష్టం చేశారు. ప్రభుత్వం తెచ్చిన ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సాగు భూములను సాగేతర అవసరాలకు ఉపయోగించుకోవాలనుకునేవారు (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ కన్వర్షన్-నాలా) నేరుగా మీ సేవా కేంద్రం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం మీ సేవా కేంద్రాల్లో 'ల్యాండ్ కన్వర్షన్ న్యూ' పేరిట సదుపాయం ఏర్పాటు చేసినట్లు కేఈ వెల్లడించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సవరించిన నాలా అంశాల గురించి కేఈ కృష్ణమూర్తి వివరించారు. మంత్రి తెలిపిన వివరాల ప్రకారం.. 'భూమి బేసిక్ విలువను రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్ registration.ap.gov.in లేదా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తెలుసుకోవచ్చు. ఈ విలువపై విశాఖ, విజయవాడల్లో 2 శాతం, మిగతా ప్రాంతాల్లో 3 శాతం నాలా ఫీజు ఉంటుంది. నాలా ఫీజును ఆన్‌లైన్‌లో లేదా చలానా రూపంలో చెల్లించి రశీదు పొందాలి. ఆ రశీదును దరఖాస్తుతో జతచేసి మీ సేవలో సమర్పించాలి. ఆతర్వాత ఆర్డీవో సంతకంతో కూడిన ధృవపత్రం వస్తుంది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత దరఖాస్తుదారుడు తన భూమిని వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. భూమి మూల విలువ మేరకు పన్ను చెల్లించకపోయినా, సర్వే నంబర్లు తప్పుగా నమోదయినా.. సంబంధిత సమాచారాన్ని తహసీల్దారు దరఖాస్తుదారుడికి మూడు రోజుల్లో తెలియజేసేలా మార్గదర్శకాలు రూపొందించినట్లు మంత్రి చెప్పారు. భూ వినియోగ మార్పిడిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు, రెవెన్యూ శాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం భూములు పొందిన సంస్థలకు ఏపీఐఐసీనే భూ వినియోగమార్పిడి ధృవపత్రం జారీచేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పరిశీలనలో ఉన్న కొత్త రెవెన్యూ డివిజన్లు ఇవే

శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నం, విజయనగరం జిల్లాలో చీపురుపల్లి, బొబ్బిలి, విశాఖ జిల్లాలో చోడవరం, చింతపల్లి, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, కృష్ణా జిల్లాలో నందిగామ, గుంటూరు జిల్లాలో బాపట్ల, ప్రకాశం జిల్లాలో మార్టూరు, దర్శి, చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి, కుప్పం, కడప జిల్లాలో బద్వేలు, కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఆత్మకూరు, అనంతపురం జిల్లాలో గుంతకల్ ఉన్నాయి.

త్వరలోనే కొత్త డివిజన్లు...మండలాలు

పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా డివిజన్‌లు, మండలాలను పెంచాలని నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి తెలిపారు. తొలి విడతలో 9 నగర మండలాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశాఖ నగరంలో మహారాణిపేట, గోపాలపట్నం, ములగాడ మండలాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరులో ఒక్కో నగర మండలం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విజయవాడలో కూడా మూడు అర్బన్ మండలాలు ఏర్పాటు కానున్నాయి. అభ్యంతరాల పరిశీలన అనంతరం ఈ వారంలోనే ఆదేశాలు ఇస్తామని కేఈ చెప్పారు. కొత్తగా 15 రెవెన్యూ డివిజన్‌లు కావాలని జిల్లా కలెక్టర్‌ల నుంచి ప్రతిపాదనలు వచ్చినట్లు మంత్రి కేఈ కృష్ణమూర్తి తెలిపారు. వీటిపై ప్రభుత్వం చర్చించి ఆమోదం తెలుపాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం ఆమోదించాక గజిట్ నోటిఫికేషన్ జారీ చేసి ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతామని, అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో కూడా అదనపు రెవెన్యూ డివిజన్‌లు కావాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారని.. త్వరలో ఆ జిల్లా కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు తెప్పిస్తామని అన్నారు.

ముంపు మండలాలపై రగడ

- వెంకయ్య చొరవ వల్లే కలిశాయి: సోము వీర్రాజు
- సీఎం వల్లే సమస్య పరిష్కారమైందని టీడీపీ కౌంటర్


అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పోలవరం ముంపు మండలాల అంశం గురువారం శాసనమండలిలో గందరగోళం సృష్టించింది. సాగునీటిపై స్వల్పకాలిక చర్చలో భాగంగా బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ... ముంపు మండలాలను కలపాలని కేంద్రాన్ని కోరాలని సీఎం చంద్రబాబుకు అప్పట్లో తానే సూచించానని, ఆ తర్వాతే సీఎం దానిపై స్పందించారని చెప్పారు. అప్పటి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు స్పందించి చొరవ తీసుకోవడం వల్లే సమస్య పరిష్కారమైందన్నారు. వీర్రాజు చెప్పిన అంశాలపై అధికార పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. చీఫ్ విప్ పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. తొలుత స్పందించింది చంద్రబాబేనని, మండలాలు కలపకపోతే ప్రమాణస్వీకారం చేయనని అనడం వల్లే వాటిని కలిపారన్నారు. బీజేపీ సభ్యుడు మాధవ్ మాట్లాడుతూ.. పట్టిసీమపై కాగ్ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జవహర్ ఏ శాఖ మంత్రి?

సాగునీటిపై చర్చ సమయంలో మండలిలో నెలకొన్న గందరగోళం.. 'కేఎస్ జవహర్ ఏ శాఖ మంత్రి' అని ప్రకటించే పరిస్థితికి తీసుకెళ్లింది. పోలవరం ముంపు మండలాలపై సోము వీర్రాజు మాట్లాడుతుండగా అధికార పార్టీ సభ్యులు నినాదాలు చేశారు. ఈ సమయంలో జవహర్‌ను ఉద్దేశించి.. 'హెల్త్ మినిస్టర్ గారు మీరు కొంచెం ఆగండి' అని వీర్రాజు అన్నారు. దీంతో తనను అవమానించారని జవహర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై డిప్యూటీ చైర్మన్ సుబ్రమణ్యం స్పందిస్తూ... ఆయన 'హెల్త్ మంత్రి' కాదని.. 'ఎక్సైజ్ మంత్రి' అని తెలిపారు. ఆయన సూచనతో ఆ మాటలను వీర్రాజు వెనక్కి తీసుకున్నారు. దాంతో సమస్య సద్దుమణిగింది.

గీతం వర్సిటీకి అటానమస్ హోదా

- వచ్చే ఏడాది నుంచి డిజిటల్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ కోర్సులు
- ఉపకులపతి ఎం.ప్రసాదరావు



మాట్లాడుతున్న గీతం వీసీ ప్రసాదరావు

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా ఇచ్చిందని, కేటగిరీ-1 విద్యాసంస్థగా గుర్తించిందని ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు వెల్లడించారు. గురువారం ఉదయం ఆయన దొండపర్తిలోని గీతం దూరవిద్యా కేంద్రంలో.. ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ శివరామకృష్ణ, రిజిస్ట్రార్ పోతరాజులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని 60 విద్యా సంస్థలకు యూజీసీ అటానమస్ హోదా ఇవ్వగా ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం రెండు మాత్రమే ఉన్నాయని, అందులో 'గీతం' ఒకటని వివరించారు. వచ్చే ఏడాది నుంచే డిజిటల్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ కోర్సులను ప్రారంభించనున్నామని ఈ సందర్భంగా ఉపకులపతి ప్రకటించారు.

వెండి పట్టీల కోసం
చిన్నారి హత్య

- ఎదురింట్లో నివసించే మహిళల కర్కశం

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వెండి పట్టీల కోసం ఏడాదిన్నర వయసున్న చిన్నారిని హత్యచేసిన సంఘటన కర్ణాటకలోని కొప్పళ జిల్లాలో గురువారం కలకలం రేపింది. కుకనూరు తాలూకా యడియాపుర గ్రామంలో ఇంటి ముందు ఆడుకుంటున్న ప్రతిభను, ఆమె ఎదురింట్లో నివసించే అంబవ్వ, మురదవ్వ ఆడిస్తున్నట్టు నటించి ఇంట్లోకి తీసుకెళ్లారు. ఆమె కాళ్లకు ఉన్న వెండిపట్టీలను తీసుకున్నారు. అనంతరం ఆమను గొంతునులిమి చంపేసి, మృతదేహాన్ని మంచం కింద దాచిపెట్టారు. ఎంతసేపటికీ చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. చిన్నారి బంధువులకు అనుమానం వచ్చి, ఎదురింట్లో చూడగా మంచం కింద మృతదేహం కనిపించింది. పోలీసులు వచ్చి ఆ ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. వెండి పట్టీల కోసం హత్య చేసినట్లు వారిద్దరూ అంగీకరించినట్టు తెలిసింది.

రెచ్చిపోయిన కామాంధులు

- చిన్నారిపై అఘాయిత్యం, బాలిక మృతి
- మహిళపై అత్యాచారం, హత్య

కొత్తూరు (విజయపురిసౌత్)/బనగానపల్లె, మార్చి 22: అభంశుభం తెలియని చిన్నారిపై ఓ వ్యక్తి అత్యాచారం చేయడంతో బాలిక మృతిచెందిన ఘటన గుంటూరు జిల్లా మాచర్ల మండలం కొత్తూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రోజు మాదిరిగానే బాలిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. గ్రామంలో ఏడేళ్లుగా నివసిస్తున్న బాలునాయక్ చిన్నారికి బిస్కెట్ ఇస్తానంటూ.. ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావం కారణంగా అరవకుండా బాలిక నోరు మూయడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందింది. పొలం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు బాలిక ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. అయితే బాలునాయక్ కూడా వారి వెంట చిన్నారిని వెతుకుతున్నట్లు నటించాడు. బాలికను తీసుకెళ్తున్న సమయంలో బాలునాయక్‌ను చూసిన స్థానికులు ఆమె తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు బాలునాయక్‌ను గట్టిగా ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. కొంతసేపటికే ముళ్లపొదల్లో బాలిక మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న మాచర్ల రూరల్ సీఐ దిలీప్‌కుమార్, విజయపురిసౌత్ ఎస్‌ఐ వాసు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన బాలునాయక్ స్వగ్రామం తెలంగాణలోని చెన్నాపేట మండలం సర్కిల్ తండాగా స్థానికులు తెలిపారు. అటు.. కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం టంగుటూరు సమీపంలో పత్తి పొలంలో గుర్తు తెలియని మహిళ(40)పై దుండగులు అత్యాచారం చేసి హత్య చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. టంగుటూరు గ్రామానికి చెందిన భూపాల్ రెడ్డి అనే రైతు శుక్రవారం పత్తి పొలం చూడడానికి వెళ్లాడు. అయితే అక్కడ ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా గట్టిగా కేకలు వేయడంతో వారు పారిపోయినట్లు తెలిసింది. అనంతరం అక్కడ గుర్తు తెలియని మహిళపై అత్యాచారం చేసి గొంతు నులిమి హత్య చేసినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న నందివర్గం ఎస్‌ఐ శంకరయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'మా' ఏపీ కార్యవర్గ ప్రమాణం



ప్రమాణం చేస్తున్న మా ఏపీ కార్యవర్గం

తెనాలి, మార్చి 22 : మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (మా ఏపీ) కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా తెనాలిలో గురువారం నిర్వహించారు. సెన్సార్ బోర్డు సభ్యుడు దిలీప్ రాజా అధ్యక్షతన తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలిగా కవిత, ప్రధాన కార్యదర్శిగా నరసింహరాజు, సహకార్యదర్శిగా శ్రీలక్ష్మి, కార్యదర్శులుగా గీతాంజలి, అన్నపూర్ణ ప్రమాణం చేశారు. తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అసోసియేషన్ గుర్తింపు కార్డును అందజేశారు.

వారంలో గోదావరి-పెన్నా టెండర్లు: ఉమ

విజయవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల్లోగా గోదావరి-పెన్నా అనుసంధానానికి సంబంధించి టెండర్లు పిలుస్తామని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. విజయవాడలోని ఆయన కార్యాలయం వద్ద గురువారం ప్రపంచ జల సంరక్షణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గోదావరి- పెన్నా అనుసంధానం చేసి భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చూడడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు 13 జిల్లాల నుంచి బస్సుల్లో రైతులను, ప్రజలను తీసుకొచ్చి జరుగుతున్న పనులపై చైతన్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. భావి తరాలకు ఉపయోగపడే విధంగా చిన్ననీటి వనరులపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని మంత్రి గుర్తు చేశారు. 116 రోజులు జరిగే జలసంరక్షణ పనులకు ప్రజలు, నీటి సంఘాల సభ్యులు, రైతు సంఘాలు ఉద్యమంలాగా కదిలి రావాలని పిలుపునిచ్చారు.

సర్వం వ్యాపారం!

సామాజిక మాధ్యమాల మాయలో పడి ఎటువంటి ఉచ్చులో చిక్కుకుంటున్నామో ఫేస్‌బుక్ ఉదంతం తెలియచేస్తున్నది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మన సమస్త సమాచారాన్నీ కొన్ని శక్తులు కొల్లగొట్టి వ్యాపార ప్రపంచానికీ, రాజకీయ ప్రయోజనాలకు దానిని ఉపయోగిస్తున్నాయన్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. కేంబ్రిడ్జ్ ఎనలిటికా సాయంతో ఎన్నికల్లో నెగ్గడానికి కుట్రపన్నుతున్నది మీరేనంటూ ఈ దేశంలోని రెండు ప్రధాన రాజకీయపక్షాలు వాదులాడుకుంటున్న తరుణంలో, సదరు సంస్థ సీఈవో ఆ పదవిని కోల్పోవడం, ఆ కుట్రకు పరోక్ష కారకుడైన ఫేస్‌బుక్ అధినేత క్షమాపణలు చెప్పడం జరిగిపోయాయి. ఒకరు ఇంతకాలమూ ఈ దేశంలో జరిగిన ఎన్నికల్లో తాము ఎలా చక్రం తిప్పింది చెప్పుకొస్తే, మరొకరు రాబోయే ఎన్నికల్లో వేలుపెట్టబోమని హామీ ఇస్తున్నారు.

కేంబ్రిడ్జి ఎనలిటికా (సీఏ) కుట్రలను గమనించలేనంత అధమస్థితిలో ఫేస్‌బుక్ ఉన్నదని నమ్మడం కష్టం. ఒక యాప్ ద్వారా తన వినియోగదారుల డేటాను వాడుకోవడానికి ఫేస్‌బుక్ సదరు సంస్థకు వీలుకల్పించినప్పుడు ఆ సంస్థ తన పరిధిల్లో పనిచేస్తున్నదీ లేనిదీ గమనించాల్సిన బాధ్యత ఉన్నది. ఫేస్‌బుక్ నిర్లక్ష్యవైఖరి కారణంగానే ఎనలిటికా ఓ చిన్న యాప్ ద్వారా 5కోట్లమంది సమాచారాన్ని కొల్లగొట్టగలిగింది. అమెరికా ఎన్నికల్లో ట్రంప్‌కు ఓటు వేయించడం నుంచి యూరోపియన్ నుంచి బ్రిటన్ బయటపడడం వరకూ అన్ని తీర్పులనూ అది ప్రభావితం చేయగలిగింది. సూపర్‌పవర్‌గా ఎదుగుతున్న భారతదేశంలో కూడా నాయకులకు అధికారాన్ని దక్కించే బాధ్యతను నెత్తినవేసుకుంది.. ఈ సంస్థ సేవలను ఉపయోగించుకొని అడ్డుతోవలో అధికారాన్ని కొట్టేయాలనుకున్నది మీరంటే మీరేనని కాంగ్రెస్, బీజేపీలు పరస్పరం విమర్శించుకుంటున్నాయి. తాము అమాయకులమని ఉభయపక్షాలూ అంటున్నా, తాను దీర్ఘకాలంగా ఈ దేశంలోని ప్రధాన పార్టీలకు సేవలందిస్తూనే ఉన్నానని ఈ సంస్థ చెప్పుకుంటున్నది. వేరే రూపాలతోనో, దేశీయ భాగస్వామిగానో ఎన్ని ఎన్నికల్లో విజయాలు సాధించినదీ గర్వంగా చెప్పుకుంటున్నది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చేయూతకోసం ఈ రెండు పార్టీలు ఈ సంస్థను ఆశ్రయించాయన్నది తెలుస్తూనే ఉన్నది. సోషల్ మీడియా, మొబైల్ మీడియా ఇత్యాది వ్యూహాలతో రాజకీయ ప్రచారాన్ని నెరవేరుస్తానంటూ, ఈ దేశంలో పదిరాష్ట్రాల్లో కార్యాలయాలు తెరిచి, నాలుగు వందల మంది ఉద్యోగులతో కార్యకలాపాలు జరుపుతున్న సంస్థ అది. మొన్నటి సార్వత్రిక ఎన్నికలతో సహా ఏయే రాష్ట్రాల ఎన్నికల్లో తాను చక్రం తిప్పిందీ ఈ వ్యాపార సంస్థ బాహాటంగానే చిట్టా విప్పుతున్నది.

వ్యక్తిగత వివరాలను దొంగలించి వాటి ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడం, రాజకీయ ప్రత్యర్థులను డబ్బు విసరడంతోనో, యువతులను ఎరవేయడం ద్వారానో దెబ్బతీయడం ఇది అనుసరిస్తున్న విధానం. తన క్లయింట్ల ప్రయోజనాలను నిలబెట్టడం కోసం అన్ని అడ్డుతోవలూ తొక్కుతున్నది. నలభైకి పైగా రాజకీయ యుద్ధాల్లో తాము ఈ దారిలోనే నెగ్గుకొచ్చామని చెప్పినందుకు ఈ సంస్థ అధినేత ఉద్యోగం కోల్పోయాడు. ఇంతకాలమూ తమ ప్రమేయంలేకుండా వ్యాపార వ్యూహాల్లో చిక్కుకుంటున్న ప్రజలు రాజకీయ ఎత్తుజిత్తుల్లోనూ ఇరుక్కున్నారని ఈ పరిణామం తెలియచెబుతున్నది. అంతర్లీనంగా ఇటువంటి కుట్రలతో ప్రజాతీర్పును ప్రభావితం చేయగలుగుతున్నప్పుడు అది నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకోదు. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు మన రాజకీయాలపైనా, ప్రజాస్వామ్యంపైనా ఎటువంటి ప్రభావాన్ని నెరపుతున్నాయో ఈ కుంభకోణం హెచ్చరిస్తున్నది. ఏ మాత్రం పారదర్శకత లేకుండా సమాచారాన్ని దోచుకోవడం, దాచడం, నచ్చిన విధంగా వినియోగించుకోగలగడం యథేచ్ఛగా సాగిపోతున్నప్పుడు సకల వ్యవస్థలూ భ్రష్టుపట్టే ప్రమాదం ఏర్పడుతుంది. వ్యక్తిగత సమాచారం గోప్యంగా లేదన్న వాస్తవం నిత్యజీవితంలో మనకు ప్రతి అడుగులోనూ అనుభవంలోకి వస్తున్నది. అది అంగడి సరుకుగా మారిపోయింది. ప్రతి వారి ఇష్టాయిష్టాలు, ప్రవర్తనలు, ప్రయోజనాలు కాచివడబోచి మార్కెట్ వ్యూహాలను తయారుచేసి భారీ లాభాలకు అమ్ముకొనే వ్యాపార సంస్థలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. ఫేస్‌బుక్ కుంభకోణం మరోమారు ఈ వాస్తవాన్ని ఎత్తిచూపింది. చుట్టూ అలుముకున్న ఈ విషపూరితమైన వాతావరణంలో, ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆధార్ డేటాకు మాత్రం భద్రత దక్కుతుందన్న నమ్మకం ఏమిటి? ఈ దేశచట్టాలను ధిక్కరిస్తూ సమాచారాన్ని చౌర్యం చేసి, దానిని దుర్వినియోగం చేస్తున్న ఓ సంస్థతో జతకట్టడానికి సిద్ధపడిన పార్టీలు అధికారం చేతిలో ఉన్నప్పుడు మాత్రం విలువలకు కట్టుబడతాయని ఎలా అనుకోగలం?

ఆధార్ సమాచారం చోరీకి గురవుతున్న వరుస ఘటనల నేపథ్యంలో, ఫేస్‌బుక్ కుంభకోణం కూడా వచ్చిచేరి డేటాప్రైవసీ విషయంలో ప్రజల ఆందోళన మరింత అధికం చేసింది.

ప్రజాసమస్యల్ని చర్చించని పార్లమెంటు!

జనగళం

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఏ చర్చా లేకుండా ప్రతీరోజూ వాయిదా పడుతుండడం బాధాకరం. ఇప్పటి వరకూ జరిగిన పార్లమెంటు సమావేశాలలో అత్యల్ప పనితీరు ప్రదర్శించిన సమావేశాలుగా ఇప్పటి సమావేశాలు రికార్డు సృష్టించడం అధికార, ప్రతిపక్షాలకు అవమానకరమని చెప్పకతప్పదు. పార్లమెంటులో వివిధ పక్షాల్ని సమన్వయం చేసి చర్చలు జరగడానికి వీలు కల్పించాల్సిన అధికార పక్షానికి ఈ అవమానంలో పెద్ద వాటా దక్కుతుంది. బడ్జెట్ సమావేశాల్లో కేటాయించిన ప్రతీ పైసా పై పూర్తి స్థాయి చర్చలు జరిగితే ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తప్పొప్పుల్ని ప్రతిపక్షాలు నిలదీస్తే, వారికీ లాభం, ప్రజలకీ లాభం. ఆ దిశగా ఆలోచించాల్సిన ప్రతిపక్షాలు తమ బాధ్యత మరచాయి. ఈ సారి తెరాస తీరు ప్రత్యేకం. ఆ పార్టీ ఎంపీలు అదే బీజేపీ పాలనకు వ్యతిరేకంగా పార్లమెంటులో రావాల్సిన అవిశ్వాస తీర్మానం రాకుండా పోయేందుకు పరోక్షంగా దోహదపడుతున్నారు. నిజంగానే బీజేపీని నిలదియ్యడమే తెరాస లక్ష్యమైతే అవిశ్వాస తీర్మానంపై చర్చ కన్నా మంచి అవకాశం ఎక్కడ దొరుకుతుంది? ఎవరి ప్రయోజనాలు నెరవేరడం ఎలా ఉన్నా, పార్లమెంటు వాయిదాలతో ప్రజా ప్రయోజనాలు మాత్రం దారుణంగా దెబ్బతింటున్నాయి.

డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

భగత్ సింగ్ బాటలో...!

జాతీయోద్యమంలో భగత్‌సింగ్ నిర్వహించిన పాత్ర అజరామరం. భగత్‌సింగ్ ధైర్యానికి, త్యాగానికి ప్రతీక. దేశభక్తికి ప్రతిరూపం, వీరత్వానికి మారుపేరు. మాతృభూమి విముక్తికోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టి పోరాడిన వీరయోధుడు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం, ఉత్తేజం. మార్పుకోసం పోరాడుతున్న వారందరికి స్ఫూర్తి చిహ్నం. జాతీయోద్యమంలో తను పాల్గొంచుకొంది కొద్దికాలమే అయినప్పటికీ చరిత్రలో చిరకాలం నిలిచాడు. తన జీవితకాలంలోనూ, మరణానంతరం ఎందరినో ఉత్తేజితులను చేసిన గొప్ప దేశభక్తుడు, ప్రపంచమే గర్వించదగ్గ మహోన్నతుడు భగత్ సింగ్.

బ్రిటీష్ వ్యతిరేక పోరాటమే కాకుండా, మొత్తం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని నడపాలని ఆయన నిశ్చయించాడు. 'ఇంక్విలాబ్ జిందాబాద్, విప్లవం వర్ధిల్లాలి' అంటూ ఆయన ఇచ్చిన నినాదం దేశవ్యాప్తంగా మారుమోగింది. ఉద్యమంలో నూతన ఒరవడి సృష్టించింది. సమ సమాజ స్థాపనకోసం సోషలిజాన్ని తన లక్ష్యంగా ఎంచుకున్న భగత్‌సింగ్, ఒక జాతిని మరొక జాతి దోపిడీ చేయని వర్గరహిత సమాజ స్థాపినే తమ అంతిమ లక్ష్యమని ప్రకటించాడు. ఇలాంటి విరోచిత విప్లవ పోరాట కార్యాచరణనే కాంగ్రెస్ కూడా సంపూర్ణ స్వాతంత్ర్యంకై డిమాండ్ చేయాల్సిన పరిస్థితిని కల్పించింది.


జాతీయోద్యమానికి ఆరాధ్యుడుగా, మార్గదర్శిగా నిలిచినటువంటి భగత్‌సింగ్ గొప్పతనాన్ని, త్యాగాన్ని గుర్తించడంలో, భావితరాలకు అందించడంలో పాలకులు విఫలమవుతూనే ఉన్నారు. జయంతులు, వర్ధంతుల సందర్భంగా మాట వరసకు కొన్ని కార్యక్రమాలు, పత్రికలకు ప్రకటనలతో సరిపెట్టుకుంటున్న దౌర్భాగ్య పరిస్థితి! దానికి తోడు భగత్‌సింగ్ ఒక టెర్రరిస్టని ముద్రవేసేందుకు, చరిత్రలో ఆయన పాత్రను తక్కువ చేసి చూపించేందుకూ కుట్రలెన్నో జరిగాయి, జరుగుతున్నాయి. దేశానికి తీవ్ర అన్యాయం చేసిన జాతి వ్యతిరేకులకు ఇస్తున్న గౌరవం కూడా భగత్‌సింగ్‌కి పాలకులు ఇవ్వకపోవడం దుర్మార్గం.

భగత్‌సింగ్ ఎంతో ముందుచూపున్న మహోన్నతుడు. నికార్సయిన లౌకిక వాది. జాతీయోద్యమానికి, దేశానికి మతతత్వం నుండి రాబోతున్న పెను ప్రమాదాన్ని అందరికంటే ముందుగా పసిగట్టినవాడు. మతతత్వం వలస పాలన కంటే అత్యంత ప్రమాదకరమైనదని హెచ్చరించినవాడు. మతం అనేది వ్యక్తిగతమని, మతతత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని పలుమార్లు స్పష్టంచేశాడు. మతోన్మాదం, సామ్రాజ్యవాదం జంట ప్రమాదాలని హెచ్చరించాడు. మత విద్వేషంతో రగిలిపోతున్న వాళ్ళు .. మనుషులను వ్యక్తిగతంగా ఏదో నేరం చేసినందుకు చంపడం లేదని, అతను హిందూ లేదా ముస్లిం లేదా సిక్కు కావడం చేతనే చంపుతున్నారని వ్యాఖ్యానించాడు. మతానికి అతీతంగా వ్యవహరించే కొత్తతరం యువత రావాలని దృఢంగా కాంక్షించాడు. ప్రతి వ్యక్తిని ముందుగా మానవుడిగా, ఆ తరువాతనే భారతీయుడిగా ఆయన గుర్తించాడు. మతం మూఢవిశ్వాసాల బంధిఖానా నుంచి దేశ ప్రజలను విముక్తి చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ఆ దిశగా కృషి చేశాడు.

జాతీయోద్యమంలో మతోన్మాద సంస్థలు నిర్వహించిన పాత్ర నామమాత్రమే. హిందూత్వ శక్తులు నిజాయితీతో కూడిన పోరాటానికి బదులు, ప్రతిసారి బ్రిటీష్‌వారికి లొంగి ప్రసన్నం చేసుకునే పనిలో ఉండిపోయారు. ఆర్ఎస్ఎస్, ఇతర సంస్థలు, పూర్తిగా సామ్రాజ్యవాదులకు సాగిలపడ్డాయి. హిందూ మతతత్వ సంస్థలు వలస పాలన అకృత్యాలను, ఆగడాలను, ఏనాడూ వ్యతిరేకించపోగా 'విభజించు పాలించు' అనే విధానాన్ని బ్రిటీష్ సామ్రాజ్యవాదం అమలు చేసేలా పూర్తి సహాయ సహకారాలు అందించాయి. అంతిమంగా దేశం రెండుగా చీలిపోయేందుకు మతోన్మాద సంస్థలే కారణమయ్యాయి. జాతి సమైఖ్యత, సమగ్రతలకోసం, వలస పాలన నుండి విముక్తికోసం అందరినీ ఒక తాటిపైకి తీసుకొచ్చి ముందుండి నడిపింది భగత్‌సింగ్ పోరాట మార్గమే.

నాడు భగత్‌సింగ్ చెప్పిన మాదిరిగానే నేడు ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదపు దుందుడుకు పోకడలు పెరిగాయి. నయా వలస వాదం కారణంగా దేశ ఆర్థిక, రాజకీయ సార్వభౌమాధికారం ప్రమాదంలో పడింది. అన్ని రకాల మతతత్వ శక్తులు దేశ ఐక్యతను, సమగ్రతను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. నిత్యం స్వదేశీ, జాతీయత గురించి గొంతు చించుకుంటున్నవారు. సామ్రాజ్యవాద అనుకూల విధానాలను నిస్సిగ్గుగా అమలు చేస్తున్నారు. ఇవేనా జాతీయతకు అసలైన నిదర్శనాలు? నేడు దేశంలో చరిత్ర, సైన్స్, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికత్వాలపై దాడి తీవ్రతరమవుతోంది. భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తేనే తట్టుకోలేక దాడులు తెగబడుతున్న వైనం. ఈ నేపథ్యంలో అప్రజాస్వామిక పద్ధతుల్లో దేశవిచ్ఛిన్నానికి పూనుకుంటున్న మనువాద భావజలానికి, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో నవ సమాజ నిర్మాణంకోసం యువత సన్నద్ధం కావాలి.

■ కోట రమేష్



వారు అమరులు

తెల్లదొరలను దేశం నుండి తరిమికొట్టాలనే ధ్యేయంతో ప్రాణార్పణకు సిద్ధమై పోరాడుతున్న ఈ వీరులను– సైమన్ కమిషన్ రాకను నిరశిస్తూ పంజాబ్ కేసరి లాల లజపతిరాయ్ నాయకత్వంలో ఉద్యమిస్తున్న ప్రజలపై బ్రిటీష్ పోలీసులు తీవ్రంగా లాఠీ ఛార్జ్ చేయడం ఆగ్రహం తెప్పించింది. లాఠీ చార్జ్‌కు నాయకత్వం వహించిన బ్రిటీష్ పోలీసు అధికారి స్కాట్, సాండర్స్‌లకు బుద్ధిచెప్పాలని నిర్ణయించుకొన్నారు. 1928 డిసెంబర్ 17న ఆ ఇద్దరు అధికారులలో ఒకరైన సాండర్స్‌ను హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ సభ్యులైన భగత్ సింగ్, రాజగురు, ఆజాద్, జయగోపాల్, సుఖదేవ్‌లు వీరోచితంగా హతమార్చారు. ఆ తరువాత 1929 ఏప్రిల్ 8న కేంద్ర శాసన సభ(నాటి పార్లమెంట్)లో బాంబు విసిరిన సంఘటనలో కావాలనే అరెస్టయ్యారు. పట్టుబడితే ప్రాణం పోతుందని తెలిసీ ఉద్యమ ప్రచారానికి కోర్టు విచారణను వాహికగా మార్చుకోవాలని భావించి అరెస్టయ్యారు. అప్పటి వరకూ మిస్టరీగా ఉన్న సాండర్స్ హత్య కేసు భగత్ సింగ్ దగ్గర దొరికిన పిస్టల్‌తో తేలిపోయింది. ఆ పిస్టల్‌తోనే సాండర్స్‌ను హత్య చేశారని నిర్ధారణ అయ్యింది. అందరూ ఊహించినట్టుగా పార్లమెంట్‌పై దాడి కేసులో భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష పడలేదు. ఆ కేసులో భగత్ సింగ్, బటుకేశ్వర్‌దత్తులకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. కాని సాండర్స్‌ను హత్య చేసినందుకు ఉరిశిక్ష తప్పలేదు. తమకు క్షమాభిక్ష కోరుతూ భగత్ సింగ్ తండ్రి కిషన్ సింగ్ పెట్టుకొన్న దరఖాస్తుపై భగత్ సింగ్ స్పందిస్తూ 'పితృ హృదయం పడే బాధను అర్థం చేసుకోగలను. పుత్రవాత్సల్యంతో నాకు వెన్నుపోటు పొడిచారు. నా అభిప్రాయాలను తెలుసుకోకుండా నా తరపున ఆ పని చేసే హక్కు మీకు లేద'ని అన్నాడు.

నిజానికి మార్చి 24న ఉరిశిక్ష అమలుకు సమయ నిర్ధారణ జరగగా దేశ వ్యాప్తంగా అలముకున్న ఉద్రిక్తతకు, యువతలో చెలరేగిన ఆవేశానికీ భయపడిన బ్రిటీష్ పాలకులు ముందు రోజు రాత్రే పని పూర్తి చేశారు. చట్టం ప్రకారం సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు ఉరితీయడం నిషిద్ధం. అయినా ప్రజల ఆగ్రహానికి దడచిన పాలకులు నడిరాత్రి పూట ఆ యువకిషోరాలను నిర్దాక్షిణ్యంగా పొట్టనపెట్టుకొన్నారు. అంతేగాక, జైలు ప్రధాన ద్వారం గుండా కాకుండా జైలు వెనుక గోడను బద్దలు కొట్టి ఆ మహావీరుల శవాలను రహస్యంగా బయటకు తీసుకెళ్లారు. లాహోరుకు చాలా దూరంలోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోని హుస్సేనీ వాలా సమీపంలో సట్లేజ్ నది వొడ్డున వారి శవాలను దహనం చేశారు. లాహోరు వీధులన్నిటిలో పహరా కాస్తున్న ప్రజలకు ఈ విషయం తెలిసి ఘటనా స్థలానికి వెళ్లే పాటికే అక్కడ ముగ్గురు వీరుల శవాలు బూడిద కుప్పగా మిగిలున్నాయి.

ఆ వీరులను ఉరితీసిన జైలు ఇప్పుడు లేదు. అక్కడో పెద్ద మార్కెట్ ఉంది. ఆ ప్రదేశానికి భగత్ సింగ్ చౌక్ (షహీద్ చౌక్) అని పేరు పెట్టారు. ఆ మహా వీరుల్ని దహనం చేసిన హుస్సేనీ ప్రాంతాన్ని 12 గ్రామాలను ఇవ్వడం ద్వారా 1961లో పాకిస్థాన్‌తో మార్పిడి చేసుకొంది మన ప్రభుత్వం. ఈ ప్రదేశంలో భటుకేశ్వర దత్తుని ఆయన కోరిక మేరకు దహనం చేశారు. భగత్ సింగ్ తల్లి కోరిక మేరకు 1968లో ఇక్కడో స్మారక స్థూపంతో పాటు వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అయితే, 1971 యుద్ధ సమయంలో వీటిని తొలగించి తీసుకెళ్లిన పాకిస్థాన్ పాలకులు నేటికీ తిరిగివ్వలేదు.


ఏ పార్లమెంట్‌లో భగత్ సింగ్ బాంబులేశాడని శిక్ష విధించారో అదే పార్లమెంటు భవనంలో 15 ఆగస్టు 2008న 18 అడుగుల భగత్ సింగ్ కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. 'సౌశీల్యం కలవారికి విషం అమృతంలా, మేరు పర్వతం చిన్న రాయిలా, పాము పూలదండలా, సింహం లేడి పిల్లలా కనపడుతుందని' భర్తృహరి చెప్పింది ఈ వీరులకు సరిగ్గా సరిపోతుంది.

■ చెరుకూరి సత్యనారాయణ

(భగత్‌సింగ్, ఆయన సహచరులను ఉరితీసి నేటికి 87 సంవత్సరాలు)

చైనాతో చెలిమి చిందు!

■ బల్బీర్ పుంజ్



రైట్ పాయింట్

దౌత్యంలో స్నేహ ప్రతిపాదనలు సార్థకమైనవేనా? భారత్, చైనాలు పరస్పరం ప్రత్యర్థులుగా పరిగణించుకోకుండా 'కలసి నృత్యం చేయాలని' చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి ఇటీవల సూచించారు. పోటీదారైన భారత్ పట్ల చైనా సుహృద్భావాన్ని హర్షిస్తూ, ఆ సంఫీభావం పరిపూర్ణంగా వర్థిల్లాలని కోరుకొనేవారు ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది ఉన్నారు. ఇందుకొక కారణం ఉన్నది. ఇది, అంటే 21వ శతాబ్ది 'ఆసియా శతాబ్ది' గా గణుతికెక్కింది. 'ఒకే యూరోప్' పురోగమనం నిరుత్సాహకరంగా ఉన్నది. అంతర్జాతీయ వ్యవహారాలలో అమెరికా యుగం ముగిసినట్టేనన్న జోస్యాలను విశ్వసించక తప్పడం లేదు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తమ దేశాన్ని క్రమంగా ప్రపంచ బాధ్యతల నుంచి ఉపసంహరిస్తున్నారు. ఆర్థిక, వాణిజ్య రంగాలలో సంరక్షణ విధానాలకు ప్రాధాన్యమిస్తున్నారు. స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ)లో ప్రపంచ ప్రథమ స్థానంలో ఉన్న అమెరికాను అధిగమించడానికి ద్వితీయ స్థానంలో ఉన్న చైనా ఆరాటపడుతోంది చైనా అధ్యక్షుడు క్సి జిన్ పింగ్ తాను జీవిత కాలం అధికారంలో ఉండేలా, పాలక కమ్యూనిస్టు పార్టీ చేత రాజ్యాంగాన్ని సవరింప చేయించారు. రష్యాలో అధ్యక్షుడు పుతిన్ ఇంతదూరం వెళ్ళలేదుగానీ , ఆయన తిరుగులేని నియంతగా వ్యవహరిస్తున్నారు. జిన్‌పింగ్ వలే పుతిన్ కూడా జీవిత కాల అధ్యక్షుడుగా పరిణమించే అవకాశాన్ని త్రోసిపుచ్చలేము.

సరే, తన ఇరుగు పొరుగు ఆగ్నేయాసియా దేశాల పట్ల చైనా తన అగ్ర రాజ్య అభిజాత్యాన్ని కొనసాగిస్తోంది. బీజింగ్ పాలకుల దురాక్రమణ రాజకీయాలు చైనా పెత్తందారీతనాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆగ్నేయాసియా దేశాలు గట్టిగా భావిస్తున్నాయి. దక్షిణ చైనా సముద్రంలోని దీవుల విషయంలో చైనా అగ్రరాజ్యాధిపత్యాన్ని ఫిలిప్పీన్స్ చవి చూస్తోంది. ఆ దీవుల వివాదంలో మూడో దేశ జోక్యానికి బీజింగ్ ససేమిరా అంటోంది. ఫిలిప్పీన్స్ తనవిగా పేర్కొంటున్న దీవులలో చైనా తన సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకొంది! హైనాన్ దీవి విషయంలో వియత్నాంకు బీజింగ్ సామ్రాజ్యవాద దురహంకారం అనుభవంలోకి వచ్చింది. చైనా తన సైనిక సదుపాయాలను ఇప్పటికే ఆ దీవికి విస్తరింపచేసింది . దక్షిణ చైనా సముద్రంలో వియత్నాం చమురు నిక్షేపాల అన్వేషణకు పూనుకోవడం పట్ల బీజింగ్ తీవ్ర అభ్యంతరం తెలుపుతోంది.

భారత్‌తో సంబంధాల విషయంలోనూ బీజింగ్ ఎప్పుడూ ఈ ఆధిపత్య వాద విధానాన్నే అనుసరిస్తోంది. భారత్‌లోని ప్రవాస టిబెటన్లకు న్యూఢిల్లీ ఎటువంటి వసతులు కల్పించకూడదని బీజింగ్ డిమాండ్ చేస్తోంది. అరుణాచల్‌ప్రదేశ్ పై భారత్ సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి చైనా నిరాకరిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారీ లోటుకు భారత్ ను బీజింగ్ తప్పుపడుతోంది. అయితే చైనాలోని భారతీయ వ్యాపారులకు సరైన సదుపాయాలు కల్గించడానికి నిరాకరిస్తుంది.

వారిపై తీవ్ర ఆంక్షలు విధిస్తోంది. అంతేగాక చట్ట విరుద్ధ లావాదేవీలకు పాల్పడుతున్నారంటూ భారతీయ వ్యాపారులను పలువిధాల వేధింపులకు గురిచేస్తోంది. సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకొనే విషయమై న్యూఢిల్లీ–బీజింగ్‌ల మధ్య దశాబ్దాలుగా చర్చలు నడుస్తున్నాయి. అయితే ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదు. భారత్‌లో మరిన్ని భూభాగాలపై తమకు హక్కు ఉన్నదని చైనా వాదిస్తోంది. ఉగ్రవాదుల అణచివేతకు తమ సహకారం పూర్తిగా ఉంటుందని బీజింగ్ పదే పదే చెప్పుతుంది. అయితే ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా ముంబై పై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌ను కాపాడడంలో పాకిస్థాన్‌కు చైనా పూర్తిగా సహకరిస్తోంది.

న్యూఢిల్లీని వ్యతిరేకించడానికి, భారత్ ప్రయోజనాలను దెబ్బతీయడానికి పాకిస్థాన్‌ను చైనా పరోక్షంగా ఉపయోగించుకొంటున్నంతవరకు డ్రాగన్ (చైనాకు ప్రతీక), ఏనుగు (భారత్‌కు ప్రతీక) మధ్య నాట్యం జరగడమనేది అసాధ్యం. పాకిస్థాన్‌లో తన సైనిక ప్రయోజనాలను పెంపొందించుకోవడానికై, వాణిజ్యం మిషతో రవాణా సదుపాయాలను అభివృద్ధిపరచడానికి వందలకోట్ల డాలర్లను బీజింగ్ వెచ్చిస్తోంది. భారత్ నుంచి పాకిస్థాన్ స్వాధీనం చేసుకున్న కొన్ని భూభాగాలను తనకు కట్టబెట్టించుకోవడంలో కూడా బీజింగ్ సఫలమయింది.

ఈ పరిణామాలేవీ ఇంకెంతమాత్రం రహస్యమైనవికావు. న్యూఢిల్లీలోని ప్రస్తుత ప్రభుత్వం దేశ ప్రజల సహకారంతో చైనా ఆధిపత్య వాదాన్ని సమర్థంగా ఎదుర్కొంటోంది. బీజింగ్ పాలకులు ప్రతిపాదించిన 'వన్ బెల్ట్, వన్ రోడ్', 'సిల్క్ రోడ్' ఇత్యాది అంతర్జాతీయ ప్రాజెక్టులలో భాగస్వామికావడానికి న్యూఢిల్లీ తిరస్కరిస్తోంది. చైనా సామ్రాజ్యవాద విస్తరణను ఆడ్డుకోవడానికి భారత్ సమర్థ నాయకత్వాన్ని అందించగలదని ఆగ్నేయాసియా దేశాలు ఆశిస్తున్నాయి. న్యూఢిల్లీలో జరిగిన ఆసియన్ శిఖరాగ్ర సదస్సులోను, ఇటీవల సౌరశక్తి పై జరిగిన సమావేశంలోనూ ఆగ్నేయాసియా దేశాలు తనకు వ్యతిరేకంగా కలసికట్టుగా వ్యవహరించడం బీజింగ్ పాలకులను తీవ్ర కలవరపాటుకు గురి చేస్తోంది. హిందూ మహాసముద్రంలో చైనా విస్తరణను అడ్డుకొనే లక్ష్యంతోనే ఫ్రాన్స్, ఇండియాలు ఇటీవల ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో భారత్–చైనాల మధ్య స్నేహ సంబంధాలు గొప్పగా వర్ధిల్లాయి. 'భాయ్–భాయ్' అనే సుహృద్భావ వాతావరణం ఆ రోజుల్లో రెండు దేశాల ప్రజల మధ్య వెల్లి విరిసింది. అయితే 1962లో భారత భూభాగాలను ఆక్రమించుకోవడం ద్వారా బీజింగ్ పాలకులు నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. ఆ రోజులు గతించాయి. కాలం మారింది. న్యూఢిల్లీలోని ప్రస్తుత ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులలోనూ అటువంటి అవమానాలు పునరావృతం కావడానికి అనుమతించబోదు. చైనాతో అడుగడుగునా నిర్మొహమాటంగా వ్యవహరిస్తోంది. చైనా పాలకులు తమ అసలు ఉద్దేశాలను దాచిపెట్టేందుకు ఇచ్చే ఆకర్షణీయమైన నినాదాలను న్యూఢిల్లీ పాలకులు ఇంకెంత మాత్రం విశ్వసించరు. భారత్‌తో నిజంగా సత్సంబంధాలను బీజింగ్ కోరుకొంటున్న పక్షంలో తన భారత్ వ్యతిరేక వైఖరిని విడనాడాలి. భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ ను ఉపయోగించుకోవడానికి స్వస్తి చెప్పాలి. అప్పుడు మాత్రమే చైనా విదేశాంగ మంత్రి వాంగ్ మహాశయుడు ఆశిస్తున్న విధంగా భారత్ –చైనా కలసికట్టుగా ముందుకు సాగుతాయి.



చైనా పాలకులు ఒక వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకోవడం మంచిది. ఒక ప్రజాస్వామ్యదేశంగా భారత్ తన ప్రజలకు పటిష్ఠ పాలననందిస్తోంది. జాతీయ ప్రయోజనాల విషయంలో కులమతాలు, భావజాలాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకునే సుదృఢరాజ్య వ్యవస్థ ఉన్నది. ఇప్పుడు తియ్యని మాటలతో భాతర ప్రజలను గానీ, న్యూఢిల్లీ పాలకులను గానీ ఎవరూ మాయపుచ్చలేరు. భారత్ తన రక్షణ పాటవాన్ని వ్యూహాత్మకంగానూ, ఆయుధ సంపత్తిపరంగానూ పెంపొందించుకోవడాన్ని సమర్థంగా కొనసాగిస్తోంది. చైనా ఏ క్షణంలో ఎటువంటి సైనిక దుస్సాహసానికి పాల్పడినా పమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ సర్వ సన్నధంగా ఉన్నది.


జనాభా పరంగా ప్రపంచంలో రెండు అతి పెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనాలు కలసికట్టుగా ముందుకు సాగడమనేది ఆ రెండు దేశాలకే గాక యావత్ మానవాళికి మేలు చేస్తుందనడంలో ఎవరికీ ఎటువంటి సందేహం లేదు. ప్రపంచ జనాభాలో ఈ రెండు ఆసియా దేశాల జనాభా మొత్తం 36 శాతంగా ఉన్నది. ఈ ధరిత్రిపై నడయాడుతున్న దాదాపు 800 కోట్ల మంది ప్రజలలో 300 కోట్ల మంది ఈ రెండు దేశాల ప్రజలే. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రపంచంలో ప్రతి మూడో వ్యక్తి చైనీయుడు లేదా భారతీయుడే.

> **చైనా తన సామ్రాజ్యవాద ఆకాంక్షలను త్యజించి, ఇరుగు పొరుగు దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తుందా? ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సందిగ్ధతకు తావులేని వైఖరి అనుసరిస్తుందా? ప్రస్తుత పరిస్థితులలో ఇవి సాధ్యమేనా? సాధ్యమే అయితే భారత్ చైనాతో కలిసి విశ్వనర్తనం చేయగలదు.**

భారత్, చైనాల మధ్య సంపూర్ణ శాంతి సామరస్యాలు వర్ధిల్లితే ఆసియాలో కోట్లాది ప్రజలు పేదరికం నుంచి బయటపడతారు. ఆ శాంతి సామరస్యాల సాధన ఒక సుందర స్వప్నమే, సందేహం లేదు. మరి చైనా తన సామ్రాజ్యవాద ఆకాంక్షలను త్యజించి, ఇరుగు పొరుగు దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తుందా? ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సందిగ్ధతకు తావులేని వైఖరి అనుసరిస్తుందా? ప్రస్తుత పరిస్థితులలో ఇవి సాధ్యమేనా? సాధ్యమే అయితే ఆ సుందర స్వప్నం సాకారమవుతుంది. అప్పుడు భారత్ చైనాతో కలిసి విశ్వ నర్తనం చేయగలదు.

అంతా అవిశ్వాస మయం

■ తెలకపల్లి రవి



గమనం

ఏ పదజాలం వెనక ఏ వర్గ ప్రయోజనాలున్నాయో తెలుసుకోనంత వరకూ ప్రజలు మోసపోతుంటారన్నది లెనిన్ ప్రసిద్ధ సూక్తి. త్రిపురలో లెనిన్ విగ్రహాలు కూలగొడుతుంటే రామచంద్రగుహ వంటి చరిత్ర కారులు కూడా చిత్రాతిచిత్రమైన వివరణలు ఇస్తున్న పరిస్థితిలో ఈ సూక్తి చెప్పడం కొందరికి రుచించిక పోవచ్చు. కాని తెలుగు రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితిని చెప్పడానికిది చక్కగా సరిపోతుంది.ప్రత్యేక హోదా కన్నా ప్యాకేజి మిన్న అని ప్రత్యేక తరగతులు పెట్టిన తెలుగుదేశం వారు, ప్రశంసాత్మక సన్మానాలు చేసిన వారు దానికోసం పోరాడే మహాయోధులై పోయారు! పైగా ఇంత వీరోచిత విన్యాసానికి గాను తమను కీర్తించని వారంతా ద్రోహులేనని ముద్రవేసేస్తున్నారు. ప్యాకేజీ పాచిపోయిన లడ్డూ అంటే కాదు పరమ ప్రసాదమని కళ్లకద్దుకుని గుండెల్లో పెట్టుకున్న వారు ఇప్పుడు అవతలివారిపై ఆరోపణలు సంధిస్తున్నారు. ఆ హోదాను నిరాకరించి ప్యాకేజీ ప్రహసనంతో మురిపించి చివరకు దానికీ సున్నా చుట్టిన బీజేపీ వారు కూడా డిటో డిటోగా తప్పంతా తెలుగుదేశంపైకి తోసి తాము తప్పుకోవాలనుకుంటున్నారు. ప్రత్యేక హోదా కోరడం అనే విధానం చాటున తమ నిష్క్రియా ప్రియత్వాన్ని వివాదాస్పద కదలికలను సమర్థించుకునే వైసీపీ వారు కేంద్రంలోని మూల విరాట్టుల కన్నా అమరావతిలోని పూజారులపై ఎక్కువగా కత్తులు దూస్తున్నారు. ప్రత్యేక కమిటీలు వేసి పాచిపోయిన లడ్డూలు పరిశీలించిన జనసేనానులు ఏదైతేనేం నిధులు ముఖ్యం అని నోరు జారి సర్దుకోవడానికి సతమతమవుతున్నారు. వివరం లేని విభజనతో విమర్శలు మూటకట్టుకున్న కాంగ్రెస్ వారు తాము ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించి పాపప్రక్షాళన చేసుకున్నారు. అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తూనే వున్న వామపక్షాలూ, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు ఇతర సంస్థలనూ కాంగ్రెస్‌తో సహా అన్ని ప్రతిపక్షాలనూ కలుపుకొని ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇన్నిటి మధ్యనా ఎవరి పాత్ర ఏమిటో ఎవరి మాత్ర ఏమిటో తెలియక తలలు పట్టుకోవడం ప్రజల వంతవుతున్నది. కేంద్రం వంచన, రాష్ట్రం భజన కలిపి హోదా నిరాకరణ వారిని ఆగ్రహావేదనలకు గురిచేస్తున్నది.

ఇదంతా ఒక సార్వత్రిక అవిశ్వాసానికి దారి తీసింది. అనివార్యంగా అందరినీ ఆ వైపు నెట్టింది. టీడీపీ, ప్రభుత్వం నుంచే గాక ఎన్డీఏ నుంచి కూడా వైదొలగి అవిశ్వాసం నోటీసుకు సిద్ధపడాల్సి వచ్చింది. అంతకు ముందే నోటీసు ఇచ్చిన వైసీపీకీ మెలికలతో మద్దతు అంటూనే ఇలా చేయడం సహజంగానే రాజకీయ క్రీడకు అద్దం పట్టింది. అక్కడి నుంచి దృశ్యం లోక్‌సభకు మారి తేదీలు దొర్లిపోతున్నా మోడీ మాయాజాలంలో కాలం స్తంభించిపోయింది. అపర చక్రధారులూ, జగదేక చంద్రులూ నిరసనలకే (బయిట పగటి వేషాలకు) పరిమితమవుతున్న నిస్సహాయత. అవినీతి భరిత అస్తవ్యస్త అన్నాడీఎంకేను అలా వుంచితే, జాతీయ ప్రత్యామ్నాయ నిర్మాణ తెలుగు నేత అనుయాయులు అవిశ్వాసాన్ని ఆహ్వానించలేని విచిత్రం. అవిశ్వాసాన్ని ఆహ్వానిస్తున్నామని అహోరాత్రులూ ఉద్ఘోషిస్తూనే అనుమతించడానికి నిరాకరిస్తున్న విడ్డూరం. అంతా రామమయం అని పాడిన భక్తరామదాసు వుంటే ఈ రామనవమి రోజున అంతా అవిశ్వాసమయం అని పాట ఎత్తుకునేవాడే! అజేయ మోడీ మహరాజ్ అవిశ్వాసాన్ని అనుమతించకపోవడంలోనూ అంతర్గత కారణాలున్నాయని ఆ పార్టీ వారే చెబుతున్నారు. అందుకే, 'అవిశ్వాస్ అంధర్ హై' అని ఒక చర్చలో నేనన్నాను. 1979, 1990, 1998 కేంద్ర ప్రభుత్వ పతనాలను గుర్తు చేసుకుంటే ఈ అవిశ్వాసానికి ఆధారాలు తెలుస్తాయి. సంఖ్యాపరంగా సమస్యలు లేకపోయినా తీగలాగనివ్వడానికి మోడీ సర్కారు సిద్ధంగా లేదన్నది సత్యం.



> **ఏపీలో పార్టీలు పరస్పర నిందారోపణలకు తాత్కాలిక విరామం ప్రకటించి, ప్రత్యేక హోదాను కేంద్రం నుంచి రాబట్టడం పైనే దృష్టిపెట్టాలి. ప్రభుత్వం అందరినీ కలుపుకొని పోరాడే బదులు, అందరిపై ముద్రవేసి తానే వీర సమరం చేస్తున్నానని చెప్పుకోవడానికి పాకులాడకూడదు. అంభంలో కుంభం అన్నట్టు ఈ సందర్భం తెలుగు రాష్ట్రాల మధ్య వివాదంగా మారడమూ మంచిది కాదు.**

అయితే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకూ, అవిశ్వాసం వచ్చినా రాకపోయినా ప్రకటించడం జరిగిపోయింది. ప్రత్యేక హోదాపై గురువారం కూడా జాతీయ రహదారుల దిగ్బంధం జయప్రదంగా నడిచింది. గతంలో హోదాకోసం ఉద్యమాలంటేనే ఉరిమిపడిన చంద్రబాబు కూడా జపాన్ తరహాలో అదనపు శ్రమ ద్వారా నిరసించాలని పిలుపునిచ్చారు. తానే అపహాస్యం చేసిన హోదా నినాదం ఎత్తుకోవడానికి, దానిపై నిరసనలు పోరాటాలు కోరడానికి కారణం ప్రజాగ్రహమే. హోదా నిరాకరించడమే గాక దానికి సరిపడా ప్యాకేజీ అన్న బీజేపీ కేంద్రం ఈ క్షణం వరకూ పదివేల కోట్లకు పైచిలుకు మాత్రమే ఇచ్చినట్టు అధికారికంగా అంగీకరించింది(అందులో అధిక భాగం 2017 తర్వాత) గనక దాని సహాయ నిరాకరణకు వేరే రుజువులు అక్కర్లేదు. పదేళ్లలో చేయవలసినవి అప్పుడే చేశామని పదేపదే చెప్పుకోవడం మరో వంచన. విభజన చట్టం పదేళ్లలో ఈ రెండు రాష్ట్రాలు సమగ్రాభివృద్ధి సాధించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పిందే తప్ప పదేళ్ల వ్యవధి నివ్వలేదు. అయిదేళ్ల వరకూ అరకొరగానే సహాయం అందించిన కేంద్రం, ఆ చట్టం స్ఫూర్తికి తన వాగ్దానాలకు కూడా పూర్తిగా ద్రోహం చేసింది. టీడీపీతో వారి గిల్లికజ్జాలు, ఆరోపణలు ఇప్పుడు చెప్పడం అర్థం లేనిపని. తమతో వుంటే కప్పిపెడతామనీ కాదంటే విప్పిచెబుతామని అనడం హాస్యాస్పదం. అలాగే తమను అవమానించారని, బెదిరించారని ఆపరేషన్ గరుడ నడిపిస్తున్నారని టీడీపీ ఆరోపిస్తున్నది. ఈ దాగుడుమూతలాపి ఉభయులూ ఆ వివరాలన్నీ ప్రజలతో పంచుకుంటే చాలా మంచిది. లేకపోతే ఇద్దరినీ అనుమానించాల్సిందే. ఈ సమయంలో రాజకీయ రాబందులను వదలిపెట్టి, అల్పజీవులైన సినీతారలపై విరుచుకుపడుతున్న నేతల పరిస్థితి ఇంకా జుగుప్సాకరం. రెండు తెలుగు రాష్ట్రాలకూ న్యాయం జరిగి సుహృద్భావం వెల్లివిరియాలనే కాంక్ష తప్ప, 2019 ఎన్నికలకు దాన్ని మరో సారి వినియోగించుకోవాలని ఎవరు భావించినా చాలా దారుణమని చెప్పాలి.

రాజకీయాలన్నాక విమర్శలూ వివాదాలు వుండనే వుంటాయి. ఏపీ అన్నా, తెలంగాణ అన్నా ఎవరో ఒక్క నాయకుడే కాదు. ఒక్క పార్టీనే కాదు. ఎవరూ విమర్శలకు అతీతులు కాదు. మేమే పవిత్రులం మీరంతా సామంతులన్నట్టు మాట్లాడే హక్కు ప్రజాస్వామ్యంలో ఎవరికీ వుండదు. 'సమయానుకూలముగా రేట్లు హెచ్చించబడును' అన్నట్టు ఆయా పార్టీల పిల్లిమొగ్గలకు తగ్గట్టు నృత్యం చేయాల్సిన బాధ, వారి మాటలనే వేదాలుగా తీసుకోవాల్సిన బాధ ఇతరులకు ఉండదు. అహం అసహనం ఎవరికీ నప్పేవి కావు. ఉదాహరణకు వవన్‌కళ్యాణ్ పార్టీ ఆవిర్భావ సభలో లోకేశ్‌పై ఆరోపణలు చేస్తే టీడీపీగా ఖండించవచ్చు గాని ఆయనను బీజేపీ ఏజంటుగా చెప్పడమేమిటి? మీరంతా కలిసే పోరాడారు కదా! విజయసాయి రెడ్డి ప్రధానిని కలిశారు గనక ఆ కార్యాలయం నేరాలను మాఫీ చేసే కేంద్రంగా మారిందంటూ టీడీపీ చేస్తోన్న విమర్శలకు ఢిల్లీ స్పందించకపోవడంలోని మర్మమేమిటి? వైసీపీ కూడా కేంద్రం కన్నా చంద్రబాబే హోదాను నిరాకరించినట్టు చెప్పడం విషయాన్ని పక్కదారి పట్టించడం కాదా? ఇవన్నీ చాలనట్టు పవన్‌కూడా ఒక ఇంటర్వ్యూలో నోరు జారి తర్వాత సర్దుకోవాలసి వచ్చింది. అయితే దానిపై గగ్గోలు వల్ల ఏం ప్రయోజనం? అందుకే నా ఉద్దేశంలో ఏపీలో పార్టీలు పరస్పర నిందారోపణలకు తాత్కాలిక విరామం ప్రకటించి, ప్రత్యేక హోదాను కేంద్రం నుంచి రాబట్టడం పైనే దృష్టిపెట్టాలి. ప్రభుత్వం అందరినీ కలుపుకుని పోరాడేబదులు, అందరిపై ముద్రవేసి తానే వీర సమరం చేస్తున్నానని చెప్పుకోవడానికి పాకులాడకూడదు. అంభంలో కుంభం అన్నట్టు ఈ సందర్భం తెలుగు రాష్ట్రాల మధ్య వివాదంగా మారడమూ మంచిది కాదు. అవిశ్వాసం చర్చ ఎదుర్కొనే ఆలోచనే వుంటే అనుమతించాలి. అందుకోసం టీఆర్ఎస్ ఎంపీలతో మాట్లాడి హామీ ఇవ్వాలి (ఎందుకంటే టీడీపీ, వైసీపీ చెబితే వినవలసిన అవసరం వారికి లేదు. సంఖ్యాపరంగా తీర్మానం కోసం మద్దతు కోరవలసిన అవసరం వీరికి లేదు) అన్నా డీఎంకు సమస్యే కాదు. వారిని సర్దుబాటు చేసే బదులు సాకుగా వాడుకోవడం మోడీ హవా తగ్గుతున్న నేపథ్యాన్ని మరింత వేగిర పరుస్తుంది. ఆయా సందర్భాలలో పరోక్షంగా ప్రత్యక్షంగా ఆయనకు వంతపాడిన, పాడుతున్న వారంతా కూడా మూల్యం చెల్లించుకోవలసే వస్తుంది. విభజన సమస్యలు పరిష్కరించుకోకుండా రాజకీయ అస్త్రాలుగా వాడుకోవడానికి జరిగే ప్రతి ప్రయత్నమూ ప్రజలు తిరస్కరించే దశ వస్తుంది.



అఖిలపక్ష ఆందోళనతో విజయవాడ కనకదుర్గమ్మ వారధి వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

విశాఖలో ఆందోళనలో పాల్గొన్న నేతలు



విశాఖ ఎన్ఏడీ జంక్షన్‌లో అఖిలపక్షాల ఆందోళనతో నిలిచిన వాహనాలు(ఇన్‌సెట్‌లో) విజయవాడలో జనసేన,సీపీఎం కార్యకర్తల ఆందోళన

న్యాయం కోసం

రాస్తా.. బంద్!

హోదా గోదాలో కేంద్రాన్ని 'దిగ్బంధిం'చిన ఆంధ్రుడు

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

ప్రత్యేక హోదా కోసం పోరు హోరెత్తింది. నిరసనల రణం రోడ్డెక్కింది. ఏపీకి అన్నింటా అన్యాయం చేసిన కేంద్రాన్ని గోదాలోకి లాగి 'దిగ్బంధిం'చింది. ప్రత్యేక హోదా సాధన సమితి నిర్ణయం, రావాల్సిన నిధులు అడిగినందుకు ఏపీపై యుద్ధం ప్రకటించిన మోదీ సర్కారుపై టీడీపీ ఇచ్చిన నిరసన పిలుపుతో గురువారం రాష్ట్రమంతటా ఉద్యమ వేడి రగిలింది. హోదా సాధన సమితికి మద్దతుగా వామపక్షాలు, కాంగ్రెస్, వైసీపీ, జనసేన కార్యకర్తలు ఎక్కడికక్కడ జాతీయ రహదారులను దిగ్బంధించారు. టీడీపీ శ్రేణులు నిరసన శిబిరాలు, ర్యాలీలతో రాష్ట్ర హక్కుల ఆకాంక్షను బలంగా వినిపించాయి. అటు హోదా ఉద్యమకారులు, ఇటు తెలుగు తమ్ముళ్లు వేసవి ఎండలతో పోటీపడుతూ, పోరు సెగలను రగిలించారు. చెదురుమదురు ఘటనలు, కొన్ని చోట్ల హోదా మద్దతుదార్ల అరెస్టులు వంటివి మినహాయిస్తే, ఆసాంతం ప్రశాంతంగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగడం విశేషం. రాష్ట్ర రాజధాని మొదలు, ఆ మూల రాయలసీమ నుంచి ఈ మూల ఉత్తరాంధ్ర వరకు ఉద్యమబాట పట్టాయి. ఉదయ నుంచే జనం నిరసన ర్యాలీలు, ధర్నాలకు కదిలారు. నెల్లూరు జిల్లా బుజబుజ నెల్లూరులో వామపక్షాలు, జనసేన, వైసీపీ నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ జిల్లా ఎన్టీఆర్ నగర్ సర్కిల్ వద్ద టీడీపీ నాయకులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'నుడా' ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నాయకత్వంలో ఈ ప్రదర్శన జాతీయ రహదారిని ముట్టడించింది. తూర్పుగోదావరి జిల్లా అచ్చంపేటలో విపక్ష పార్టీలు రోడ్లపై ధర్నా చేపట్టగా, తునిలో టీడీపీ శ్రేణులు భారీగా రోడ్డెక్కారు.

దీక్ష చేసిన మాజీ స్పీకర్


శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఆందోళనల్లో వైసీపీ నాయకుడు ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నారు. పెద్దపాడు వద్ద హైవేని విపక్షాలు దిగ్బంధించడంతో కొన్ని గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. రాజాంలో మాజీ స్పీకర్ ప్రతిభాభారతి ఒకరోజు రిలే నిరాహార దీక్షలో కూర్చొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాల్లో నిరసనలకు సిద్ధమయిన టీడీపీ కార్యకర్తలకు మద్దతుగా జనం కదిలారు. పాలకొల్లులో వైసీపీ కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో జాతీయ రహదారి ఉద్యమకారుల నినాదాలతో మార్మోగిపోయింది. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా పెళ్లూరులో విపక్షాలు రోడ్లను దిగ్బంధించాయి. దీంతో చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి కొద్దిగంటపాటు స్తంభించిపోయింది. మార్కాపురం, చీరాల, సింగరాయకొండ, ఉలవపాడు, అద్దంకి తదితర ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో పసుపు జెండాలు రెపరెపలాడాయి. విజయనగరంలో జాతీయ రహదారిని విపక్ష నేతలు ముట్టడించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు చిన్నంనాయుడు, జడ్పీ ఛైర్‌పర్సన్ స్వాతిరాణి నాయకత్వంలో రోజంతా నిరసన శిబిరం సాగింది. అనంతపురం జిల్లాలో ప్రతిపక్షాలు జాతీయ రహదారిని ముట్టడించగా, తెలుగు తమ్ముళ్లు హైవే వెంట శిబిరాలు నిర్వహించారు. నల్లపాడులో తెలుగు తమ్ముళ్లు మోదీ దిష్టిబొమ్మను తగలబెట్టారు. రాయదుర్గంలో వామపక్షాలు, టీడీపీ నాయకులు కలిసి కదిలితే, పాలసముద్రంలో వైసీపీ, కాంగ్రెస్ శ్రేణులు ఒక్కటిగా ఉద్యమించారు. కడప జిల్లా రైల్వే కోడూరులో టీడీపీ కార్యకర్తలు వినూత్నంగా ఉద్యమించారు. 'చంద్రబాబు ప్రధాని కావాలి' అంటూ ఆయన రంగుల చిత్రపటంతో ఆ పట్టణ కూడలి వద్ద నినదించడం అందరినీ ఆకర్షించింది. అనంతరం ఆ మానవ హారం నిర్వహించారు. కర్నూలు జిల్లాలోని మునగాలపాడు వద్ద బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిపై వామపక్షాలు, వైసీపీ నాయకులు బైఠాయించారు. కర్నూలు వైపు ఒక్క వాహనం కూడా రాకుండా అడ్డుకొన్నారు. ఈ క్రమంలో కొందరు ఐద్వా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. చిత్తూరు జిల్లా తిరుపతిలోని హైవే ఆందోళనలతో అట్టుడికింది. విపక్షాల పిలుపు మేరకు శ్రీకాళహస్తి సమీపంలోని నాయుడుపేట రహదారిపై కొన్ని కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ జిల్లా అంతటా టీడీపీ శ్రేణులు ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు, శిబిరాలతో హోదా ఆకాంక్షను చాటాయి.

యాత్రలో నిరసన తెలిపిన జగన్

గుంటూరు జిల్లాలో పాదయాత్ర సాగిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూడా నిరసనల్లో పాల్గొన్నారు. అఖిలపక్షం పిలుపు మేరకు గుంటూరు సమీపంలోని హైవే దిగ్బంధనంలో ఆయన పాలుపంచుకొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం కావూరులో పాదయాత్రలో ఉన్న ఆయన, కొద్దిసేపటికి విరామం ప్రకటించి కారులో వై జంక్షన్ వద్దకు చేరుకొన్నారు. అక్కడ వైసీపీ కార్యకర్తలు చేపట్టిన ఆందోళనల్లో పాల్గొన్నారు. ఏపీకి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నాయని ఆగ్రహించారు. అనంతరం తిరిగి తన యాత్ర కొనసాగించారు.



▸ మాజీ ఎమ్మెల్యే వినూత్న నిరసన



హోదా పోరులో పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు విభిన్న వేషధారణతో గురువారం రోడ్డుపైకి వచ్చారు. కాషాయ వస్త్రాన్ని కట్టుకొని, తలకు పసుపు జెండాను ఆయన చుట్టుకొన్నారు. చేతిలో ఒక డబ్బాను ఆడిస్తూ, 'బీజేపీ డబ్బా పవన్ కల్యాణ్' అని నినదిస్తూ, అందరినీ ఆకర్షించారు. ఆ డబ్బాకు ఒకవైపు బీజేపీ డబ్బా పవన్ అని రాసి ఉండగా, రెండోవైపు సేవ్ ఏపీ అన్న విజ్ఞప్తి ఉంది.

బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్తారు

- ▸ హోదా ఇవ్వకపోతే ఆందోళనలు తీవ్రం
- ▸ పలు పార్టీల నేతల హెచ్చరిక
- ▸ 'రహదారి దిగ్బంధం' విజయవంతం
- ▸ భవిష్యత్ కార్యాచరణకు నేడు అఖిలపక్షం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకపోతే బీజేపీకి ప్రజలే బుద్ధి చెప్తారని పలు పార్టీల నాయకులు హెచ్చరించారు. ప్రత్యేక హోదా డిమాండ్‌తో గురువారం రాష్ట్రవ్యాప్తంగా 'రహదారుల దిగ్బంధం' కార్యక్రమం విజయవంతంగా, శాంతియుతంగా జరిగింది. విజయవాడలో 16వ నంబర్ జాతీయ రహదారిపై వారధి వద్ద ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ రహదారి దిగ్బంధ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, నటుడు శివాజీ, అమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు రామారావు, లోక్‌సత్తా నాయకుడు బాబ్జీ, జనసేన నాయకుడు మహేశ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధనేకుల మురళీ మోహన్, వైసీపీ నేత, మాజీ మంత్రి పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పుడు కేవలం రెండు గంటలు మాత్రమే రహదారి దిగ్బంధం జరిగిందని, కేంద్రం హోదా ప్రకటించకపోతే, రానున్నరోజుల్లో 24 గంటల పాటూ రహదారి దిగ్బంధం, అమరణ దీక్షల కార్యక్రమాలు ఉధృతంగా జరుగుతాయని ప్రకటించారు. కాగా, టీడీపీ నేత దేవినేని అవినాశ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో విజయవాడలో రహదారుల వెంట టెంట్లు వేసుకుని నాయకులు, కార్యకర్తలు ధర్నాలు చేశారు. విశాఖలో మద్దిలపాలెం కూడలిలో ప్రత్యేకహోదా సాధన సమితి ఆధ్వర్యంలో చలసాని శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణశ్రీనివాస్, ద్రోణంరాజు శ్రీనివాస్, వామపక్ష, జనసేన నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు.విజయనగరం జిల్లా గజపతినగరంలో ప్రత్యేక హోదా కోసం నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న డాక్టర్ జశ్వంత్‌నాయుడుకు చలసాని సంఘీభావం ప్రకటించారు. కాగా, ఆందోళనలకు మద్దతు తెలిపిన వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అభినందనలు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ రూపకల్పనకు శుక్రవారం అఖిలపక్షాలు, ప్రజాసంఘాలతో సమావేశమవుతున్నట్లు ఆయన ప్రకటించారు.

ఎందుకివ్వరు?

- ▸ హోదాకు ఏపీ అన్ని విధాలుగా అర్హం
- ▸ ఆర్థికమంత్రి జైట్లీ చెప్పినవేవీ సరికాదు
- ▸ కాగ్ మాజీ డైరెక్టర్ భట్టాచార్జీ హెచ్చరిక



న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ తెగదెంపుల ప్రభావం బీజేపీపై తీవ్రంగా ఉంటుందని కాగ్ మాజీ డైరెక్టర్ జనరల్ గోవింద భట్టాచార్జీ అభిప్రాయపడ్డారు. '2014లో కాంగ్రెస్ తప్పిదాలు చేసింది. దీనినుంచి బీజేపీ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదు. దీని ప్రభావం 2019 ఎన్నికల్లో కచ్చితంగా ఉంటుంది. ఆర్థికంగా ప్రయోజనాలు కోల్పోయిన రాష్ట్రాలకు ప్రత్యేక కేటగిరీ హోదా కల్పించాల్సి ఉంది. దానివల్ల కేంద్ర ప్రణాళికా గ్రాంట్లు, కేంద్ర నిధుల్లో అధిక వాటా లభిస్తుంది. వివిధ రకాల పన్నుల్లో రాయితీల వల్ల పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వస్తారు" అని ఆయన తెలిపారు. గోవింద భట్టాచార్జీ గతంలో 'భారతదేశంలో ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలు' అనే పుస్తకాన్ని రచించారు. గురువారం ఆయన స్క్రోల్ వెబ్‌సైట్‌కు ప్రత్యేక వ్యాసం రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే 76 శాతం రెవెన్యూ లభించేదని తెలిపారు. "ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ చట్టంలో దాన్ని చేర్చలేదు. ప్రత్యేక హోదా డిమాండ్ భావోద్వేగాలు, రాజకీయాలతో కూడినదంటూ కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ కొట్టిపారేశారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలన్నీ ఒకటే అని కూడా చెప్పారు. ఆయన చెప్పింది సరికాదు.ప్రత్యేక కేటగిరీ హోదాకు, రాజ్యాంగానికీ సంబంధం లేదు" అని గోవింద భట్టాచార్జీ స్పష్టం చేశారు.

అదనపు లబ్ధి నిజం...

ప్రత్యేక హోదా పొందుతున్న 8 ఈశాన్య, 3 హిమాలయ రాష్ట్రాలకు గాడ్గిల్ ఫార్ములా క్రింద ప్రత్యేక ప్రణాళికా నిధుల్లో 30 శాతం లభిస్తున్నాయని గోవింద భట్టాచార్జీ తన వ్యాసంలో తెలిపారు. సాధారణ కేటగిరీ రాష్ట్రాలకంటే నాలుగు రెట్లు వాటికి కేంద్ర ప్రణాళికా సహాయం లభిస్తుందన్నారు. దీనికి అదనంగా పారిశ్రామిక రాయితీలూ వస్తున్నాయని చెప్పారు. "ఇలాంటి ప్రోత్సాహకాలవల్ల ప్రత్యేక హోదా రాష్ట్రాల్లో పెద్దగా పారిశ్రామిక అభివృద్ధి జరగలేదు. అయితే... ఆంధ్రప్రదేశ్‌కు ఇదే వెసులుబాటు కల్పిస్తే మొత్తం రాష్ట్రం రూపురేఖలు మారిపోతాయి. ఎందుకంటే, ఏపీలో బలమైన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ ఉంది. ఇది బలమైన పారిశ్రామిక కేంద్రంగా మారేందుకు వీలు కల్పిస్తుంది. జీఎస్టీ మినహాయింపులు, రీఫండ్స్, రాయితీలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా నవ్యాంధ్ర బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందగలదు" అని భట్టాచార్జీ విశ్లేషించారు. 14వ ఆర్థిక సంఘం ఏపీ సహా 11 రాష్ట్రాల్లో 1.90 లక్షల మేరకు రెవిన్యూ లోటు భర్తీ చేసేందుకు గ్రాంట్‌ను నిర్ణయించిందని... ఇందులో 77 శాతం 8 ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలకే వెళ్లిందని ఆయన చెప్పారు. ఏపీకి కేవలం 11 శాతం అంటే 22,113 కోట్లు దక్కాయన్నారు. "ప్రతి ఆర్థిక సంఘం తన సిఫారసుల్లో ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలకు నిధులు పెంచుతూ పోతోంది. ఎప్పుడూ, ఏ పథకాల విషయంలోనూ తగ్గించలేదు. విభజన వల్ల నష్టపోయిన, ఆదాయ వనరులు కోల్పోయిన నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా కల్పించడం అవసరమే, అది సాధ్యమే" అని చెప్పారు. ఏపీకి రాజధాని నిర్మాణానికి 33 వేల కోట్లు, పోలవరానికి భారీగా నిధులు, రైల్వేజోన్ ఇవ్వాల్సిన అవసరముందన్నారు. కానీ... రాజకీయాలతో సమస్యను జటిలంగా మార్చారన్నారు. సానుకూల ధోరణితో వ్యవహరించకపోతే 2014లో కాంగ్రెస్‌కు పట్టిన గతే... 2019లో బీజేపీకీ పడుతుందని అన్నారు.

ఐదో రోజూ రచ్చే..!

▸ మళ్లీ నోటీసిచ్చిన తెలుగుదేశం, వైసీపీ

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యుద్ధంలో ఎన్నిసార్లు విఫలమైనా ప్రయత్నం ఆపని గజనీ మహ్మద్ తరహాలో టీడీపీ కేంద్రంపై పోరుసాగిస్తూనే ఉంది. వరుసగా ఐదోరోజూ అవిశ్వాస అస్త్రాన్ని ప్రయోగించి విపక్షాల మద్దతు కూటగట్టడంలో విజయం సాధించింది. కానీ సభ సజావుగా నడిపే పరిస్థితులు లేవన్న సాకుతో స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆ అవిశ్వాస తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. వరుసగా ఐదో రోజూ చర్చకు అనుమతించలేదు. సభను శుక్రవారానికి వాయిదావేసేశారు. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అవిశ్వాసాన్ని అనుమతించాలని టీడీపీ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని.. కొందరైతే పార్టీ జెండాను కూడా తీసుకొచ్చి వారి స్థానాల్లోనే నిలబడి నినాదాలు చేశారు. వైసీపీ ఎంపీలు కూడా తమ తమ స్థానాల్లో ఉన్నారు. స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించగానే, కొన్ని పార్టీల ఎంపీలు నిరసనలకు దిగారు. దీంతో 30 సెకన్లలోపే సభ వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు సభ మొదలైంది. టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లో ఆందోళన కొనసాగించారు. అవిశ్వాస తీర్మానంపై స్పీకర్ ప్రకటన చేస్తూ.. 'కేంద్ర మంత్రి మండలిపై తమకు విశ్వాసం లేదని గౌరవ ఎంపీలు తోట నరసింహం, వైవీ సుబ్బారెడ్డి నుంచి నోటీసులు అందాయి. హౌస్ ఆర్డర్‌లో ఉంటేనే తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనేది నిర్ణయించగలను' అని అనగానే.. అన్నాడీఎంకే ఎంపీలు 'ఓ...' అంటూ పెద్దపెద్దగా అరచి గందరగోళం సృష్టించారు. స్పీకర్ కనబడకుండా టీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులు అడ్డుపెట్టేందుకు పలుమార్లు ప్రయత్నించారు. దీంతో సభను స్పీకర్ మరుసటి రోజుకు వాయిదా వేశారు. శుక్రవారం అవిశ్వాస తీర్మానానికి టీడీపీ, వైసీపీ నోటీసులు ఇచ్చాయి.

రాజ్యసభలోనూ..

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు డిమాండ్ చేస్తూ రాజ్యసభలో టీడీపీ ఎంపీలు తమ ఆందోళనలను ఉధృతం చేశారు. గురువారం సభ ప్రారంభమయ్యాక కార్మికులకు సంబంధించిన ముఖ్యమైన పేమెంట్ ఆఫ్ గ్రాట్యూయిటీ బిల్లు పెండింగ్‌లో ఉందని, దాని ఆమోదానికి ఎంపీలు సహకరించాలని ఛైర్మన్ వెంకయ్యానాయుడు విజ్ఞప్తి చేశారు. బిల్లు ప్రవేశపెట్టక ముందు టీడీపీ ఎంపీ సీఎం రమేశ్‌కు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా రమేశ్ 2014 నాటి విభజన హామీలు, ప్రత్యేక హోదా అంశాలను ప్రస్తావించగా, ఆయనను వెంకయ్య అడ్డుకున్నారు. దీనిపై గత సమావేశాల్లోనే చర్చ జరిగిందని, ఆర్థిక మంత్రి సమాధానం కూడా ఇచ్చారని అన్నారు. అయినా కూడా సీఎం రమేశ్ మాట్లాడబోగా, ఆయన మైక్ కట్ అయింది. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదంటూ.. కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు ప్లకార్డుతో వెల్‌లోకి వెళ్లారు. కొద్దిసేపటికి మిగతా పార్టీల సభ్యులు కూడా వెల్‌లోకి వచ్చారు. వెనక్కి వెళ్లిపోవాలని పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఎంపీలు వినకపోవడంతో వెంకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది పద్ధతి కాదు. సభను ఎందుకు వాయిదా వేస్తున్నారని ప్రజలు అడుగుతున్నారు' అని అన్నారు. సభ్యుల తీరుపై తన నిస్సహాయత వ్యక్తం చేశారు.





రాజ్యసభలో ఏపీ ఎంపీల నినాదాలు

ప్రతిష్టంభన వీడేదెలా?

- ▸ తొలిసారి ప్రభుత్వం చొరవ
- ▸ విపక్ష నేతలతో మంత్రి విజయ్ గోయల్ భేటీ
- ▸ సుజనా, మైత్రేయన్‌లతో మంతనాలు
- ▸ ఆజాద్ నివాసానికి వెళ్లి గంటసేపు చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 22: పార్లమెంటు బడ్జెట్ మలివిడత సమావేశాలు 14 రోజులుగా స్తంభించిపోయాక.. ఆ ప్రతిష్టంభనను తొలగించేందుకు మోదీ ప్రభుత్వం తొలిసారి చొరవ చూపింది. ట్రిపుల్ తలాక్, జాతీయ ఓబీసీ కమిషన్ తదితర కీలక బిల్లులు రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్నాయి. లోక్‌సభలో మాదిరిగా ప్రభుత్వానికి ఇక్కడ మెజారిటీ లేకపోవడం.. చర్చలేకుండా బిల్లుల ఆమోదానికి అవకాశం లేకపోవడంతో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయల్ రంగంలోకి దిగారు. టీడీపీపీ నేత సుజనాచౌదరి, అన్నాడీఎంకే నాయకుడు మైత్రేయన్‌తో చర్చించారు. విపక్ష కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ నివాసానికి వెళ్లి గంటపాటు మంతనాలు జరిపారు. లోక్‌సభలో ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ ఉందని.. అవిశ్వాస తీర్మానంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని గోయల్ మీడియాకు తెలిపారు. టీఆర్ఎస్, టీఎంసీ నేతలను కూడా కలిసి ఆందోళనలు మానుకోవాలని కోరతానన్నారు. సభ్యులు వెల్‌లో నిలబడితే అవిశ్వాసం నోటీసులను చర్చకు అనుమతించడం స్పీకర్‌కు కష్టమవుతుందని మరో సహాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ చెప్పారు. రాజ్యసభలో పెద్దఎత్తున నిరసనలకు దిగినా.. కార్మికులకు ఉద్దేశించి గ్రాట్యుటీ బిల్లును సభ గురువారం ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో కీలక బిల్లుల ఆమోదంపై ప్రభుత్వంలో ఆశలు చిగురించాయి. అందుకే తొలిసారి చర్చలకు శ్రీకారం చుట్టింది.

ఎంపీలను మీవద్దకే తీసుకొస్తాం

వారి సంతకాలూ సమర్పిస్తాం.. పార్టీల అభిప్రాయం అడగండి

అవిశ్వాసంపై స్పీకర్‌కు టీడీపీ అభ్యర్థన



స్పీకర్ సుమిత్ర మహాజన్‌ను కలిసిన టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 'అవిశ్వాస తీర్మానాన్ని చేపట్టడానికి కావాల్సిన 50 మంది ఎంపీలను మీ కార్యాలయానికి పెరేడ్‌గా తీసుకొస్తాం. కావాలంటే వారితో సంతకాలు చేయించి మీకు సమర్పిస్తాం. లేదంటే మీరే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అవిశ్వాసంపై అన్ని పార్టీల అభిప్రాయాన్ని తీసుకోండి. దాని ప్రకారం నిర్ణయం తీసుకోండి' అని స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు టీడీపీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. కానీ ఆమె సానుకూలంగా స్పందించలేదని కేంద్ర మాజీమంత్రి సుజనా చౌదరి వెల్లడించారు. గురువారం ఎంపీలు తోట నరసింహం, కొనకళ్ల నారాయణ, రామ్మోహన్ నాయుడు, మాల్యాద్రి శ్రీరాం, మురళీ మోహన్, పండుల రవీంద్రబాబు, నిమ్మల కిష్టప్ప, కేశినేని నాని, అవంతి శ్రీనివాస్ స్పీకర్‌ను ఆమె చాంబర్లో కలిశారు. అనంతరం సుజనా విలేకరులతో మాట్లాడారు. 'లోక్‌సభలో అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చేవారిని లేచి నిల్చోవాలని స్పీకర్ కోరుతున్నారు. ఆమె గనుక తన స్థానంలో నిల్చుంటే వెల్‌లో ఉన్నవారు తమతమ స్థానాలకు వెళ్లిపోతారు. అప్పుడు 50 మందిని లెక్కించడం వీలవుతుంది. ఈ విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లాం. కానీ సానుకూలంగా స్పందించలేదు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరాం. అన్ని పార్టీల నేతలు పాల్గొంటారు కాబట్టి అందరి అభిప్రాయాలు తీసుకుని దానికి అనుగుణంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశాం. దీనికీ ఆమె సానుకూలంగా లేరు. ఇక ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కావడం లేదు' అని వాపోయారు. కొన్ని పార్టీలతో కలిసి కేంద్రప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని సుజనా ధ్వజమెత్తారు. సర్కారు పారిపోతోందని అనడం లేదని.. కానీ వాళ్ల వైఖరి సరిగా లేదన్నారు.

3 ఈశాన్యానికి మరో వేల కోట్లు!

- ▸ కొనసాగుతున్న హోదా ఫలాలు
- ▸ కేంద్ర కేబినెట్‌లో తాజా నిర్ణయం
- ▸ నవ్యాంధ్ర విషయంలోనే సాకులు

న్యూఢిల్లీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): "ఇప్పుడు ఎవ్వరికీ హోదా లేదు. అన్ని రాష్ట్రాలూ సమానమే" అంటూ నవ్యాంధ్రకు మొండిచేయి చూపించిన కేంద్ర ప్రభుత్వం... ఇప్పటికీ 'హోదా' జాబితాలోనే ఉన్న సిక్కింతోపాటు మొత్తం ఈశాన్య రాష్ట్రాలకు మరో 3వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. బుధవారం కేంద్ర మంత్రివర్గం దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈశాన్య పారిశ్రామిక అభివృద్ధి పథకం-2017 కింద నూతన పారిశ్రామిక యూనిట్లకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు కల్పిస్తారు. ఈశాన్య రాష్ట్రాలకు పదేళ్లపాటు ప్రత్యేక పారిశ్రామిక రాయితీలు అందివ్వాలని కేంద్రం ఇదివరకే నిర్ణయించుకుంది. అందుకు అనుగుణంగా ప్రతి త్రైమాసికానికి నిధులు విడుదల చేస్తూ వస్తోంది. దీనిపై గతంలోనే 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. నిజానికి ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఈ పారిశ్రామిక ప్రోత్సహకాలు, రాయితీలు కల్పించాలని కోరుతోంది. ఈ వెసులుబాటు తమకూ కల్పించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, టీడీపీపీ నేత సుజనా చౌదరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు మార్చి 5న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కోరారు. ఈ విషయంపై వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభుతో మాట్లాడతానని చెప్పి... నిర్దిష్టమైన హామీ ఇవ్వకుండా జైట్లీ దాటవేశారు. తాజాగా బుధవారం ప్రకటించిన పథకం ప్రకారం కేంద్ర పెట్టుబడుల ప్రోత్సాహకాల కింద ప్లాంట్, యంత్రాల పెట్టుబడిలో 30 శాతం, కేంద్ర వడ్డీ ప్రోత్సాహకాల కింద బ్యాంకుల నుంచి వర్కింగ్ క్యాపిటల్ అడ్వాన్స్‌లో 3 శాతం, కేంద్ర సమగ్ర బీమా ప్రోత్సాహకాల కింద భవనం, ప్లాంట్ యంత్రాలపై బీమా మొత్తం నూటికి నూరు శాతం చెల్లింపు, జీఎస్టీలో కేంద్ర వాటా పూర్తిగా తిరిగి చెల్లింపు, ఆదాయపన్ను పూర్తిగా తిరిగి చెల్లింపు, రకరకాల రవాణా వ్యయాల తిరిగి చెల్లింపు, ఈపీఎఫ్ కింద 3.67 శాతం మేరకు యజమానులకు తిరిగి చెల్లించడం, పింఛను పథకం, రోజ్‌గార్ ప్రోత్సాహ యోజన వంటి ఉద్యోగ ప్రయోజనాల పథకాలకు 8.33 శాతం చెల్లింపులను కేంద్రమే భరించనుంది. సరిగ్గా ఈ రాయితీలనే తమకూ కల్పించాలని ఏపీ డిమాండ్ చేసింది దీనిపై సరిగా సమాధానం చెప్పకుండా, అరుణ్ జైట్లీ తన విలేకరుల సమావేశంలో వేరే అంశాలను ప్రస్తావించారు. ఒక్క రాష్ట్రానికి ఇస్తే ఇతర రాష్ట్రాలు అడుగుతాయని వింత సమాధానం చెప్పారు. పైగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చలకు రాలేదంటూ నెపం వారిపై తోశారు.



ఎకనమిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ చదివిన అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. యూపీఎస్సీ ఈ అభ్యర్థులకు ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ / ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్, కంబైన్డ్ జియోసైంటిస్ట్, జియాలజిస్ట్ పరీక్షలను నిర్వహిస్తోంది.

UPSC

కెరీర్ గైడ్

ఈ పరీక్షలతో అందుకోండి..
కేంద్ర కొలువులు

ఆర్థిక, సాంఖ్యక శాస్త్ర పట్టభద్రులకు చక్కని అవకాశం.. ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ / ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామ్ (ఐఈఎస్ / ఐఎస్ఎస్). యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో గ్రేడ్-4 కేడర్‌లో జూనియర్ టైం స్కేల్ హోదాతో కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఐఈఎస్ / ఐఎస్ఎస్ - 2018 నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సంబంధిత వివరాలను తెలుసుకుందాం..

ప్రస్తుత ఐఈఎస్ / ఐఎస్ఎస్ నోటిఫికేషన్ ద్వారా యూపీఎస్సీ మొత్తం 46 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ ఖాళీలు: 14. ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఖాళీలు: 32. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో నిర్దేశించిన విధంగా అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూకు 200 మార్కులు కేటాయించారు.

కెరీర్ ఎలా ఉంటుంది?

ఐఈఎస్ / ఐఎస్ఎస్‌లో ఎంపికైన వారి కెరీర్ ఆర్థిక వ్యవహారాల సంబంధిత శాఖల్లో అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ హోదాతో (జూనియర్ టైం స్కేల్) ప్రారంభమవుతుంది. వీరిని నేషనల్ శాంపిల్ సర్వే, లేబర్ బ్యూరో, నీతి ఆయోగ్, ఆర్థిక సంఘం, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమ, విద్య, వ్యవసాయం, వాణిజ్యం తదితర విభాగాల్లో నియమిస్తారు. అనుభవం, పనితీరు ఆధారంగా డిప్యూటీ డైరెక్టర్ / అసిస్టెంట్ అడ్వైజర్ (సీనియర్ టైం స్కేల్), జాయింట్ డైరెక్టర్ / డిప్యూటరీ అడ్వైజర్, సీనియర్ ఎకనమిక్ అడ్వైజర్, ప్రిన్సిపుల్ అడ్వైజర్, చీఫ్ అడ్వైజర్ స్థాయికి చేరుకోవచ్చు.

రాత పరీక్ష ఇలా..


రాత పరీక్ష మొత్తం 1000 మార్కులకు ఉంటుంది. ఇందులో ఆరు పేపర్లు ఉంటాయి. వాటిలో పేపర్ - 1 జనరల్ స్టడీస్, పేపర్ - 2 జనరల్ ఇంగ్లీష్ మాత్రమే ఐఈఎస్, ఐఎస్ఎస్‌కు కామన్. వీటిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మిగిలిన పేపర్లు సబ్జెక్టివ్ (ఎకనమిక్స్, స్టాటిస్టిక్స్). ప్రతి సబ్జెక్ట్‌కు నాలుగు పేపర్లు ఉంటాయి. వీటిని కన్వెన్షనల్ (డిస్క్రిప్టివ్) రూపంలో నిర్వహిస్తారు. సమాధానాలను ఇంగ్లీష్‌లోనే రాయాల్సి ఉంటుంది. ప్రతి పేపర్‌లో సమాధానాలను రాయడానికి మూడు గంటల (180 నిమిషాలు) సమయం ఉంటుంది. డిస్క్రిప్టివ్ పేపర్లలో షార్ట్ ఆన్సర్ క్వశ్చన్స్ / చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌తో కూడిన ప్రశ్నలు, లాంగ్ ఆన్సర్ క్వశ్చన్స్, కాంప్రహెన్షన్ ప్రాబ్లమ్స్ ఇస్తారు. ప్రతి విభాగం నుంచి కనీసం ఒక ప్రశ్నకైనా సమాధానాన్ని రాయాలి.

ఇండియన్ ఎకనమిక్ సర్వీస్

పేపర్	సబ్జెక్ట్	మార్కులు
పేపర్ - 1	జనరల్ ఇంగ్లీష్	100
పేపర్ - 2	జనరల్ స్టడీస్	100
పేపర్ - 3	జనరల్ ఎకనామిక్స్ - 1	200
పేపర్ - 4	జనరల్ ఎకనామిక్స్ - 2	200
పేపర్ - 5	జనరల్ ఎకనామిక్స్ - 3	200
పేపర్ - 6	ఇండియన్ ఎకనామిక్స్	200
మొత్తం		1000

ఎకనమిక్స్

ఇందులో ప్రశ్నల క్లిష్టత పీజీ స్థాయిలో ఉంటుంది. డిస్క్రిప్టివ్ పేపర్ కాబట్టి కేవలం ప్రిపరేషన్‌కే పరిమితం కాకుండా సమాధానాలను రాయడం ప్రాక్టీస్ చేయాలి. జనరల్ ఎకనమిక్స్‌లో థియరీ ఆఫ్ ప్రొడక్షన్, క్వాంటిటేటివ్ మెథడ్స్ ఇన్ ఎకనమిక్స్, నేషనల్ ఇన్‌కమ్, ఫైనాన్షియల్ - క్యాపిటల్ మార్కెట్, ఎకనమిక్ గ్రోత్, ఏసియన్ ఫైనాన్షియల్ క్రైసిస్, ఐఎంఎఫ్, పబ్లిక్ ఫైనాన్స్, ఎన్విరాన్‌మెంటల్ ఎకనమిక్స్, మార్కెట్, ప్లానింగ్ వంటి విషయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇండియన్ ఎకానమీలో ఫెడరల్ ఫైనాన్స్, బడ్జెట్, అర్బనైజేషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్, ఫారెన్ ట్రేడ్, మనీ బ్యాంకింగ్ వంటి అంశాలు కీలకం. ఆయా అంశాలకు సంబంధించిన గణాంకాలపై పట్టు సాధించాలి.



ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్

పేపర్	సబ్జెక్ట్	మార్కులు
పేపర్ - 1	జనరల్ ఇంగ్లీష్	100
పేపర్ - 2	జనరల్ స్టడీస్	100
పేపర్ - 3	స్టాటిస్టిక్స్ - 1	200
పేపర్ - 4	స్టాటిస్టిక్స్ - 2	200
పేపర్ - 5	స్టాటిస్టిక్స్ - 3	200
పేపర్ - 6	స్టాటిస్టిక్స్ - 4	200
మొత్తం		1000

స్టాటిస్టిక్స్

స్టాటిస్టిక్స్ - 1లో ప్రాబబిలిటీకి 40 శాతం వెయిటేజీ ఉంటుంది. ఇందులో రాణించాలంటే పలు రకాల సిద్ధాంతాలపై (బేయిస్ థీరం వంటివి) అవగాహన ఉండాలి. స్టాటిస్టికల్ మెథడ్స్ కోసం 45 శాతం, న్యూమరికల్ అనాలిసిస్‌కు 15 శాతం వెయిటేజీ ఉంటుంది. స్టాటిస్టిక్స్ - 2లో లీనియర్ మోడల్స్ (అనాలిసిస్ ఆఫ్ వన్ - వే వంటివి)కు 25 శాతం వెయిటేజీ, ఎస్టిమేషన్స్‌కు 25 శాతం, హైపోథిసిస్ టెస్టింగ్‌కు 25 శాతం, మల్టీవెరైటీ అనాలిసిస్, తదితరాలకు 25 శాతం వెయిటేజీ ఇస్తారు. స్టాటిస్టిక్స్ - 3లో శాంప్లింగ్ టెక్నిక్‌కు 35 శాతం, ఎకనామిక్ సాటిస్టిక్స్‌కు 25 శాతం వెయిటేజీ, స్టాటిస్టిక్స్ - 4లో స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ ఆపరేషన్స్ రీసెర్చ్‌కు 40 శాతం, డెమోగ్రఫీ అండ్ వైటల్ చార్ట్స్‌కు 40 శాతం వెయిటేజీ ఉంటుంది.

ఎకనమిక్స్ పేపర్లన్నీ డిస్క్రిప్టివ్ పద్ధతిలోనే ఉంటాయి. స్టాటిస్టిక్స్ - 1, స్టాటిస్టిక్స్ - 2 పేపర్లను ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. వీటికి సమాధానాలను గుర్తించడానికి రెండు గంటల సమయం ఇస్తారు.

జనరల్ ఇంగ్లీష్

జనరల్ ఇంగ్లీష్‌లో ప్రశ్నల క్లిష్టత డిగ్రీ స్థాయిలో ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే ఉంటుంది. మిగిలిన ప్రశ్నలు మాత్రం అభ్యర్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఉంటాయి.

జనరల్ స్టడీస్

ప్రశ్నల క్లిష్టత సివిల్స్ జనరల్ స్టడీస్ కంటే కొంచెం తక్కువగా ఉంటుంది. ఇందులో కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా, శాస్త్ర-సాంకేతిక తదితర రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిమాణాలపై అభ్యర్థుల అవగాహనను ఈ విభాగంలో పరీక్షిస్తారు. ఈ విభాగం కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో చోటు చేసుకుంటున్న పరిమాణాలను నిశితంగా గమనించాలి. ముఖ్యంగా ఇతర దేశాలతో భారత్ చేసుకుంటున్న ఒప్పందాలు, ప్రధాని పర్యటనలు, అవార్డులు, క్రీడలు, శాస్త్ర - సాంకేతిక పరిశోధనలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, చట్టాలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలను సమగ్రంగా ఫాలో కావాలి. పరీక్ష తేదీకి ముందు 6 నుంచి 8 నెలల కాలంలో చోటుచేసుకున్న పరిణామాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఆర్థికపరమైన అంశాలు అంటే వివిధ ఆర్థిక వ్యవస్థలు, విదేశీ పెట్టుబడులు, విధాన నిర్ణయాలు, నీతి ఆయోగ్, ఆర్‌బీఐ, ఫెడ్ రేట్లు తదితరాలపై దృష్టి సారించాలి.

ముఖ్య సమాచారం

- అర్హత: ఎకనామిక్ సర్వీసుకు పీజీ (ఎకనామిక్స్ / అప్లయిడ్ ఎకనామిక్స్ / బిజినెస్ ఎకనామిక్స్ / ఎకనామెట్రిక్స్) పూర్తిచేసి ఉండాలి. స్టాటిస్టికల్ సర్వీసుకు డిగ్రీ / పీజీ (స్టాటిస్టిక్స్ / మేథమెటికల్ స్టాటిస్టిక్స్ / అప్లయిడ్ స్టాటిసిక్స్) పూర్తిచేసి ఉండాలి.
- వయసు: ఆగస్టు 1 నాటికి 21 నుంచి 30 ఏళ్లు
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: హైదరాబాద్
- దరఖాస్తు ఫీజు: రూ.200 (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు / మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16, 2018.
- వెబ్‌సైట్: www.upsc.gov.in

కటాఫ్ మార్కులు 2017

- **ఇండియన్ ఎకనమిక్ సర్వీస్:** జనరల్ - 584, ఓబీసీ - 522
- **ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్** జనరల్ - 580, ఓబీసీ - 552, ఎస్టీ - 318

జియోసైంటిస్ట్ అండ్ జియాలజిస్ట్ ఎగ్జామ్

జియాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ పట్టభద్రులకు చక్కని అవకాశం.. కంబైన్డ్ జియో సైంటిస్ట్ అండ్ జియాలజిస్ట్ ఎగ్జామినేషన్. ఈ పరీక్ష ద్వారా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్‌లో వివిధ హోదాల్లో కెరీర్‌ను ప్రారంభించవచ్చు. కంబైన్డ్ జియో సైంటిస్ట్ అండ్ జియాలజిస్ట్ ఎగ్జామినేషన్ - 2018 నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సంబంధిత వివరాలను చూద్దాం..

- ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా యూపీఎస్సీ మొత్తం 70 పోస్టులను భర్తీ చేయనుంది.
- జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలోని ఖాళీలు: జియాలజిస్ట్ 24, జియోఫిజిసిస్ట్ 17, కెమిస్ట్ 6.
- సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్‌లో జూనియర్ హైడ్రో జియాలజిస్ట్ (సైంటిస్ట్ బి) ఖాళీలు: 23

అర్హత

- జియాలజిస్ట్ ఉద్యోగాలకు పీజీ (జియోలాజికల్ సైన్స్ / జియాలజీ / అప్లయిడ్ జియాలజీ / జియో ఎక్స్‌ప్లోరేషన్ / మినరల్ ఎక్స్‌ప్లోరేషన్/ ఇంజనీరింగ్ జియాలజీ / మెరైన్ జియాలజీ / ఎర్త్ సైన్స్ అండ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ / ఓషనోగ్రఫీ అండ్ కోస్టల్ ఏరియాస్ స్టడీస్ / పెట్రోలియం జియో సైన్సెస్ / పెట్రోలియం ఎక్స్‌ప్లోరేషన్ / జియో కెమిస్ట్రీ/ జియోలాజికల్ టెక్నాలజీ/ జియో ఫిజికల్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- జియోఫిజిసిస్ట్‌లకు ఎమ్మెస్సీ (ఫిజిక్స్ / అప్లయిడ్ ఫిజిక్స్ / జియోఫిజిక్స్) / ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ (ఎక్స్‌ప్లోరేషన్ జియో ఫిజిక్స్ / అప్లయిడ్ జియో ఫిజిక్స్ / మెరైన్ జియో ఫిజిక్స్) / ఎమ్మెస్సీ - టెక్ (అప్లయిడ్ జియో ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. కెమిస్టులకు ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ / అప్లయిడ్ కెమిస్ట్రీ / అనలిటికల్ కెమిస్ట్రీ) ఉండాలి.
- జూనియర్ హైడ్రాలజిస్టులకు పీజీ (జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ / మెరైన్ జియాలజీ / హైడ్రోజియాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: జూనియర్ హైడ్రో జియాలజిస్ట్ ఉద్యోగాలకు 21 నుంచి 35 ఏళ్లు. మిగిలిన వాటికి 21 నుంచి 32 ఏళ్లు.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ / పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.



రాత పరీక్ష ఇలా

పరీక్షను డిస్క్రిప్టివ్ (ఎస్సే), ఆబ్జెక్టివ్ కలయికగా ఉంటుంది. ఇందులో పేపర్-1 జనరల్ ఇంగ్లీష్ కామన్‌గా. దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మిగిలిన పేపర్లు సబ్జెక్టివ్. ప్రతి సబ్జెక్ట్‌కు మూడు పేపర్లు ఉంటాయి. వీటిని కన్వెన్షనల్ (డిస్క్రిప్టివ్) రూపంలో నిర్వహిస్తారు. సమాధానాలను ఇంగ్లీష్‌లోనే రాయాల్సి ఉంటుంది. ప్రతి పేపర్‌లో సమాధానాలను రాయడానికి మూడు గంటల (180 నిమిషాలు) సమయం ఉంటుంది. వివరాలు..

జియాలజిస్ట్	పేపర్	మార్కులు
పేపర్ - 1	జనరల్ ఇంగ్లీష్	100
జియాలజీ	పేపర్ - 1	200
జియాలజీ	పేపర్ - 2	200
జియాలజీ	పేపర్ - 3	200

ఇలా సిద్ధమవ్వాలి

జనరల్ ఇంగ్లీష్‌లో జనరల్ ఎస్సే ఉంటుంది. మిగిలిన ప్రశ్నలు మాత్రం అభ్యర్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఉంటాయి. కాబట్టి సంబంధిత అంశాలపై దృష్టి సారించాలి.

- సబ్జెక్ట్‌ల విషయానికొస్తే వీటిల్లో ప్రశ్నల క్లిష్టత డిగ్రీ / పీజీ స్థాయిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సబ్జెక్ట్‌లను అనుసరించి ప్రామాణిక పుస్తకాలను చదవాలి. గత ప్రశ్నపత్రాలను అనుసరిస్తూ ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారో గమనించాలి.

ముఖ్య సమాచారం

- రాత పరీక్ష తేదీ: జూన్ 29, 2018.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: హైదరాబాద్
- దరఖాస్తు ఫీజు: రూ.200
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16, 2018.
- వెబ్‌సైట్: www.upsc.gov.in

కటాఫ్ మార్కులు 2017

	జనరల్	ఓబీసీ	ఎస్సీ	ఎస్టీ
జియాలజిస్ట్	223	202	199	178
జియోఫిజిసిస్ట్	259	247	229	180
కెమిస్ట్	348	-	292	250
జూ. హైడ్రాలజిస్ట్	208	182	162	159

జియోఫిజిసిస్ట్	పేపర్	మార్కులు
పేపర్ - 1	జనరల్ ఇంగ్లీష్	100
జియోఫిజిక్స్	పేపర్ - 1	200
జియోఫిజిక్స్	పేపర్ - 2	200
జియోఫిజిక్స్	పేపర్ - 3	200

కెమిస్ట్	పేపర్	మార్కులు
పేపర్ - 1	జనరల్ ఇంగ్లీష్	100
కెమిస్ట్రీ	పేపర్ - 1	200
కెమిస్ట్రీ	పేపర్ - 2	200
కెమిస్ట్రీ	పేపర్ - 3	200

హైడ్రాలజిస్ట్	పేపర్	మార్కులు
పేపర్ - 1	జనరల్ ఇంగ్లీష్	100
జియాలజీ	పేపర్ - 1	200
జియాలజీ	పేపర్ - 2	200
హైడ్రోజియాలజీ		200

జాబ్ కార్నర్

సుప్రీంకోర్టులో అటెండెంట్స్



భారత సుప్రీంకోర్టు - కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: జూనియర్ కోర్ట్ అటెండెంట్స్ 65, ఛాంబర్ అటెండెంట్స్ 13
- అర్హత: గుర్తింపు పొందిన బోర్డు / సంస్థ నుంచి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జూనియర్ కోర్ట్ అటెండెంట్లకు లైట్ / హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. కుకింగ్ / ఎలక్ట్రీషియన్ / కార్పెంట్రీ వంటి మల్టీ స్కిల్డ్ ట్రైనింగ్ పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యముంటుంది. ఛాంబర్ అటెండెంట్ల ఎంపికలో హౌస్ కీపింగ్ వర్క్, వాచ్ & వార్డ్, సెక్యూరిటీ, కేర్ టేకింగ్ కు సంబంధించిన అనుభవమున్నవారికి ప్రాధాన్యముంటుంది.
- వయసు: మార్చి 1 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వుడు వర్గాలవారికి ప్రభుత్వ నిబంధనల మేరకు వయో పరిమితిలో సడలింపు వర్తిస్తుంది.
- ఎంపిక: అభ్యర్థులను మెరిట్, అనుభవం, అదనపు అర్హతల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత పొందినవారికి స్కిల్ టెస్ట్ ఉంటుంది.
- రాత పరీక్ష వివరాలు: పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలే ఇస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ & రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలకు సంబంధించి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు (25 మార్కులు) అడుగుతారు. ప్రశ్నపత్రం హిందీ & ఇంగ్లీషు మాధ్యమాల్లో ఉంటుంది. ఈ పరీక్ష కోర్టు అటెండెంట్లకు, ఛాంబర్ అటెండెంట్లకు విడివిడిగా జరుగుతుంది.
- పరీక్ష కేంద్రాలు: ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కతా
- దరఖాస్తు ఫీజు: రూ.300 (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు / ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ.150)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 15
- వెబ్‌సైట్: www.sci.gov.in

టెక్నీషియన్లు

ఖాళీలు 98

డెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ)- కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: టెక్నీషియన్ 55 (ఎలక్ట్రీషియన్ 2 / ప్లంబర్ 2/ ఏఎంఒ 2 / కార్పెంటర్ 3 / వెల్డర్ 1 / ఫీల్డ్ & ల్యాబ్ రీసెర్చ్ 45), టెక్నికల్ అసిస్టెంట్ (మెయింటెనెన్స్) 3 (ఎలక్ట్రికల్ 1, సివిల్ 1, మెకానికల్ 1), స్టోర్ కీపర్ 1, డ్రైవర్ 3, లోయర్ డివిజన్ క్లర్క్ 19, ఫారెస్ట్ గార్డ్ 2, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ 15
- అర్హత: టెక్నీషియన్ ఉద్యోగాలకు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి. ఫీల్డ్ / ల్యాబ్ రీసెర్చ్ విభాగానికి 60 శాతం మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు సంబంధిత విభాగంలో బిఎస్సీ / మూడేళ్ల డిప్లొమా / ఇంటర్ (సైన్స్)తోపాటు రెండేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఎల్‌డీసీలకు ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు నిముషానికి 30 ఇంగ్లీషు పదాలు / 25 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి. మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల అనుభవం ఉండాలి.
- వయసు: ఉద్యోగాన్ని అనుసరించి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 1
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 21
- వెబ్‌సైట్: www.fri.res.in

టీచర్లు

ఖాళీలు 50

అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ (ఏఈఈఎస్) ఆధ్వర్యంలోని స్కూళ్లు / కాలేజీల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు.

- విభాగాలవారీ ఖాళీలు: పీజీటీ 8 (ఇంగ్లీష్ 2, మేథ్స్ 1, ఫిజిక్స్ 2, కెమిస్ట్రీ 1, బయాలజీ 2), టీజీటీ 17 (హిందీ / సంస్కృతం 7, మేథమెటిక్స్ / ఫిజిక్స్ 7, కెమిస్ట్రీ / బయాలజీ 3), ప్రైమరీ టీచర్ 25
- అర్హత: పీజీటీలకు కనీసం 50 శాతం మార్కులతో పీజీ / రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ / బీఏఈడీ/ బీఎస్సీఈడీ పూర్తిచేసి ఉండాలి. టీజీటీలకు 50 శాతం మార్కులతో డిగ్రీ / నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సు పూర్తిచేసి ఉండాలి. స్పెషల్ బీఈడీ / డీఈడీ / స్పెషల్ డీఈడీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. పీఆర్‌టీలకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు డిఈడీ / బీఈఎల్ఈడీ పూర్తిచేసి ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా
- వెబ్‌సైట్: www.aees.gov.in

మెడికల్ ఆఫీసర్లు

ఖాళీలు 29

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)- సీనియర్ & జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

- విభాగాలవారీ ఖాళీలు: సీనియర్ మెడికల్ ఆఫీసర్లు (మెడిసిన్ 3, జనరల్ సర్జరీ 4, రేడియాలజీ 2, పీడియాట్రిక్స్ 1, ఆప్తాల్మాలజీ 1, ఈఎన్‌టి 1), జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు 17
- అర్హత: ఎస్ఎంఓలకు ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో పీజీ చేసి ఉండాలి. జీడీఎంఓలకు ఎంబీబీఎస్ డిగ్రీతోపాటు ఏడాది అనుభవం ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: మార్చి 24
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఏప్రిల్ 16
- వెబ్‌సైట్: http://careers.bhel.in

25న హైదరాబాద్‌లో ఇండియా యూత్ కాంక్లేవ్

న్యూస్ బాక్స్

విద్యార్థుల ఆలోచనలు కార్యరూపం దాల్చేందుకు బెంగళూరు ఐఐఎమ్ 'ద క్లయింబర్' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసింది. ఇదో ఆన్‌లైన్ యూత్ మెంటారింగ్ వేదిక. 'మై కెప్టెన్' పేరుతో ఆన్‌లైన్ మెంటారింగ్ ప్రోగ్రామ్‌ను ఈ సంస్థ ప్రారంభించింది. యువత లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి ఏర్పాటు చేసిన ప్రపంచంలోని అత్యున్నత 50 సంస్థల్లో ఇది కూడా ఒకటిగా ఐక్యరాజ్య సమితి గుర్తించడం విశేషం.

ఈ సంస్థ ఆరంభమైన తరవాత ఇప్పటి వరకు నలభై వేలమందికి పైగా విద్యార్థులపై ప్రభావం చూపగలిగింది. ప్రస్తుతం ఈ సంస్థ హైదరాబాద్‌లోని బాస్కర ఆడిటోరియంలో మార్చి 25న 'ఇండియన్ యూత్ కాన్క్లేవ్' నిర్వహిస్తోంది. ఎంట్రప్రెన్యూర్లు మొదలుకుని ఆర్టిస్టులు, కవులు, కళాకారులు తదితరులను ఒకే గొడుగు కిందకు తేవడం ఈ సంస్థ కార్యకలాపాల ప్రత్యేకత. ప్రస్తుతం కాన్క్లేవ్‌లో పలు రంగాలకు చెందిన పదిమందికి పైగా ఉపన్యాసకులు పాల్గొననున్నారు. ద క్లయింబర్ వ్యవస్థాపకుడు - సిఇఒ మహ్మద్ జీషాన్, మార్కెటర్ సీరియల్ ఎంట్రప్రెన్యూర్ విశాల్ రెడ్డి, మ్యుజీషియన్ సిద్ధార్థ్ బెండి తదితరులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి మీడియా పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తోంది. ప్రోగ్రామ్ వివరాల కోసం 9566190212 నంబర్లో సంప్రదించవచ్చు. ఈ-మెయిల్: sachinsinghania.theclimber@gmail.com వెబ్‌సైట్: www.theclimber.in

సమ్మర్ జ్యూస్

సబ్జా గింజలతో మెలాన్ గ్రీన్ జ్యూస్

కావలసినవి:

కీరదోసకాయ - ఒకటి, పాలకూర - మూడు కట్టలు(పెద్ద గుప్పెడు), పుదీనా ఆకులు (ఇష్టపడితే) - గుప్పెడు, కర్బూజ ముక్కలు - అరకప్పు, పుచ్చకాయ ముక్కలు - అరకప్పు, సముద్రపు ఉప్పు - 1/8 టీస్పూన్, సబ్జా గింజలు - పావుకప్పు (నీళ్లలో రాత్రి నానబెట్టాలి. తెల్లవారి వడకట్టాలి. వీటిని కూడా ఇష్టపడితేనే వాడండి.)



తయారీ:

- కీరదోసకాయ, పాలకూర, పుదీనా ఆకుల్ని శుభ్రంగా కడగాలి.
- ఉప్పు, సబ్జా గింజలు తప్ప మిగతా అన్నింటినీ జ్యూసర్‌లో వేసి గ్రైండ్ చేయాలి.
- గ్రైండ్ చేసిన జ్యూస్ మీద ఉప్పు, సబ్జాగింజలు వేసి కలపాలి.
- ఈ జ్యూస్ తాగితే ఎంతటి ఎండలో అయినా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండొచ్చు.

సీతాకోక చిలుకమ్మా..

'అమ్మలా... చీర ఎప్పుడు కట్టుకుంటానా' అని కళ్లు విప్పార్చి మరీ చూస్తుంటారు చిట్టిపొట్టి చిన్నారులు. 'అక్కలా వోణీ ఎప్పుడు వేసుకుంటానో' అని చేతికి దొరికిన ఫ్యాబ్రిక్‌ని వోణీగా మార్చేస్తారు. వాళ్లు చేసే ఈ పనులు ముద్దుముద్దుగా... ముచ్చటగా ఉంటాయి. అందుకే కాబోలు ఫ్యాషన్ డిజైనర్లు చిన్నారుల కోసం ప్రత్యేకంగా సంప్రదాయ దుస్తులను డిజైన్ చేస్తున్నారు. పండుగలకు, వేడుకలకు వీటిని కట్టుకుని ఇంట్లో పిల్లలు పరుగులు పెడుతుంటే... రంగురంగుల సీతాకోకచిలుకలు నట్టింట ఎగురుతున్నట్టే ఉంటుంది.

సొగసు



సియాన్ బ్లూ, మెరూన్ కలర్ సర్క్యులర్ లెహంగా ఇది. దీని పైకి లేస్ వర్క్ చేసిన దుపట్టా వేయడంతో స్పెషల్‌గా కనిపిస్తుంది. లెహంగా మీద లేస్, ఎంబ్రాయిడరీ వర్క్ చేశారు. నెట్, సిల్క్ ఫ్యాబ్రిక్ వాడారు.



సీ గ్రీన్, క్రీం నెట్ ఫ్యాబ్రిక్ లెహంగా, చోళీ. దీనిపైకి లేస్ వర్క్ చేసిన దుపట్టా వేయడంతో స్టయిలిష్ లుక్ వచ్చింది. లెహంగా మీద ఎంబ్రాయిడరీ, లేస్ వర్క్‌లు చేయడంతో అందంగా తయారైంది.

బ్లూ, క్రీం రంగుల కలయికతో ఉన్న సర్క్యులర్ స్టయిల్ లెహంగా ఇది. దీనికి నెట్, సిల్క్ మెటీరియల్ వాడారు. లేస్, ఎంబ్రాయిడరీ వర్క్ చేయడంతో కొత్త కళ వచ్చింది.

ఎరుపు, నీలం రంగులో మెరిసిపోతున్న ఈ లెహంగా చోళీకి నెట్, సిల్క్ ఫ్యాబ్రిక్ వాడారు. అదనంగా లేస్ వర్క్, ఎంబ్రాయిడరీ వర్క్స్ చేశారు. ఇది వేసుకున్న చిన్నారులు ట్రెడిషనల్ బేబీ డాల్‌గా కనిపించడం ఖాయం.

పింక్, బ్లూ, క్రీమ్ రంగుల మేళవింపుతో నెట్, సిల్క్ మెటీరియల్‌తో కుట్టిన లెహంగా చోళీ. అదనంగా లేస్, ఎంబ్రాయిడరీ వర్క్స్ చేయడంతో సంప్రదాయం ఉట్టిపడుతోంది.

బ్రాండ్: ఫ్యాషన్ డిఫ్యూజన్

ధర: రూ.1,472

సౌజన్యం: www.ezeeby.com

ట్రెండింగ్

నటించడమైనా మానేస్తా కానీ...

టీవీ సీరియల్స్‌కు, వాటిలో నటించే పాత్రధారులకు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. మరి అంతటి క్రేజ్‌ను నిలుపుకోవాలంటే ఆయా పాత్రధారులు అందుకు తగ్గట్టుగా హుందాగా ప్రవర్తించాలి కదా! అందుకు ఉదాహరణ టెలివిజన్ నటి జన్నత్ జుబైర్ రహ్మాని. ఈ పదహారేళ్ల అమ్మాయి కలర్స్ టెలివిజన్‌లో వస్తున్న 'తు ఆషికి' సీరియల్‌లో 'పంకిత్' అనే పాత్రధారి. బాల్యం నుంచీ టీవీ పరిశ్రమతో అనుబంధాన్ని కలిగి ఉన్న జన్నత్ 'ఈ షోలో నటించడం అయినా మానేస్తాను కానీ... మీరు చెప్పిన ఆ సీన్ మాత్రం చేయన'ని కరాఖండిగా చెప్పింది. వివరాల్లోకి వెళ్తే...

వాళ్ల మీద చెడు ప్రభావం...

"సహ నటుడితో గాఢ చుంబనం సీన్ చేయాలన్నారు నిర్వాహకులు. నాయిక పాత్రలో ఉన్న వాళ్లు ఇలాంటి సీన్స్ చేయాల్సి వస్తుందనే విషయాన్ని నేను అర్థం చేసుకోగలను. కాని నా వయసు పదహారేళ్లు. చేతి మీద లేదా నుదుటి మీద ముద్దు పెట్టుకోవడం అంటే ఓకే. కానీ గాఢ చుంబనం చేయాలన్నారు. అది నాకు అసౌకర్యం... కాబట్టి నేను చేయనని చెప్పాను. అదీకాక సోషల్ మీడియాలో చాలామంది టీనేజర్లు నన్ను ఫాలో అవుతున్నారు. నేను ఇలాంటి సీన్లు చేసేందుకు ఒప్పుకుంటే... అది నన్ను ఫాలో అవుతున్న వాళ్లమీద చెడు ప్రభావాన్ని చూపెడుతుంది. ఏది చేయాలన్నా ప్రతీ దానికి ఒక వయసనేది ఉంటుంది. అలాగని వయసు వచ్చాక ఇలాంటివి చేయొచ్చని అనడంలేదు. అప్పుడు కూడా ఇలాంటి సీన్స్‌లో నటించాల్సి వచ్చినప్పుడు నటీమణుల ముందు 'అవును, కాదు' అనే అవకాశం ఉండాలి.

అమ్మ అండగా నిలిచింది

తమ పిల్లలకి వచ్చిన అవకాశం పోతుందని... చాలామంది తల్లిదండ్రులు షో నిర్వాహకులు చెప్పే చాలా విషయాలకు 'నో' చెప్పరు. కానీ నా విషయంలో అలా జరగలేదు. మా అమ్మ నాకు అండగా నిలిచి, నిర్వాహకులతో 'మా అమ్మాయి ఆ సీన్ చేయద'ని గట్టిగా చెప్పింది. ఇదేదో మేము మధ్యలో వ్యక్తం చేసిన అభ్యంతరం కాదు. ఈ షో ఒప్పుకునే ముందే 'నా వయసుకు తగని సీన్స్ చేయన'ని చెప్పాము. ఒకవేళ వాళ్లు ఈ సీన్ చేయాల్సిందేనని పట్టుబడితే ఆ షో నుంచి బయటికి వచ్చేద్దామని నిర్ణయించుకున్నాను".



ఫేస్‌బుక్

మార్క్ జుకర్‌బర్గ్ 'ఫేస్‌బుక్'పై ఇటీవల వివాదాలు రాజుకుంటున్న సంగతి తెలిసిందే. ఇంతకీ ప్రపంచవ్యాప్తంగా ఫేస్‌బుక్‌ను ఎంతమంది చూస్తున్నారో తెలుసా?


250 కోట్లు ప్రపంచవ్యాప్తంగా చూస్తున్నవారి సంఖ్య

24 కోట్లు అమెరికాలో యూజర్స్

24.1 కోట్లు భారత్‌లో యూజర్స్

2.6 కోట్లు అమెరికాలో యాక్టివ్ యూజర్స్

5 కోట్లు భారత్‌లో యాక్టివ్ యూజర్స్



ఫ్యామిలీ కౌన్సెలింగ్

స్నేహంగా ఉన్నా తప్పేనా?

నేను ఒక కార్పొరేట్ ఆఫీసులో పనిచేస్తున్నాను. అందరితో స్నేహంగా ఉంటాను. చిన్నప్పటి నుంచీ నాకు అందరితో అరమరికలు లేకుండా మాట్లాడడం అలవాటు. కానీ అదే ఇప్పుడు ఇబ్బందిగా మారింది. చాలామంది అబ్బాయిలు స్నేహానికి ఇంకో రంగు వేస్తున్నారు. వారితో తప్ప ఇతరులతో మాట్లాడితే అదో రకంగా చూస్తున్నారు. నా స్నేహితురాళ్ళు కూడా నాదే తప్పనీ, వారితో అంత చనువుగా ఉండకూడదనీ అంటున్నారు. అసలు ఎవరైనా స్నేహంగా మాట్లాడితే పేర్లు ఎలా పెట్టేస్తారు? ఎంతవరకు గిరి గీసుకుని కూర్చుంటాం? ఈ సమస్యలతో చికాగ్గా ఉంది. పని సరిగ్గా చేయలేకపోతున్నాను. ఉద్యోగం మానెయ్యాలేమో అనిపిస్తోంది.

- సుగుణ

చిన్నతనం నుంచీ ఎటువంటి వివక్షలకూ తావు లేకుండా పెరిగారు మీరు. అందుకే ఈ వాతావరణం కొత్తగా ఉండి ఉంటుంది. ఇప్పుడు స్కూలు స్థాయిలోనే ఇలాంటివి మొదలవుతున్నాయి. స్నేహం అనే పరిధి దాటకుండా ఉంటే బాగానే ఉంటుంది. కానీ చాలామంది అబ్బాయిలు, అమ్మాయిలు ఈ పరిధి దాటి బయటకు వచ్చేస్తున్నారు. తమకు తామే ఏవేవో ఊహించుకుంటున్నారు. ఇప్పుడు ఇదివరకటి కన్నా అమ్మాయిలకు చదువు, ఉద్యోగావకాశాలు పెరిగినా... సమస్యలూ అదే స్థాయిలో ఎదురవడం విచారకరం. అలా అని మీరేమీ అధైర్య పడనక్కరలేదు. చాలాసార్లు మన ప్రవర్తనే మనకు కంచు కోట. ఆఫీసుల్లో రకరకాల వ్యక్తుల సమూహం ఉంటుంది. ఎవరు ఎటువంటివారో తెలియదు. సహోద్యోగులతో మాట్లాడినా, బయటకు వెళ్లినా ఒక లిమిట్ వరకేనని అర్థమయ్యేలా ఉండాలి. వ్యక్తిగత విషయాలు అందరితోనూ పంచుకోకూడదు. అలాగే ఆఫీసు బంధాలు, స్నేహాలు, ప్రేమల విషయంలో మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఏది ఎంతవరకు అనే విచక్షణ ఉంటే చాలు. ఇంత చిన్న విషయానికి మనసు కష్టపెట్టుకోకండి. వృత్తిలో భాగంగానే భావించి ముందడుగు వేయండి.



• కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com





కమలాక్షు నర్చించు కరములు కరములు; శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ; సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు... అంటాడు పోతన. రామయ్య పెండ్లిని వీక్షించు జన్మ జన్మ అంటారు భక్తులు. ఆంధ్ర రాష్ట్రంలో ఆ చివర ఉత్తరాంధ్ర నుంచి ఈ చివర రాయల సీమ వరకూ జరిగే సీతారామ కల్యాణాల్లో విశేషాలెన్నెన్నో!

కల్యాణ వైభోగమే..

అక్కడ రెండుసార్లు పెళ్లి!

భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా శ్రీరాముడికి ఏడాదిలో ఒక్కసారి మాత్రమే కల్యాణం నిర్వహిస్తారు. అది కూడా శ్రీరాముడు జన్మించిన చైత్ర శుద్ధ నవమి (శ్రీరామ నవమి) నాడే చేయడం ఆనవాయితీ. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా రామతీర్థం రామస్వామి దేవస్థానంలో మాత్రం శ్రీరాముడికి ఏడాదికి రెండుసార్లు కల్యాణం జరుపుతారు. ఈ దేవస్థానం ఏర్పాటైన 16వ శతాబ్దం నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. ఇక్కడ శ్రీరామ నవమి రోజునే కాదు, మాఘ శుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి)నాడు కూడా సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దీనినే తిరుకల్యాణ మహోత్సవమనీ, 'దేవుని పెళ్లి' అని పిలుస్తారు. శ్రీరామ నవమి రోజున కల్యాణోత్సవం పగటి పూట, తిరుకల్యాణ మహోత్సవం రాత్రి పూట జరుగుతాయి. మరో ముఖ్యమైన విశేషం ఏమిటంటే, 'దేవుని పెళ్లి' జరిగాకే ఈ ప్రాంతంలో సాధారణ వివాహాలకు ముహూర్తం పెట్టుకోవడం ఆచారం! రామతీర్థం సీతారాముల తొలి కల్యాణ మహోత్సవం ఈ ఏడాది జనవరి 27న జరిగింది.



వెన్నెల్లో కల్యాణం

రామాలయాలన్నింటా కల్యాణాన్ని మధ్యాహ్న సమయంలో అభిజిత్ లగ్నంలో జరిపించడం ఆనవాయితీ. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్‌ఆర్ కడప జిల్లాలో, ఆంధ్రా భద్రాద్రిగా వాసికెక్కిన ఒంటిమిట్ట కోదండరామాలయంలో మాత్రం చంద్రుని వెలుగుల్లో రాత్రి వేళ కల్యాణం నిర్వహిస్తారు. దీని వెనుక ఒక పురాణగాథ వుంది. క్షీరసాగర మథనం తరువాత లక్ష్మీదేవిని నారాయణుడు తన సతీమణిగా స్వీకరించాడు. పగలు జరిగే స్వామివారి వివాహాన్ని తాను చూడలేకపోతున్నానని ఆమె సోదరుడు చంద్రుడు విన్నవించగా ఒంటిమిట్టలో వెన్నెల వెలుగుల్లో తన కల్యాణాన్ని వీక్షించవచ్చని స్వామి వరమిచ్చాడు. దాని ప్రకారమే చైత్ర శుద్ధ చతుర్దశి నాటి రాత్రి ఇక్కడ స్వామివారికి కల్యాణం జరుపుతారు. పురాణ ప్రాశస్త్యం, చారిత్రక నేపథ్యం కలిగిన ఈ రామాలయం కడప-చెన్నై ప్రధాన రహదారిలో కడప నుంచి 25 కిలోమీటర్ల దూరంలోని ఒంటిమిట్టలో ఉంది. ఒక రాతి గుట్టపై మూడు గోపురాలతో 32 అద్భుత శిల్పమయ స్తంభాలతో రంగ మండపం, కల్యాణ మండపం ఉన్నాయి. సీతారామలక్ష్మణులు ఒకే శిలపై వెలసి ఉన్నందున ఒంటిమిట్ట ఏకశిలా నగరంగా వినుతికెక్కింది. దేశంలో హనుమ లేని రామాలయాలు చాలా అరుదు. హనుమంతుడు లేకుండా నిర్మించిన ఆలయం ఒంటిమిట్ట కోదండ రామాలయం. ఒంటిమిట్టను ప్రభుత్వం టీటీడీ ఆధీనంలోని ఆలయాల్లో విలీనం చేసింది. ఈ నెల 24 నుంచి ఒంటిమిట్టలో 11 రోజుల పాటు తిరుమల తరహాలో కోదండరాముని బ్రహ్మోత్సవాలను జరిపించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 30న ఉత్సవంలో ప్రధానమైన సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుంది.

రామాలయ ఆవిర్భావం

మట్లి పాలకుల్లో ఒకరైన సదాశివరాయల కాలం నాటి శిలాశాసనాలను బట్టి చూస్తే ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని 1350లో ఉదయగిరిని పాలించిన కంపరాయలు నిర్మించినట్లు తెలుస్తోంది. 1356లో ఉదయగిరి సింహాసనాన్ని అధిష్టించిన కంప సోదరుడైన బుక్కరాయలు ఒంటిమిట్ట కోదండరామాలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. మట్లిరాజుల్లో ఒకడైన అనంతరాజు రామాలయ గుడిని విస్తరించారు. ఉత్తర, దక్షిణ గోపుర నిర్మాణాలు మొదలుపెట్టగా అనంతరాజు కుమారుడైన తిరువెంగళనాథ రాజు మనుమడు కుమార అనంతరాజు పూర్తి చేశాడు.

ఇతిహాసాలెన్నో...

రాముడు అరణ్యవాసం చేస్తూ ఒంటిమిట్టకు వచ్చినట్లు ఇతిహాసాలు చెబుతున్నాయి. ఇక్కడ తపస్సు చేసుకొనే మునుల కోరికపై రామలక్ష్మణులు రాక్షస సంహారం చేసినట్లు చెబుతారు. అనంతరం మునుల యజ్ఞయాగాదులకు ఇబ్బందులు కలగకుండా ఒకే శిలలో నిర్మితమైన సీతారామలక్ష్మణ విగ్రహాలను మునులకు ప్రదానం చేసినందున, దీనికి 'ఏకశిలా నగరం'గా పేరువచ్చింది. శ్రీరాముడు అంబులపొది, పిడిబాకు, కోదండం చేతపట్టి రావడంతో 'కోదండరాముడు' అనే నామం వచ్చింది. కాగా, దండకారణ్యంలో పర్యటించిన సీతారామలక్ష్మణులు అలసి ఒక చెట్టునీడన చేరారట! ఆ సమయంలో సీతాదేవికి దాహంగా ఉండటంతో రాముడు బాణాన్ని భూమిలోకి సంధించగా గంగ పెల్లుబికింది. దీంతో వారు దాహం తీర్చుకున్నారు. అదే సమయంలో లక్ష్మణుడు కూడా భూమిలోకి బాణం సంధించగా గంగ ఉద్భవించింది. అప్పటి నుంచి ఇవి శ్రీరామలక్ష్మణ తీర్థాలుగా ప్రసిద్ధి చెందాయి.

జాంబవంత ప్రతిష్ఠ

త్రేతాయుగంలో ఒంటిమిట్ట ప్రాంతానికి వచ్చిన జాంబవంతుడు ఒక నాటి రాత్రి విశ్రమించగా స్వప్నంలో సీతారామలక్ష్మణులు దర్శనమిచ్చారట. జాంబవంతుడు ఉదయమే లేచి పరిసరాలను వెతకగా గుబురు పొదల్లో ఈ మూర్తులు కనిపించాయి. జాంబవంతుడు ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అందువల్లే 'జాంబవంత ప్రతిష్ఠ' అని పేరు వచ్చింది.

ఒంటిమిట్ట పేరు ఎలా వచ్చిందంటే..

ఒంటిడు-మిట్టడు అనే ఇద్దరు అన్నదమ్ములు ఈ ప్రాంతంలో వేట సాగించేవారు. కంపరాయలు, ఆయన పరివారం ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు వీరు శ్రీరాముడు సృష్టించిన బుగ్గనీటితో దప్పిక తీర్చారట. ఈ అన్నదమ్ముల కోరికపై జాంబవంతుడు ప్రతిష్ఠించిన ఏకశిలా దేవతామూర్తులకు కంపరాయలు గర్భాలయం నిర్మించారు. తరువాత వీరి పేరు మీద ఒంటిమిట్ట గ్రామాన్ని, చెరువును కట్టించారు.

• మల్లికార్జున్, రామచంద్రయ్య, ఫొటోలు: మాలాలా


ఇమాంబేగ్ పిలుపు.. రామయ్య పలుకు

క్రీ.శ.1640 ప్రాంతంలో కడపను పాలించిన అబ్దుల్ నబీఖాన్ ప్రతినిధి ఇమాంబేగ్ ఒంటిమిట్ట కోదండరాముని మహిమను పరీక్షించేందుకు వచ్చాడట. గుడి లోపలికి వెళ్లి "ఓ రామ..! ఒంటిమిట్ట రఘు రామ..!" అని మూడు మార్లు పిలువగా గుడిలోంచి "ఓ..ఓ..ఓ..." అనే సమాధానం వినబడిందట. ఇమాంబేగ్ ఆనందంతో మోకరిల్లి రాముని భక్తునిగా మారాడు. రాముని కైంకర్యం కోసం బావిని తవ్వించాడు. ఆ బావి నేటికీ ఉంది. ఇప్పటికీ ప్రతి శుక్రవారం ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె దర్గాకు వెళ్ళే ముస్లింలు కోదండరాముణ్ని దర్శించుకొంటారు.

రెండో కల్యాణోత్సవం శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన జరుగనుంది.

తిరుకల్యాణం కథ ఇదీ!

16వ శతాబ్ది కాలంలో ఇదంతా అటవీ ప్రాంతంగా ఉండేది. సమీపంలోని కుంబిళాపురం (ప్రస్తుతం కుమిలి) గ్రామానికి చెందిన పుట్టు మూగ అయిన వృద్ధురాలు కట్టెల కోసం వచ్చిందట. ఆమెకు శ్రీరాముడు ప్రత్యక్షమై, ఆమె నాలుకపై 'శ్రీరామ' అనే బీజాక్షరాలు రాశాడట! ఈ విషయాన్ని వెంటనే ఆమె కుంబిళాపురాన్ని పరిపాలిస్తున్న పూసపాటి వంశీయులకు తెలిపింది. అలాగే శ్రీరాముడు కుంబిళాపురం రాజుకు కూడా కలలో కనిపించి ఈ ప్రాంతంలో సీతా, రామలక్ష్మణ రాతి విగ్రహాలు ఉన్నాయని, వాటిని సేకరించి వెంటనే ప్రతిష్ఠించాలని కోరాడట. చక్రవర్తి, వృద్ధురాలు కలిసి వెతకగా నీటి మడుగులో ఉన్న సీతారామలక్ష్మణ విగ్రహాలు లభించాయనీ, తీర్థంలో రాముడి విగ్రహం లభించినందున 'రామతీర్థం' అని ఈ ప్రాంతానికి నామకరణం చేశారట. అలాగే మాఘ శుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) నాడు రామతీర్థంలో ఈ విగ్రహాలను ప్రతిష్ఠించడం వల్ల ఏటా ఆ భీష్మ ఏకాదశి నాడు సీతారాములకు బ్రహ్మాండంగా 'తిరుకల్యాణ మహోత్సవాన్ని' నిర్వహించడం ఆనవాయితీ!



ఏకుల వంశీయులే ఆడపెళ్లి వారు

రామతీర్థంలో ఏటా జరిగే సీతారాముల కల్యాణోత్సవంలో వరుడు శ్రీరామచంద్రుడు తరఫున విజయనగరం పూసపాటి రాజ వంశీకులు లేదావారి తరఫున దేవస్థానం అధికారులు వ్యవహరిస్తారు. వధువు సీతమ్మ తరఫున పూసపాటిరేగకు చెందిన ఏకుల రామారావు కుటుంబీకులు హాజరవుతారు. వీరు సీతమ్మ తల్లికి బంగారు మంగళసూత్రాలతో పాటు ఇతర సామగ్రి తీసుకొస్తారు. నాలుగు శతాబ్దాల కాలం నుంచి ఏకుల వంశీయులే ఆడపెళ్లివారు! వీరు రాముడి విగ్రహాలను కనుగొన్న మూగ వృద్ధురాలి వంశీయులని చెబుతారు. కేవలం పూసపాటి రాజ వంశీయుల వశిష్ఠ గోత్రంతోనే వివాహం ఆద్యంతం నిర్వహిస్తామని దేవస్థానం ప్రధాన అర్చకుడు ఖండవిల్లి సాయి రామాచార్యులు తెలిపారు. వివాహ మహోత్సవానికి ముందు రామతీర్థం ప్రధాన వీధిలో హంస, అశ్వ, గరుడ వాహనాలపై సీతారామలక్ష్మణ విగ్రహాలను ఉంచి, అర్చకులు నిర్వహించే ఎదురుసన్నాహ కార్యక్రమం కనులవిందుగా సాగుతుంది.

• పతివాడ రమణ, నెల్లిమర్ల, విజయనగరం

ఐదు రోజుల పెళ్ళి... అరుదైన పెళ్ళి!

రామ తీర్థంలో శ్రీరామ నవమి రోజున నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవం ఒక్కరోజులో ముగుస్తుంది. తిరుకల్యాణ మహోత్సవం మాత్రం ఏటా ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. దానికి ముందు వచ్చే రథసప్తమి నాడు పందిరి రాట వేస్తారు. నూతన వధూవరులకు ఈ రోజే నూతన వస్త్రాలు, బంగారం కొనుగోలు చేస్తారు. కల్యాణోత్సవం జరిగే భీష్మ ఏకాదశి నాటి ఉదయం ధ్వజ స్తంభంపై ధ్వజారోహణం చేస్తారు. కల్యాణోత్సవం జరిగిన నుంచి ఐదు రోజుల పాటు అర్చకులు ప్రత్యేక హోమాలు, గ్రామ బహిష్కరణ, సుందరకాండ పారాయణం, ప్రత్యేక హోమాలు నిర్వహిస్తారు. నాలుగో రోజున సదస్యం అనే పేరుతో పండితులకు సత్కారం, పండిత పరిషత్ పేరుతో సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రధానంగా నాలుగో రోజు రాత్రి పూలతోనూ, విద్యుత్ వెలుగులతోనూ అలంకరించిన ప్రత్యేక రథంపై నవ వధూవరులు సీతారామచంద్రులను, లక్ష్మణ స్వామిని రామతీర్థం ప్రధాన వీధుల్లో ఊరేగిస్తారు. ఈ రథాన్ని పక్క గ్రామమైన సీతారామునిపేట గ్రామస్థులు మాత్రమే లాగుతారు. ఐదో రోజున శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించి, ఆ రోజు రాత్రి గరుడ పటాన్ని అవరోహణం చేస్తారు. పూర్ణాహుతి అనంతరం కల్యాణోత్సవాలకు ముగింపు ప్రకటిస్తారు.

ఆవేశం కాదు... ఆత్మవిమర్శ కావాలి!


ధర్మార్జున సంవాదాన్ని కృష్ణుడు ఏ రకంగా పరిష్కరించాడో తెలుసుకుందాం. 'నా గాండీవాన్ని ఇతరులకు ఇమ్మని అంటాడా? తల తెగనరుకుతాను. అలా చేయలేకపోతే ఆత్మహత్య చేసుకుంటాను' అంటూ ధర్మరాజుపై కోపంతో అర్జునుడు శపథం చేశాడు. అర్జునుడి కోపాన్ని చూసి ధర్మరాజులో ఉన్న సుగుణాలన్నీ తెలియజేశాడు శ్రీకృష్ణుడు. పాత కథలన్నీ మళ్లీ గుర్తుచేశాడు. 'ఎప్పుడెప్పుడు మీ అన్నగారు మిమ్మల్ని ఎలా కాపాడారో గుర్తుచేసుకోండయ్యా' అని చెప్పాడు. 'ఒక్కమాట ఆలోచించు అర్జునా! యుద్ధ భూమిలో పరాక్రమం చూపిన ఇంత మంది మీరు ఉండగా 'యుధిష్ఠిరుడు' అన్న మాటను ధర్మరాజుకే ఎందుకు ఖాయం చేసిందయ్యా చరిత్ర' అని ప్రశ్నించాడు. 'ధర్మరాజు ఓ మాటంటే ఎందుకన్నాడో ఆలోచించరా' అన్నాడు.



'ప్రతిజ్ఞ విరోధుల మీద గాక
ఎన్నగ అన్నదమ్ములభయం
నెరవేర్తురటయ్య ఫల్గుణా!'

'ఇదేం కోపమయ్యా! దుర్యోధనుణ్ణి చంపుతాననో, కర్ణుణ్ణి చంపుతాననో ప్రతిజ్ఞలు చేస్తే నెరవేర్చుకోండి. అంతేకానీ అన్నదమ్ముల మీదా ప్రతిజ్ఞలు! ఏ సైంధవుడో, కర్ణుడో నిన్నేమైనా అంటే తల వగలగొడతా అనొచ్చు. కానీ మీ అన్నగారు బాధతో అంటే పట్టించుకుంటావా! సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి మాటను ఎలా సర్దుకోవాలో అలా సర్దుకోవాలి' అని కృష్ణుడు బోధ చేశాడు. భావావేశాలు రెచ్చిపోతున్నటువంటి ఈ కాలంలో అది మరీ అవసరం. అందుచేత మన జీవితాల్లో, కుటుంబ సమస్యల్లో తాత్కాలికమైన ఆవేశంలో అన్న మాటల్ని ఎప్పుడూ మళ్లీ తలచుకోకూడదు. భార్యాభర్తలు గానీ, అన్నదమ్ములు గానీ, తల్లితండ్రులు గానీ, పిల్లలు గానీ ఎవరైనా సరే. ఎవరో ఘోరం చేశారని మనం విమర్శిస్తున్నాం. కానీ అంతకు ముందు అలాంటి ఘోరం మనం చేశామా! అని ఒకసారి ఆలోచించుకుంటే యౌవనంలో ఎప్పుడో చేసే ఉంటాం! అది గుర్తొస్తే వారిని మనం తిట్టడం మానేస్తాం. ఇది ఆలోచించుకుంటే చాలు. దీన్నే 'ఆత్మవిమర్శ' అంటారు. అయితే ఆవేశంలో ఉన్న వ్యక్తి ఆత్మ విమర్శ చేసుకునే స్థితిలో ఉండడు. కాబట్టి పక్కవాళ్లు చేయాలి. శ్రీకృష్ణుడు ఆ మాటలన్నీ అనగానే అర్జునుడు వెంటనే 'క్షమించు అన్నా' అంటూ ధర్మరాజు కాళ్లమీద పడ్డాడు. తమ్ముడా! 'నేను కూడా ఆవేశంలో అన్నాను. మన్నించు' అని ధర్మరాజు కూడా అన్నాడు. అలా సమస్య పరిష్కారమయిపోయింది. 'మరి నేను చేసిన శపథం మాటేమిటి' అని ప్రశ్నించాడు అర్జునుడు. 'నువ్వేం అన్నావు. అన్నను చంపుతానన్నావు. పరనింద పరహత్యతో సమానం. కాబట్టి మీ అన్నను నిందించు. సరిపోతుంది' అని సూచించాడు కృష్ణుడు. దాంతో అర్జునుడు 'జూదం ఆడింది నువ్వే! వనవాసానికి కారణం నువ్వే' అని ధర్మరాజును నిందించాడు. 'చంపలేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని అన్నాను కదా' అని అర్జునుడు ప్రశ్నించాడు. అప్పుడు కృష్ణుడు 'ఆత్మస్తుతి ఆత్మహత్యతో సమానం. కాబట్టి కాసేపు ఆత్మస్తుతి చేసుకో' అన్నాడు. మహాపరాక్రమవంతునిగా ధర్మరాజుని నిరూపించడం కష్టం. అలాగని ధర్మరాజు గురించి తక్కువ మాటలు మాట్లాడొద్దు. 18 రోజుల యుద్ధంలో వ్యాసభారతం గానీ, తిక్కన భారతం గానీ చదివితే మనకు ఈ విషయం అర్థమవుతుంది. ధర్మరాజు దుర్యోధనుణ్ణి రెండుసార్లు పరుగెత్తించాడు. కర్ణుడి చేతిలో ధర్మరాజు ఓడిపోయాడన్న మాట బాగా ప్రసిద్ధమైపోయింది.

యుద్ధం జరగకూడదని శ్రీకృష్ణపరమాత్ముడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కర్ణ రాయబారం శాంతి స్థాపన కోసం చేసిందే! కర్ణుడు పాండవుల వైపు వస్తే యుద్ధం ఆగిపోతుందని కృష్ణుని ఆలోచన. అందుకే రాయబారం నడిపాడు. అందరూ చివరి వరకు యుద్ధం జరగకూడదని ప్రయత్నం చేసినవారే.



• డా. గరికిపాటి నరసింహారావు

అసలైన దుర్గుణం అదే!



మనిషిలోని మనసుకు, అతని నోటికీ మధ్య సమన్వయం, పొంతన ఉన్నప్పుడే మనిషి చెప్పే ప్రతి మాట, అతను చేసే ప్రతి పని సహజంగా ఉంటాయి. దీనినే 'సత్యం', లేక 'సచ్ఛీలత' అంటారు. సత్యం చెప్పని వారి హృదయం సకల రుగ్మతల పుట్టినిల్లుగా మారుతుంది. సత్యం పలికే వారికి ప్రతీ మంచి పని సులభసాధ్యమవుతుంది. అతను ప్రతి కఠినమైన దశనూ అలవోకగా అధిగమిస్తాడు.

ఒక వ్యక్తి దైవప్రవక్త(స) వద్దకు వచ్చి ఇలా విన్నవించుకున్నాడు. "దైవ ప్రవక్తా! నాలో నాలుగు దుర్గుణాలున్నాయి. ఒకటి- నేను వ్యభిచారం చేస్తాను. రెండు- దొంగతనం చేస్తాను. మూడు- మద్యాన్ని సేవిస్తాను (సారాయి తాగుతాను). నాలుగు- అబద్ధం చెబుతాను. తమరు నన్ను ఆజ్ఞాపిస్తే వీటిలో ఏ ఒక్కదానినైనా పరిత్యజించగలను' అని అన్నాడు. అప్పుడు ప్రవక్త(స) 'అబద్ధం చెప్పడం మానుకో' అని బోధించారు. దానికి అతను అంగీకరిస్తూ ఈ క్షణం నుంచి అబద్ధం చెప్పనంటూ ప్రమాణం చేశాడు. ఆ రోజు సాయంత్రం కాగానే అతని మనసు సారాయి వైపునకు లాగింది. ముందు సారాయి తాగి, ఆ తర్వాత వ్యభిచారం చేయాలనుకున్నాడు. 'కానీ తెల్లవారాక దైవప్రవక్త అడిగితే ఏం చెప్పను? నిజం చెబితే మద్యం సేవించినందుకు, వ్యభిచారం చేసినందుకు శిక్ష పడుతుంది. అబద్ధం చెబితే ప్రమాణ భంగం చేసినట్లవుతుంది' అని ఆలోచించుకుంటూ గడిపాడు. రాత్రి బాగా చీకటి పడిన తర్వాత దొంగతనం చేయడానికి బయలుదేరబోయాడు. 'కానీ, రేపు ఉదయం ప్రవక్త(స) అడిగితే ఏమని చెప్పను?' అన్న ఆలోచన వచ్చింది అతనికి. రాత్రి దొంగతనం చేశానని అంటే చేతిని నరికేస్తారు లేదంటే వాగ్దానభంగానికి పాల్పడిన వాడినవుతాను' అనుకున్నాడు. అలా, అతను ఈ మూడు దుర్గుణాల నుంచి తనను తాను కట్టిపడేసుకున్నాడు. తెల్లవారాక అతను పరిగెత్తుకుంటూ ప్రవక్త(స) సన్నిధికి వచ్చాడు.

"దైవ ప్రవక్తా! అబద్ధం చెప్పకూడదన్న దృఢసంకల్పం కారణంగా నాలోని నాలుగు దుర్గుణాలూ దూరమయ్యాయి" అని చెప్పాడు. ఇది విని దైవప్రవక్త బాగా సంతోషించారు.

సత్యం చెప్పే గుణం, మనిషిని చెడు మార్గాల నుంచి దూరంగా ఉంచుతుంది. సత్యవంతుడైనవాడు ప్రతి చెడు నుంచి పవిత్రంగా ఉండేందుకు తప్పక ప్రయత్నిస్తాడు. అంతేకాదు, అతను రుజువర్తనుడై ఉంటాడు. ముక్కుసూటిగా వ్యవహరిస్తాడు. చేసిన వాగ్దానాన్ని నిలుపుకొంటాడు. ఒడంబడికలకు కట్టుబడి ఉంటాడు. ధైర్యంగా ఉంటాడు. అతని మనసు నిర్మలంగా ఉంటుంది. ప్రదర్శనా బుద్ధి అతనిలో ఉండదు. అతని అంతర్యంలో కపటత్వం ఉండదు. మనిషి ముందు ఒక విధంగా, వెనుక మరొక విధంగా ఉండటం, లేదా నటించడం అతనికి చేత కాదు. అందరూ నమ్మదగ్గ నేస్తంగా ఉంటాడు. అతని మాటలపై, చేతలపై జనులకు నమ్మకం ఉంటుంది. ఎందుకంటే అతని మాటలకూ, చేష్టలకూ వైరుధ్యం ఉండదు. చెప్పిన దాన్ని చేసి చూపిస్తాడు. సత్యం, సచ్ఛీలత లాంటి ఎన్నో సుగుణాలకు అసలు సిసలు ప్రాతిపదికగా నిలుస్తాడు.


• మహమ్మద్ వహీదుద్దీన్

అందరివాడు!

నిండా కుష్ఠు వ్యాధి ఉన్న ఒక వ్యక్తి యేసు ప్రభువు వద్దకొచ్చి, ఆయనకు మొక్కి "నీకిష్టమైతే నన్ను శుద్ధీకరించి బాగుచెయ్యి ప్రభువా!" అని వేడుకున్నాడు. యేసు ప్రభువు "నాకిష్టమే!" అని ప్రకటించి వెంటనే అతన్ని బాగుచేశాడు. అయితే ఆ విషయం ఎవరికీ ప్రకటించొద్దని ఆదేశించాడు. ఆలయంలో యాజకునికి కనబడి, మోషే నియమించిన కానుకను మాత్రం అక్కడ చెల్లించమన్నాడు. (మత్తయి 8:2, లూకా 5:12)

తన రోగాన్ని బాగుపర్చడమే కాదు, దేన్నైనా చెయ్యగల శక్తిమంతుడు యేసు ప్రభువని ఆ కుష్ఠు రోగికి బాగా తెలుసు. కానీ 'అంతటి మహోన్నతుడైన దేవుడు తనలాంటి అస్పృశ్యుణ్ణి (ఆ రోజుల్లో కుష్ఠు రోగులు అస్పృశ్యులే), అనామకుణ్ణి బాగుచేయడానికి ఇష్టపడతాడా' అన్నది అతని సంశయం. అందుకే ఎంతో సంకోచంగా "నీ కిష్టమైతే' నన్ను బాగుచేయ"మంటూ వేడుకున్నాడతను! అయితే 'అంతటి దేవుని ముందు నేనెంత? నన్ను ఆయనసలు బాగు చేసేందుకు ఇష్టపడతాడా?' అన్నది నాడు అతని సందిగ్ధం!

దేవుని 'దైవత్వపు విశిష్టత' గురించి బైబిల్ చెప్పిన మాటలు కొన్ని గుర్తు చేసుకుంటే ఈ సంశయాలు పటాపంచలవుతాయి. "ఆకాశాన్ని విశాలపరిచి భూమిని కూడా పరిచిన నేనే తల్లి గర్భంలో నిన్ను నిర్మించిన నీ విమోచకుడను" అంటాడు దేవుడు (యిర్మియా 44:24)). అంటే అటు విశ్వాన్నంతటినీ, ఇటు నిన్ను, నన్ను కూడా సృష్టించిన దేవుని దృష్టిలో, ఈ విశ్వమెంత ప్రాముఖ్యమైనదో, ప్రతి మానవుడూ అంతే ప్రాముఖ్యమైన వాడన్న మాట. మనలో ప్రతి ఒక్కరి కోసం ఏది చేయాల్సి వచ్చినా దేవుడు ఎంతో ఆనందంతో, ప్రేమతో చేస్తాడన్నమాట. 'మహాసముద్రాల నీళ్లన్నీ ఇంకిపోతాయేమో! సూర్యునిలోని వెలుగంతా అంతరించిపోతుందేమో! ఆకాశమంతా కుంచించుకుపోయి ఒక ఇరుకు మైదానమవుతుందేమో కానీ, మానవుని



పట్ల దేవుని ప్రేమ మాత్రం ఎన్నడూ తరగదు, మసకబారదు!' అన్నది బైబిల్ చెప్పే సత్యం.

పాతాళమంత అగాధమైన మానవుని పాపం, ఆకాశంకన్నా అనంతమైన దేవుని ప్రేమ- ఈ రెండే సృష్టిలో నిత్యసత్యాలు. ఈ రెండింటినీ అద్భుతంగా సమన్వయం చేసిన దేవుని అద్వితీయ కుమారుడు, రక్షకుడే యేసుక్రీస్తు!! యుగయుగాలుగా లోకంలోని మహామహులంతా నిరంతరం అన్వేషిస్తున్నది 'ఆనందం' కోసమే. అయితే ఆ రోజున దేవుడు ముట్టుకొని, బాగుచేసిన తర్వాత కుష్ఠు రోగికి తాను వ్యాధి నుంచి విముక్తి పొందినదాని కంటే ఎక్కువగా- దేవుడు తనను అంగీకరించడంలోనే నిజమైన ఆనందం దొరికింది. ఎందుకంటే కుష్ఠువ్యాధి బాగైనా అందరిలాగే కొన్నాళ్ళకతను చనిపోయాడు. కానీ దేవుడతణ్ణి అంగీకరించిన కారణంగా దేవుని కుమారుడుగా చనిపోయి, నిత్యత్వపు పౌరుడిగా అతను దేవునితో నిరంతరం జీవిస్తున్నాడు.


• సుశీల్ సందేశ్

శ్రీరమణుల ఉపదేశం

(గత సంచిక తరువాయి)

ప్రపత్తిలో (అంటే శరణాగతిలో) అహంకారముండదు. అసలైన ప్రపత్తి అంటే భగవంతుణ్ణి ప్రేమించడం. దేనికోసం కోరకుండా ఉండటం. మనమాయనకి అంకితమై పోయాం కాబట్టి భగవంతుడు మనకెప్పుడూ మేలు చేస్తాడని ఎదురుచూస్తాం. ఒక్కోసారి మనకు వ్యతిరేకంగా కూడా కొన్ని జరుగుతాయి. మనమింతగా భగవంతునికి అంకితమయ్యామే ఇట్లా ఎందుకు జరుగుతోందని నివ్వెరపోతాం. అంటే, మన అంకితభావానికి ఏదో ప్రతిఫలం ఎదురుచూస్తున్నామన్న మాటే కదా ఇది. అంటే మనకు సంపూర్ణమైన శరణాగతి లేనట్టే అని అర్థం.

(సశేషం)



• పింగళి సూర్యసుందరం

ఎంగిలి భిక్ష!

నిరంతరం ప్రజల్లో నైతిక, ధార్మిక భావాల్ని పెంపొందించాలనీ, సమాజాన్ని సంస్కరించాలనీ, ప్రజల్ని దుఃఖ విముక్తుల్ని చేయాలనీ సంకల్పించి బుద్ధుడు బౌద్ధ భిక్షు సంఘాన్ని స్థాపించాడు. అన్నీ త్యజించినవారు కాబట్టి, స్వార్థానికి హేతువైన ఆర్థిక సంపాదన విషయంలో భిక్షువులు దూరంగా ఉండాలి. భిక్ష కోసం సమాజం మీదే ఆధారపడాలి.

ఒక రోజు బుద్ధుడు భిక్షకు బయలుదేరాడు. ఒక గ్రామంలో గుడిసె ముందు ఆగాడు. వచ్చిన బుద్ధుడిని ఆ ఇంటి ఇల్లాలు చూసి కంగారు పడింది. రాత్రి పూట చద్దన్నం ఉంటే అంతకు ముందే ఆమె తన భర్తకు కంచంలో పెట్టింది. పున్నీళ్లు పోసుకొని, ఉల్లిపాయ నంజుకొని తింటున్నాడు భర్త. ఇక ఇంట్లో మెతుకు లేదు.



ఆమె గబగబా బయటకు వచ్చి -

"భగవాన్! క్షమించండి! నేను భిక్ష వేయలేను" అంది!

బుద్ధుడు ఇక ఆ రోజు మరో ఇంటికి భిక్ష కోసం వెళ్లడు. బుద్ధుడు వెనుదిరిగాడు. 'కొద్దిగా ముందుగా వచ్చినా బాగుండేది. మేమే పస్తు ఉండి, ఆ ఉన్నదే భగవానునికి పెట్టేవాళ్లం' అనుకొంటూ గుడిసెలోకి వెళ్లిందా ఇల్లాలు.

"ఏమిటి" అని భర్త అడిగాడు.

ఆమె మొదట చెప్పలేదు. ఆమె ముఖంలోని విచారం చూసి మళ్లీ అడిగాడు. ఆమె విషయం చెప్పింది. అంతే.. ఆ భర్త తాను తినే కంచాన్ని తీసుకుని బయటకు వచ్చి-

"భగవాన్! క్షమించండి. నేను ఎంగిలి చేసిన అన్నమే ఉంది. తమకు పట్టింపు లేకపోతే దీన్ని సమర్పించగలను" అన్నాడు.

బుద్ధుడు కరుణతో భిక్షాపాత్ర పట్టి - "ఆయుష్మాన్! భిక్షువుకు అన్ని ఆహారాలూ ఒక్కటే" అంటూ భిక్ష స్వీకరించాడు.

'మహాచక్రవర్తి కావలసిన శాక్య యువరాజు ఇతనేనా? ఎంత త్యాగం? ఎంత మానవీయ జీవితం? ఎంత ఆదర్శం?' అనుకొంటూ, గౌరవ భావంతో నమస్కరించారు ఆ దంపతులు.

• బొర్రా గోవర్ధన్



PUBLIC STAR
SRIKANTH
PRESENTS
HAPPY BIRTHDAY
PUBLIC STAR
SRIKANTH
KARANAM BABJI
ఆపరేషన్
2019
BEWARE OF PUBLIC
PRODUCER: ALIVELU
COMING SOON



FROM THE MAKERS OF
నేడే
విడుదల
నీదీ
నాదీ
ఒకే కథ
TO PARTICIPATE IN NEEDI NAADI OKE KATHA MOVIE CONTEST SCAN QR CODE IN PAYTM APP AND WIN UPTO 1 LAKH PAYTM CASH



RISE UP
పసిఫిక్ రిమ్
తిరుగుబాటు
PACIFIC RIM
UPRISING
RELEASING
TODAY
IN 3D & 2D
(In English, Telugu & Hindi)
UNIVERSAL PICTURES INTERNATIONAL INDIA RELEASE



SUKHIBHAVA MOVIES
R.SITARAMA RAJU
PRESENTS
నేడే విడుదల
ఆనందం
HAPPY DAYS again
Producer A.GURURAJ Director GANESH RAJ
Co-Producers
VEERA VENKATESWARA RAO (PEDA BABU)
VRB RAJU • RAVI VARMA CHILUVURI
Special Appearance
NIVIN PAULY



పల్లెటూరికి వినోదయాత్ర
చంద్ర బాలాజీ ఫిలిమ్స్
అనగనగా
ఒక ఊళ్లో...
నిర్మాత : కె. చంద్రరావు
కథ - స్క్రీన్ ప్లే - దర్శకత్వం : సాయికృష్ణ.కె.వి
నేడే
విడుదల



FROM THE DIRECTOR OF
RANGITARANGA
నేడే విడుదల
35/100
RANA AS
రాజరథం
A FILM BY ANUP BHANDARI
RAJARATHAM


BLUE PLANET
Entertainments
T G VISHWA PRASAD PRESENTS
people MEDIA FACTORY
నేడే విడుదల
MLA
మంచి లక్షణాలున్న అబ్బాయ్
WORKING TITTLE
KIRAN REDDY
BHARATH CHOWDARY
UPENDRA MADHAV
VIVEK KUCHIBHOTLA
MANI SHARMA
PRASAD MURELLA
TAMMIRAJU
KIRAN KUMAR
PRAVEEN VARMA
U/A
Paytm
ADITYA MUSIC

గ్రూప్-2 సెలెక్షన్స్‌లో సవరణలు

- తొలుత అనర్హులకు జాబితాలో చోటు
- తాజాగా వారిస్థానంలో కొత్తవారి ఎంపిక

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 సర్వీసెస్ (18/2016) సెలెక్షన్స్‌లో తప్పులు జరిగాయి. ఒకటి కాదు... రెండు కాదు... మొత్తం 12 మంది అభ్యర్థుల విషయంలో తప్పులు వెలుగు చూశాయి. గత నెల 27న ఎగ్జిక్యూటివ్, ఈ నెల 20న నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఏపీపీఎస్సీ సెలెక్షన్ జాబితాలను విడుదల చేసింది. ఈ జాబితాల్లో నుంచి ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక చేసిన ఒక అభ్యర్థిని, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక చేసిన 11 మందిని తొలగిస్తూ గురువారం ఏపీపీఎస్సీ సవరణ ఇచ్చింది. వారి స్థానంలో కొత్తగా 12 మందిని సెలెక్ట్ చేసింది. ఏపీపీఎస్సీ సిబ్బంది నిర్వాకం వల్లే ఈ తప్పులు జరిగినట్లు స్పష్టమైంది. ఆ వివరాలు.. ఎస్టీ కేటగిరీలో పోస్ట్ కోడ్ నం.02లో ఎంపికైన ఓ అభ్యర్థి ఏపీ ప్రభుత్వం నుంచి పొందిన ఎస్టీ ధ్రువీకరణ పత్రం సమర్పించక పోవడంతో అతన్ని జాబితా నుంచి తొలగించారు. సదరు అభ్యర్థి తెలంగాణకు చెందిన వ్యక్తి. అతని స్థానంలో ఎస్టీ కమ్యూనిటీకి చెందిన మరో అభ్యరిని ఎంపికచేశారు. ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటా కింద సెలెక్షన్స్ జాబితాలో ఉన్న ఇద్దరు అభ్యర్థులు వేరే ఉద్యోగంలో ఉండటంతో వారిని తొలగించారు. మరో అభ్యర్థి ఇండియన్ నేవీ నుంచి 2018 జనవరి 31న విడుదలయ్యారు. కానీ నిబంధన ప్రకారం సదరు అభ్యర్థికి ఎక్స్ సర్వీస్ కోటా కింద అర్హత లేదు. ఈ ముగ్గురి స్థానంలో కొత్త వారికి చోటు కల్పించారు. వీరు ఏప్రిల్ 2న జరిగే కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. ఐదుగురు అభ్యర్థులకు మెరిట్ ఉన్నప్పటికీ వారి సరైన అర్హతలను అప్‌డేటెడ్ బయోడేటాలో చేర్చకపోవడంతో సిబ్బంది గమనించలేదు. వాస్తవానికి ఆయా అభ్యర్థులకు పోస్ట్ కోడ్ నం.14,15,16లకు తగిన అర్హతలు లేవు. ఫలితంగా వారిని సెలెక్షన్ జాబితా నుంచి తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించారు. సెలెక్షన్స్ జాబితాలో ఉన్న ముగ్గురు అభ్యర్థులు తాజాగా ఏపీపీఎస్సీ చేపట్టిన ఏఎస్‌డబ్ల్యూవో పోస్టుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడంతో వారిని జాబితా నుంచి తొలగించారు. కొత్తగా అభ్యర్థులను ఎంపిక చేశారు.

బీసీ కమిషన్‌కు మంజునాథ రాజీనామా

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ చైర్మన్ పదవికి జస్టిస్ కేఎల్ మంజునాథ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను మెయిల్ రూపంలో సీఎం చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్‌లకు పంపారు. రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించినందున, ఇక తనకు పనిలేదని, అందువల్లే రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. కమిషన్‌కు చైర్మన్‌గా నియమించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

సీబీఐ అదుపులో 'కనిష్క్' డైరెక్టర్లు

చెన్నై, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నకిలీ దస్తావేజులతో బ్యాంకులను మోసగించిన కేసులో కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు భూపేశ్‌కుమార్ జైన్, అతడి భార్య నీతా జైన్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది. బుధవారం చెన్నై నుంచి బెంగళూరు వెళ్లిన వీరిద్దరినీ అధికారులు గురువారం విచారించారు.

జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 సిద్ధం!

శ్రీహరికోట (సూళ్లూరుపేట) మార్చి 22: జీఎస్ఎల్‌వీ-ఎఫ్08 రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధమైంది. శ్రీహరికోట సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని వీఏబీ (వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్)లో రాకెట్ అనుసంధానాన్ని పూర్తిచేశారు. శుక్రవారం రాకెట్‌ను రెండో ప్రయోగ వేదిక ఉబ్లికల్ టవర్ వద్దకు తరలించనున్నారు.

మాకూ 'మతం' హోదా ఇవ్వరూ!

- కర్ణాటకలో క్యూ కట్టిన కులాలు

బెంగళూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో లింగాయత్, వీరశైవ లింగాయత్‌లకు మతం హోదా ప్రకటించిన కొన్ని గంటల్లోనే తమకు కూడా ఆ హోదా ఇవ్వాలంటూ అనేక కులాలు క్యూ కట్టాయి. మరికొద్ది రోజుల్లో శాసనసభకు ఎన్నికలు జరుగనున్న తరుణంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య కులాల తేనెతుట్టెను కదిపారని, ఇదంతా దాని ఫలితమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని బెంగళూరులో గురువారం కొడవ సమాజ నేతలు కోరారు.

ఫేస్'బుక్'

- 62 మందికి లైంగిక వేధింపులు
- డబ్బుల కోసం బ్లాక్‌మెయిలింగ్
- యువకుడి అరెస్టు


శ్రీనివాసరావు

సర్పవరం జంక్షన్, మార్చి 22: డబ్బు అవసరాల కోసం ఫేస్‌బుక్‌లో అమ్మాయిగా అవతరించాడు. వైద్య కళాశాల పెడుతున్నానంటూ మెడికోలు, ఇంజనీరింగ్, ఏజీ బీఎస్సీ విద్యార్థినులతో పరిచయాలు పెంచుకున్నాడు. దొరికిన ఫోటోల ఆధారంగా లైంగిక వేధింపులకు, డబ్బుల కోసం బ్లాక్‌మెయిలింగ్‌కు దిగాడు. పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని అరెస్టు చేశారు. కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన 28ఏళ్ల స్వామిరెడ్డి శ్రీనివాసరావు రాజీవ్‌గాంధీ లా కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. చెడు వ్యవసనాలు, విలాసాలకు బానిసైన శ్రీనివాసరావు ఫేస్‌బుక్ పరిచయాల ఆధారంగా మెడికల్ కాలేజీల విద్యార్థినులను వేధించడం ప్రారంభించాడు. మెడికల్ కాలేజీ నిర్మిస్తున్నానని, ఉద్యోగాలు, ఎంఎస్ సీట్లు ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులు అతని వలలో పడ్డారు. వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. వీడియోకాల్ చాటింగ్‌లు చేశారు. వాటిని అడ్డంపెట్టుకుని పలువురిని లైంగికంగా వేధించాడు. కొంతమందిని డబ్బులకోసం బ్లాక్‌మెయిలింగ్ చేశాడు. వేధింపులు భరించలేని ఇద్దరు మెడికోలు ఇటీవల కాకినాడలో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నికి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసులు నిందితుడిని గురువారం కాకినాడ నాగమల్లితోట జంక్షన్‌లో అరెస్టు చేశారు.

మైనర్ బాలికపై లైంగిక వేధింపులు

విశాఖపట్టణంలో 5వ పట్టణ పీఎస్ పరిధిలో ఓ మైనర్ బాలికను శ్రీనివాసరావు లైంగికంగా వేధించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ మేరకు అక్కడే కేసు నమోదయ్యింది. విశాఖ, కాకినాడలలో విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి రెండు స్కూటీలను అపహరించాడు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిపై నిర్భయ కేసు

విద్యార్థినులను లైంగికంగా వేధించి, బ్లాక్ మెయిలింగ్‌కి పాల్పడిన స్వామిరెడ్డి శ్రీనివాసరావుపై నిర్భయ కేసు నమోదు చేసి.. రౌడీషీట్ తెరుస్తున్నట్లు డీఎస్పీ రవివర్మ తెలిపారు. నిందితుడి వేధింపులు భరించలేక సొంత తల్లి తనకున్న మూడు ఎకరాల్లో ఎకరం పొలాన్ని తాకట్టుపెట్టి కారు కొనిచ్చిందన్నారు. అపరిచితులతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లో చాటింగ్ చేసి, బంగారు భవిష్యత్తును విద్యార్థినులు నాశనం చేసుకోవద్దని కోరారు. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలపై పూర్తి పర్యవేక్షణ ఉంచాలని డీఎస్పీ సూచించారు. కేసును సత్వరమే ఛేదించిన సీఐ చైతన్యకృష్ణ, హెచ్‌సీ రాధిక, రూప్‌కుమార్‌లను డీఎస్పీ రవివర్మ ప్రత్యేకంగా అభినందించారు.

రూ.20 లక్షల వరకూ నో ట్యాక్స్

- పన్ను రహిత గ్రాట్యుటీ పరిధి రెట్టింపు
- సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 22: సంఘటిత రంగంలోని ఉద్యోగులకు శుభవార్త! పన్ను రహిత గ్రాట్యుటీ పరిధి ప్రస్తుతమున్న రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెరగనుంది. ఈమేరకు రూపొందించిన 'గ్రాట్యుటీ చెల్లింపు(సవరణ) బిల్లు-2017'కు రాజ్యసభ గురువారం మూజువాణీ ఓటుతో ఆమోదం తెలిపింది. చైర్మన్ వెంకయ్యనాయుడు సభలో మాట్లాడుతూ... ఉద్యోగులకు ఎంతో కీలకమైన ఈ బిల్లుపై ఉదయమే పలు పార్టీల నాయకులతో చర్చించినట్లు చెప్పారు. ఆమోదానికి సభ్యులందరూ సహకరించాలని ఆయన కోరారు. అనంతరం కార్మికశాఖ మంత్రి సంతోశ్ కుమార్ గంగ్వార్ ఈ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టగా.. ఎలాంటి చర్చా లేకుండానే సభ ఆమోదించింది. ఈ బిల్లు లోక్‌సభలో గతవారమే పాస్ అయింది. పరిశ్రమలు, గనులు, చమురు క్షేత్రాలు, తోటలు, ఓడరేవులు, రైల్వే కంపెనీలు, షాపులు, తదితర సంస్థల్లో పని చేస్తున్న వారికి గ్రాట్యుటీ ప్రయోజనం కలుగుతుంది. 10 లేదా అంతకంటే ఎక్కువ మంది పని చేస్తున్న ఈ సంస్థల్లో... నిరంతరాయంగా కనీసం ఐదేళ్లు పని చేసిన ఉద్యోగులకు ఈ చట్టం వర్తిస్తుంది. ప్రసూతి సెలవుల వల్ల గ్రాట్యుటీ విషయంలో మహిళలకు ఎలాంటి నష్టమూ కలగకుండా ప్రభుత్వం చట్టసవరణ చేసింది. ప్రసూతి ప్రయోజన చట్టం-1961 ప్రకారం... 12 వారాలు సెలవు లభిస్తుంది. అంటే.. ఆ సమయంలో కూడా విధుల్లో ఉన్నట్లుగానే పరిగణిస్తారు. ఈ సెలవును 26 వారాలకు పెంచుతూ ప్రసూతి ప్రయోజనం(సవరణ) చట్టం తీసుకొచ్చింది. ఈ సెలవు సమయంలో మార్పులు చేయాల్సి వస్తే ఆదేశాలు జారీ చేసే వెసులుబాటు కూడా ప్రభుత్వానికి లభిస్తుంది.

ఇటు పరిపాలన.. అటు ప్రజాకర్షణ!

- రెండూ నెరవేరేలా సచివాలయ సముదాయం.. ఏపీసీఆర్డీఏ సమీక్షలో సీఎం


నిర్మాణాల గురించి సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న నార్మన్ ఫోస్టర్ ప్రతినిధి

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజధానిలోని పరిపాలనా నగరంలో నిర్మించనున్న సచివాలయం తుది ఆకృతులపై దాదాపుగా స్పష్టత వచ్చింది. మాస్టర్ ఆర్కిటెక్ట్ నార్మన్ ఫోస్టర్ ప్లస్ పార్ట్‌నర్స్ వీటికి సంబంధించి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రజెంటేషన్ ఇవ్వగా, అవి ఆయన ప్రశంసలు చూరగొన్నాయి. శుక్రవారం శాసనసభ్యులకు ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఏపీసీఆర్డీఏ సమీక్షా సమావేశంలో సచివాలయం తుది ఆకృతులపై విస్తృత చర్చ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సచివాలయాన్ని 5 టవర్లుగా, పాలవాగుకు ఒకవైపున 3, మరోవైపు 2 చొప్పున నిర్మించాలని నార్మన్ ఫోస్టర్స్ ప్రతిపాదించారు. వీటిల్లో నాలుగు టవర్లు 40 అంతస్థులతో నిర్మితమవుతుండగా.. ముఖ్యమంత్రి కొలువుదీరే టవర్ మాత్రం 46 అంతస్థులతో ఉండనుంది. దీనిపైనే హెలిప్యాడ్ కూడా నిర్మిస్తారు. సచివాలయమంటే కేవలం పరిపాలనా కేంద్రంగానే కాకుండా సాయంత్రం వేళల్లో, సెలవు దినాల్లో సాధారణ ప్రజలు, పర్యాటకులు వచ్చి సేద తీరేందుకు వీలుగా ఉండాలన్న ముఖ్యమంత్రి సూచనను అనుసరించి 5 టవర్లకు చెంతనే ఫుడ్ ప్లాజాలు, క్రీడాప్రదేశాలు, ఇతర వసతులు కల్పించేందుకు వీలుగా నిర్మాణాలు జరుపుతారు. ప్రతి నిర్మాణం ఐకానిక్‌గా రూపుదిద్దుకోవాలని చంద్రబాబు అన్నారు. సత్వరమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో అమరావతిలో జరగనున్న సంతోష నగరాల సదస్సుకు జరుగుతున్న ఏర్పాట్లను చంద్రబాబు ఈ సమావేశంలో సమీక్షించారు. ఏప్రిల్ 1 నాటికే విజయవాడ నగరం ఈ సదస్సుకు సిద్ధం కావాలన్నారు. బెజవాడ సంతోష నగరంగా మారిపోవాలని చెప్పారు.

వొడాఫోన్-ఐడియా సారథి కుమార్ మంగళం



న్యూఢిల్లీ : త్వరలో విలీనంకానున్న వొడాఫోన్, ఐడియా ఉమ్మడి కంపెనీకి కుమార్ మంగళం బిర్లా నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఐడియా సెల్యులార్, వొడాఫోన్ గ్రూప్ విలీనం కానున్న కంపెనీకి కొత్త నాయకత్వ బృందాన్ని గురువారం ప్రకటించాయి. వొడాఫోన్ ఇండియా ప్రస్తుత సిఇఒగా ఉన్న బాలేశ్ శర్మ సిఇఒగా బాధ్యతలు చేపడతారు. ఆయన ఉమ్మడి సంస్థ వ్యాపార వ్యూహాలు, అమలు అంశాలు పర్యవేక్షిస్తారు. విలీనం ప్రక్రియ పూర్తయ్యే వరకు రెండు సంస్థల్లోని సిబ్బంది ఎవరి వ్యాపార కార్యకలాపాలు వారు నిర్వహిస్తారు.

అమెరికాలో వడ్డీ రేట్ల పెంపు

భారత్‌కు ఢోకాలేదన్న మార్కెట్‌వర్గాలు

ముంబై: అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడ్ రిజర్వ్' వడ్డీ రేట్లను పావు శాతం పెంచింది. దీంతో అమెరికాలో ప్రస్తుతం కనీస వడ్డీ రేట్లు 1.25-1.5 శాతం నుంచి 1.5-1.75 శాతానికి చేరాయి. ఫెడ్ రిజర్వ్ ఈ సంవత్సరం వడ్డీ రేట్లు పెంచడం ఇదే మొదటిసారి. జెరోమ్ పోవెల్ కొత్తగా చైర్మన్ బాధ్యతలు స్వీకరించాక ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచడం కూడా ఇదే మొదటిసారి. వృద్ధి రేటు ఆశాజనకంగా ఉన్నందున 2019 ఆఖరిలోగా మరో మూడు సార్లు ఫెడ్ వడ్డీ రేట్లు పెంచుతుందని మార్కెట్ వర్గాల అంచనా.



భారత్‌పై ప్రభావం

సాధారణంగా అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే భారత్‌తో సహా వర్ధమాన దేశాల మార్కెట్లు కుదుపునకు లోనవుతాయి. ఈ దేశాల మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసిన విదేశీ పోర్టుఫోలియో మదుపరు(ఎఫ్‌పిఐ)లు ఈ దేశాల్లో తమ పెట్టుబడులను భారీగా విక్రయించి అమెరికా మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంటాయి. ప్రస్తుతం మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. గురువారం భారత మార్కెట్‌లో ఇదే పరిస్థితి కనిపించింది. అమెరికాలో కనీస వడ్డీ రేట్లు 2.5 శాతం మించనంత వరకు ఎఫ్‌పిఐలు భారత్‌తో సహా వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్లలో పెద్దగా అమ్మకాలకు దిగకపోవచ్చని మార్కెట్‌వర్గాల అంచనా. ప్రస్తుతం వర్ధమాన దేశాల మార్కెట్లను అమెరికా వడ్డీ రేట్ల కంటే 'వాణిజ్య' యుద్ధ మేఘాలే ఎక్కువగా ప్రభావితం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా మేధో సంపత్తి హక్కుల(ఐపిఆర్) పరిరక్షణ పేరుతో చైనా దిగుమతులపై 5,000 కోట్ల డాలర్ల విలువైన సుంకాలు విధించేందుకు ట్రంప్ సర్కార్ సిద్ధమవుతుందన్న వార్తలు మార్కెట్‌ను ఎక్కువగా భయపెడుతున్నాయి.

'వాణిజ్య యుద్ధాలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు పెద్ద సవాల్‌గా మారనున్నాయి. ఆ ప్రభావం భారత మార్కెట్‌పైనా ఉంటుంది. ఈ ప్రమాదం లేకపోతే ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు ప్రభావం భారత్‌లో ఎఫ్‌పిఐల పెట్టుబడులను ఏ విధంగానూ ప్రభావితం చేయదని నా అంచనా.

- పంకజ్ పాండే, రీసెర్చ్ హెడ్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్

చరిత్రను చూస్తే ఫెడ్ వడ్డీ రేట్లు 2.5 శాతానికి చేరే వరకు మార్కెట్‌కు ఎలాంటి ఢోకా లేదు. కాబట్టి 2019తో ఫెడ్ రిజర్వ్ మరో మూడుసార్లు వడ్డీ రేట్లు పెంచుతుందన్న వార్తలపై మాకు ఎలాంటి ఆందోళన లేదు.

- వికె శర్మ, హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్

టోటెమ్ ఇన్‌ఫ్రా రూ.1,394 కోట్ల ఎగవేత

యూనియన్ బ్యాంక్ ఫిర్యాదుపై కేసు నమోదు.. ఆదాయం పన్నుల ఎగవేత రూ.400 కోట్లు

▸▸ ప్రమోటర్ల ఇళ్లు, కార్యాలయాలపై సిబిఐ దాడులు, సోదాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇది మరో బ్యాంకు రుణాల కుంభకోణం. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టోటెమ్ ఇన్‌ఫ్రా ఎనిమిది బ్యాంకుల కన్సార్షియంకు 1,394 కోట్ల రూపాయలు ఎగవేసినట్టుగా తెలిసింది. కన్సార్షియం లీడ్ బ్యాంకర్‌గా ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు మేరకు ఈ కంపెనీ, దాని ప్రమోటర్లపై సిబిఐ కేసులు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్‌కు ఈ సంస్థ 313 కోట్ల రూపాయల మేర ఎగవేసింది. టోటెమ్ ఇన్‌ఫ్రా ప్రమోటర్లు తొట్టెంపూడి సలలిత్, తొట్టెంపూడి కవితకు వ్యతిరేకంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా... ఇండస్ట్రియల్ ఫైనాన్స్ శాఖ సిబిఐకి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సిబిఐ అధికారులు ప్రమోటర్లు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రమోటర్ల ఇళ్లపైనా కార్యాలయాలపైనా దాడులు జరిపి సోదాలు నిర్వహించినట్టుగా తెలిసింది. రోడ్ల నిర్మాణం, నీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన ప్రాజెక్టులను సొంతగానూ, సబ్ కాంట్రాక్టర్‌గానూ టోటెమ్ ఇన్‌ఫ్రా చేపట్టేదని తెలిసింది. ప్రత్యేక ప్రాజెక్టుల నిర్మాణం కోసం కనీసం అరడజనుపైగా కంపెనీలను టోటెమ్ 2011 కంటే ముందు ప్రమోట్ చేసింది. 1997లో ఏర్పాటైన ఈ సంస్థ దాదాపు పదిపదిహేనేళ్లపాటు చురుగ్గానే ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం గత అయిదారేళ్ల నుంచే ఈ సంస్థ కార్యకలాపాలు మూలబడ్డాయి. యూనియన్ బ్యాంకు రుణం 2012లోనే ఎన్‌పిఎగా మారింది. కంపెనీ ఆఖరుసారిగా వార్షిక జనరల్ బాడీ మీటింగ్ కూడా 2012 సెప్టెంబరులో నిర్వహించింది. కంపెనీ ఆఖరుసారిగా బ్యాలెన్స్ షీట్‌ను కూడా 2012 మార్చిలో ప్రకటించింది. కంపెనీ వ్యయాల్ని పెంచిచూపిందనీ, నిధులను సొంత పద్దుల్లోకి మళ్లించిందనీ సిబిఐ ఆరోపిస్తోంది. టోటెమ్ ఇన్‌ఫ్రా ఆదాయం పన్నుల ఎగవేతకు సంబంధించిన ఆరోపణలు కూడా ఎదుర్కొంటున్నది. 2015లో ఐటి శాఖ ప్రకటించిన పన్ను ఎగవేతదారుల జాబితాలో ఈ సంస్థ ఉంది. 400 కోట్ల రూపాయల పన్ను బకాయిలతో ఈ సంస్థ బడా పన్ను ఎగవేతదారుల జాబితాలో చేరింది. 2016లో ఎస్‌బిఐ టాప్ 100 డీఫాల్టర్లలో 60 మందికి సంబంధించిన 7,000 కోట్ల రూపాయల రుణాలను రైటాఫ్ చేసింది. ఇందులో కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన 1,200 కోట్ల రుణంతోపాటు టోటెమ్‌కు సంబంధించిన 93 కోట్ల రూపాయల రుణం కూడా ఉంది.

పిఎన్‌బి జారీచేసిన ఎల్‌ఒయులు 41వేలు

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) 2011 నుంచి దాదాపు 4,1178 ఎల్‌ఒయులను జారీ చేసింది. ఇందులో 1590 ఎల్‌ఒయులు కేవలం నీరవ్ మోదీ కంపెనీలకే జారీ చేశారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈ వివరాలు చెప్పారు. వాస్తవానికి నీరవ్ మోదీ కంపెనీలకు జారీ చేసిన ఎల్‌ఒయులు బోగస్‌వని వాటిని తాము అధికారికంగా జారీ చేయలేదని పిఎన్‌బి చెబుతున్న విషయం తెలిసిందే. పిఎన్‌బి జారీచేసిన ఎల్‌ఒయుల్లో 7,672 ఎల్‌ఒయులను 90 రోజుల కాలపరిమితితో జారీ చేశారని, 20,078 ఎల్‌ఒయులను 180 రోజులు చెల్లుబాటయ్యే విధంగా జారీ చేశారని పెద్దల సభలో అరుణ్ జైట్లీ తెలిపారు. 11,224 ఎల్‌ఒయులను 365 రోజుల పరిమితితోనూ, 2,204 ఎల్‌ఒయులను 365 రోజుల కంటే ఎక్కువ కాలపరిమితితోనూ జారీ చేశారని ఆయన చెప్పారు.

సిబిఐ అదుపులో కనిష్క్ డైరెక్టర్లు

కనిష్క్ గోల్డ్ డైరెక్టర్లు భూపేష్ కుమార్ జైన్, ఆయన భార్య నీతా జైన్‌ను సిబిఐ అధికారులు ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. వీరిద్దరూ మారిషస్ నుంచి బుధవారం రాత్రి బెంగళూరు చేరుకోగా, ఆ వెంటనే సిబిఐ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నట్టు చెబుతున్నారు. బ్యాంకులను 824 కోట్ల రూపాయల మేర మోసగించినట్టుగా ఈ సంస్థపై కేసు నమోదైన విషయం తెలిసిందే. సిబిఐ అధికారులు వారిని ఎట్టకేలకు కాంటాక్ట్ చేయగలిగారని, వారి సూచనపైనే జైన్ దంపతులు బెంగళూరు చేరుకున్నారని తెలిసింది.

నోట్ల రద్దు సూపర్ సక్సెస్

పెద్దనోట్ల రద్దు పర్యవసానాలపై ప్రజాభిప్రాయం ఎలా ఉన్నా ఆర్థిక మంత్రి జైట్లీ మాత్రం రద్దు వల్ల భారీగా నల్లధనం బయటపడిందనీ, అవినీతికి అడ్డుకట్టపడిందని చెబుతున్నారు. ఇందుకు తనదైన తర్కాన్ని కూడా జోడించి రాజ్యసభకు ఆయన వివరణ ఇచ్చారు. ఆయన ఏం చెప్పారంటే...

- పెద్ద నోట్ల రద్దు కంటే ముందు దేశంలో 1000, 500 నోట్ల రూపంలో మొత్తం 15.44 లక్షల రూపాయల నగదు చలామణిలో ఉండేది. అంతకుముందు కొన్నేళ్లుగా పెద్ద నోట్ల చలామణిలో కనిపిస్తున్న పెరుగుదలను బట్టి చూస్తే 2017 డిసెంబరు నాటికి పెద్దనోట్ల రూపంలో చలామణిలో ఉన్న నగదు విలువ 18 లక్షల కోట్ల రూపాయలకు చేరేది. నోట్ల రద్దు నిర్ణయం వల్ల 2017 డిసెంబరునాటికి చలామణిలో ఉన్న పెద్దనోట్ల విలువ 13.34 లక్షల కోట్ల రూపాయలకు తగ్గింది. పెద్దనోట్ల రద్దు చర్య వల్ల అవినీతి, నల్లధనాన్ని నియంత్రించడంతో పాటు నకిలీ కరెన్సీ నిర్మూలన, ఉగ్రవాదమూకలకు నిధులు అందకుండా చెక్‌పెట్టడం, అవ్యవస్థీకృతరంగాన్ని వ్యవస్థీకృతం చేయడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలను కూడా ప్రభుత్వం సాధించింది.

మూడేళ్లలో రూ.100 కోట్ల టర్నోవర్ లక్ష్యం

జెన్‌క్యూ లక్ష్యం సిఇఒ మురళి బొల్లు



జెన్‌క్యూ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, జెన్‌క్యూ సిఇఒ మురళి బొల్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే మూడేళ్లకాలంలో 100 కోట్ల రూపాయల టర్నోవర్‌ను సాధించాలన్న లక్ష్యంతో ఉన్నట్టు ప్యూర్ ప్లే టెస్టింగ్ సర్వీసులు అందిస్తున్న జెన్‌క్యూ సిఇఒ మురళి బొల్లు తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో తమ కంపెనీ 42 కోట్ల రూపాయల రాబడిని నమోదు చేసుకుందన్నారు. గురువారం మాదాపూర్‌లోని అసెండాస్ ఐటి పార్కులో కంపెనీ గ్లోబల్ హెడ్‌క్వార్టర్స్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 1.09 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కార్యాలయం ఉందని, ప్రస్తుతం కంపెనీలో 400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వచ్చే మూడేళ్ల కాలంలో ఉద్యోగుల సంఖ్యను 1,000కి పెంచుకోనున్నట్టు తెలిపారు. కొత్త కార్యాలయంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి), మెషిన్ లెర్నింగ్ టెస్టింగ్ లాబ్స్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఏడాదిలోగా 150 కొత్త 'బి న్యూ' స్టోర్లు

2020నాటికి రూ.1,000 కోట్ల టర్నోవర్ : బి న్యూ మొబైల్స్ చైర్మన్ వైడి బాలాజీ చౌదరి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మొబైల్స్ విక్రయ సంస్థ 'బి న్యూ' భారీ ఎత్తున విస్తరించేందుకు రెడీ అవుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఇప్పటికే 52కు పైగా స్టోర్లను నిర్వహిస్తుండగా, విస్తరణలో భాగంగా కొత్తగా 150 మొబైల్ స్టోర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు బి న్యూ మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వైడి బాలాజీ చౌదరి తెలిపారు. ప్రస్తుతమున్న 52 స్టోర్లలో 50 స్టోర్లు ఆంధ్రప్రదేశ్‌లో పదమూడు ఉన్నాయని, తెలంగాణలో హన్మకొండ, కరీంనగర్‌లో మాత్రమే స్టోర్లున్నాయని చెప్పారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 100 స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు బాలాజీ చెప్పారు. మరో 50 స్టోర్లను ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పనున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో బి న్యూ స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో జిల్లాలో 4 నుంచి ఐదు స్టోర్లను, హైదరాబాద్‌లో 50 స్టోర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కో స్టోర్ కోసం 20 నుంచి 40 లక్షల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు బాలాజీ పేర్కొన్నారు. మరో 50 స్టోర్లను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయటం ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి స్టోర్ల సంఖ్యను 200 కు చేర్చాలని చూస్తున్నట్లు చెప్పారు. కొత్త టెక్నాలజీ పట్ల వినియోగదారులకు ఆసక్తి పెరిగిపోవటంతో పాటు డేటా తక్కువ ధరకే లభిస్తుండటంతో స్మార్ట్‌ఫోన్లకు రోజురోజుకు డిమాండ్ పెరిగిపోతుందని, అందుకుతగ్గట్టుగానే దక్షిణాది రాష్ట్రాల్లో సంఘటిత రంగంలో పెద్ద ఎత్తున మొబైల్ రిటైల్ స్టోర్లు ఏర్పాటవుతున్నాయని బాలాజీ చెప్పారు. స్టోర్లలో మొబైల్స్ విక్రయాలతో పాటు సర్వీసింగ్, ఫైనాన్సింగ్ సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. కర్నాటకకు విస్తరించాలని చూస్తున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది రూ.250 కోట్ల టర్నోవర్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బి న్యూ మొబైల్స్ 250 కోట్ల రూపాయల టర్నోవర్‌ను నమోదు చేయనుందని బాలాజీ వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్త స్టోర్లు అందుబాటులోకి రానుండటంతో 500-750 కోట్ల రూపాయల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. 2020 నాటికి సంస్థ టర్నోవర్‌ను 1,000 కోట్ల రూపాయలకు చేర్చాలని భావిస్తున్నట్లు బాలాజీ తెలిపారు. బి న్యూ స్టోర్లలో ఫీచర్, స్మార్ట్ ఫోన్ విక్రయాలతో పాటు ఇతర యాక్సెసరీలు, లాప్‌టాప్‌లు విక్రయించనున్నట్లు చెప్పారు.

భిన్న విభాగాల్లోకి..

విస్తరణలో భాగంగా ఎడ్యుకేషనల్ టూల్స్ విభాగంలోకి ప్రవేశించాలని చూస్తున్నట్లు బాలాజీ తెలిపారు. తొలుత ఎల్‌కెజి నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా టాబ్స్‌ను రూపొందించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ఆర్ అండ్ డి పనులను చేపట్టడమే కాకుండా కొన్ని పాఠశాలలతో చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే సిసి కెమెరాల వ్యాపారంలోకి బి న్యూ మొబైల్స్ అడుగుపెట్టనుందని పేర్కొన్నారు. ఇప్పటికే సిసి కెమెరాల తయారీ సంస్థ సి ప్లస్ సంస్థతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నట్లు చెప్పారు. అలాగే చైనా స్మార్ట్‌ఫోన్ దిగ్గజం షామీ త్వరలో దేశీ మార్కెట్లోకి విడుదల చేయనున్న టీవీలకు బి న్యూ స్టోర్లలో బుకింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

విజయవాడ-షిర్డీ విమాన సర్వీసు

▸▸ మే నెలలో ప్రారంభించనున్న సుప్రీం ఎయిర్‌లైన్స్

▸▸ తొలిసారిగా విశాఖకు ఇండిగో సర్వీసు

విజయవాడ (ఆంధ్రజ్యోతి): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మరిన్ని విమాన సర్వీసులు అందుబాటులోకిరానున్నాయి. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పలు విమానయాన సంస్థలు తమ సర్వీసులను విస్తరించేందుకు రెడీ అవుతున్నాయి. ఈ మధ్యనే విజయవాడ నుంచి సర్వీసులు ప్రారంభించిన ఇండిగో ఎయిర్‌లైన్స్.. చెన్నై, బెంగళూరు నగరాలకు సర్వీసులు విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఈ రెండు సర్వీసులు ఏప్రిల్ 4 నుంచి అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. ఇండిగో ఇప్పటికే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మూడు, చెన్నై, బెంగళూరు నగరాలకు ఒక్కో విమానాన్ని నడుపుతోంది.

అలాగే ఏప్రిల్ 25 నుంచి విశాఖపట్నానికి సర్వీసును ప్రారంభించాలని నిర్ణయించింది. మరోవైపు విజయవాడ నుంచి షిర్డీకి విమాన సర్వీసును నిర్వహించేందుకు సుప్రీం ఎయిర్‌లైన్స్ ముందుకవచ్చింది. చార్టర్డ్ విమానాలతో సేవలందిస్తున్న ఈ సంస్థ ఇప్పటికే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) నుంచి అనుమతులు కూడా అందుకుంది. విజయవాడ విమానాశ్రయంలో బుకింగ్, చెకిన్ కౌంటర్లతో పాటు, పార్కింగ్ సదుపాయాన్ని కల్పించాలని కోరుతూ విజయవాడ విమానాశ్రయ అధికారులకు సుప్రీం ఎయిర్‌లైన్స్ సంస్థ లేఖ రాసింది. మే నెలలో షిర్డీకి విమాన సర్వీసును అందుబాటులోకి తీసుకురావాలని సుప్రీమ్ యోచిస్తోంది. మరోవైపు స్పైస్ జెట్ కూడా వేసవికి మరిన్ని సర్వీసులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

టూవీలర్ల కోసం ఆర్ఒహెచ్‌ఎం ప్యానెల్ చిప్‌సెట్ సొల్యూషన్లు

న్యూఢిల్లీ : దేశంలోని ఆధునిక టూవీలర్లకు అవసరమైన ప్యానెల్ చిప్‌సెట్ సొల్యూషన్స్‌ను జపాన్‌కు చెందిన ఆర్ఒహెచ్‌ఎం సెమీకండక్టర్స్ విడుదల చేసింది. ఆటోమోటివ్ ఎల్‌సిడిల (నావిగేషన్, ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్లకు వినియోగించే భారీ హై రెజొల్యూషన్ మానిటర్లు సహా) నియంత్రణ కోసం ఈ చిప్‌సెట్‌ను రూపొందించినట్టు కంపెనీ తెలిపింది. సరికొత్త ఆటోమోటివ్ ప్యానెల్ చిప్‌సెట్ భారత మార్కెట్‌కు ఎంతో అవసరమని, ఇది భద్రతను, సౌకర్యాన్ని పెంచుతుందని ఆర్ఒహెచ్‌ఎం సెమీకండక్టర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ దైసుకే నకమురా తెలిపారు.

స్పీడోమీటర్, సైడ్ మిర్రర్స్, ఇతర వాహన సిస్టమ్స్ ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కొత్త ప్యానెల్ చిప్‌సెట్ సొల్యూషన్ ద్వారా 2021నాటికి మొత్తం రాబడులు 10 కోట్ల డాలర్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు.

స్మార్ట్ సిటీలకు సవాలక్ష సవాళ్లు!

అభివృద్ధిపై ప్రణాళికలు అవసరం

కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం ముఖ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే స్మార్ట్ సిటీలు పూర్తిస్థాయిలో నిర్మితం కావు. ఒక్కో నగరానికి ఏడాదికి కేవలం రూ.100 కోట్లు మంజూరు చేస్తే ఎలాంటి మార్పు ఉండదు. రాష్ట్ర ప్రభుత్వాలే చొరవ తీసుకుని సాంకేతికతతో వాటిని అభివృద్ధి చేయాలి. 99 స్మార్ట్ సిటీలు ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి' అని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసిసి)లో 'స్మార్ట్ అర్బనైజేషన్' ఎక్స్‌పో గురువారం ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పోలో కర్ణాటక రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి రోషన్ బేగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రం స్మార్ట్ సిటీలు ప్రకటించి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. నగరాలను ఎలా అభివృద్ధి చేయాలో ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించడం అవసరమని తెలిపారు. 2019లో అర్బనైజేషన్ సమ్మిట్‌ను కర్ణాటకలో నిర్వహిస్తున్నామని బేగ్ ప్రకటించారు. నగరాలను స్మార్ట్‌గా మార్చేందుకు అంతర్జాతీయంగా అత్యాధునిక పద్ధతులున్నాయని స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ప్రతాప్ పడోడే అన్నారు. ఇన్నోవేషన్ రంగంలో, స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేయడానికి చైనా.. భారత్‌కు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తోందని చైనా చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ షి యోంగ్ యాంగ్ తెలిపారు. ఎక్స్‌పోలో తెలంగాణ రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ డిజిపి కృష్ణప్రసాద్ పాల్గొని ప్రసగించారు. 30 మంది ఎగ్జిబిటర్లు స్టాళ్లను ఏర్పాటు చేశారు.

విస్తరణ బాటలో రీగస్

హైదరాబాద్, విజయవాడలో కొత్త కేంద్రాలు : ఐడబ్ల్యుజి కంట్రీ హెడ్ హర్ష్ లాంబా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కార్పొరేట్ సంస్థలు, స్టార్టప్స్, చిన్న తరహా సంస్థలకు అవసరమైన రీగస్ పేరుతో పని ప్రదేశాల (కో వర్కింగ్ స్పేస్) సేవలను అందిస్తున్న ఇంటర్నేషనల్ వర్క్‌ప్లేస్ గ్రూప్ (ఐడబ్ల్యుజి) భారత్‌లో కార్యకలాపాలను విస్తరించేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం భారత్‌లో కో వర్కింగ్ ప్లేస్‌కు డిమాండ్ పెరుగుతూ వస్తోందని అందుకు తగ్గట్టు కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు ఐడబ్ల్యుజి కంట్రీ మేనేజర్ (ఇండియా) హర్ష్ లాంబా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత్‌లో 16 నగరాల్లో 20 వేల సీట్ల సామర్థ్యం గల 104 కో వర్కింగ్ స్పేసెస్‌ను నిర్వహిస్తున్నామని, వచ్చే రెండేళ్ల కాలంలో ఈ సంఖ్యను రెట్టింపు చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో రీగస్ కింద 100 నుంచి 130 సీట్ల సామర్థ్యం గల కేంద్రాలను నిర్వహిస్తుండగా స్పేసెస్ కింద 400 నుంచి 500 సీట్ల సామర్థ్యం గల వర్కింగ్ స్పేస్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 1,500 సీట్ల సామర్థ్యం కలిగిన 8 కో వర్కింగ్ స్పేస్ సెంటర్లను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐటి, ఫైనాన్షియల్ విభాగాలతోపాటు సర్వీసుల రంగంలో కార్యకలాపాలు విస్తృతం అవుతుండటంతో కో వర్కింగ్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతోందని లాంబా అన్నారు. వచ్చే ఏడాది కాలంలో కో వర్కింగ్ స్పేసెస్‌ను 200కు చేర్చాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కో వర్కింగ్ స్పేస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడలో ఈ ఏడాది ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు లాంబా తెలిపారు.

ఐబిసి నిబంధనలు ఉల్లంఘించలేదు

▸▸ అల్ట్రాటెక్

న్యూఢిల్లీ: బినానీ సిమెంట్ (బిసిఎల్)ను కొనుగోలు చేయడానికి సమర్పించిన 7,266 కోట్ల రూపాయల బిడ్ విషయంలో తామేమీ ఐబిసి (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ) నిబంధనలను ఉల్లంఘించలేదని ఆదిత్యా బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ తెలిపింది. తాము ఐబిసి నిబందనలకు అనుగుణంగానే వ్యవహరించి బిడ్‌ను సమర్పించామని, తమ బిడ్స్‌ను సవరించేందుకు అనుమతి కూడా ఇచ్చారని అల్ట్రాటెక్ సిమెంట్ సిఎఫ్ఒ అతుల్ దాగా తెలిపారు. తాము ఆఫర్ చేసిన సొమ్ముకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

కోల్‌కతా-ముంబై మధ్య 'గతి' సరుకు రవాణా రైలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) తర్వాత పెద్ద ఎత్తున వ్యాపార విస్తరణ చేపట్టినట్లు గతి లిమిటెడ్ వెల్లడించింది. జిఎస్‌టితో లాజిస్టిక్ విధానంలో మార్పులు వచ్చాయని, అందుకు తగ్గట్టుగానే నెట్‌వర్క్ విస్తరణను చేపట్టినట్లు తెలిపింది. లాజిస్టిక్ కేంద్రాలుగా ఉన్న హైదరాబాద్, నోయిడా, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, ముంబై, అహ్మదాబాద్, అంబాలా, నాగ్‌పూర్‌ల్లో అనుబంధ సంస్థ గతి కెడబ్ల్యుఇ 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని జతచేసిందని పేర్కొంది. పెద్దఎత్తున లాజిస్టిక్ స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావటంతో డిస్ట్రిబ్యూషన్, వేర్‌హౌజింగ్ సామర్థ్యాలు రెండింతలు పెరగనున్నాయని వెల్లడించింది. డిసెంబరు త్రైమాసికంలో కొత్తగా 80 ఆపరేటింగ్ యూనిట్లను ప్రారంభించింది. మరోవైపు డెలివరీ నెట్‌వర్క్‌ను మరింత వేగవంతం చేసేందుకు కొత్తగా 125 ట్రక్కులను కొనుగోలు చేసింది. ఇదే సమయంలో కోల్‌కతా-ముంబై-కోల్‌కతా మధ్య సరుకు రవాణాను పెంచేందుకు భారతీయ రైల్వే నుంచి రైలును లీజుకు తీసుకుని గురువారం నుంచి కార్యకలాపాలను ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది. తొలుత 700కు పైగా టన్నుల సామర్థ్యంతో ఈ సర్వీస్‌ను ప్రారంభించినట్లు తెలిపింది.

ఆధునిక వాహనాల కోసం బ్లాక్‌బెర్రీ, జెఎల్ఆర్ జట్టు

న్యూఢిల్లీ : ఆటోమోటివ్ కంపెనీలు ఆధునిక వాహనాలు తయారు చేసేందుకు దోహదపడే టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకుగాను కెనడాకు చెందిన బ్లాక్‌బెర్రీ, టాటా గ్రూప్‌కు చెందిన జాగ్వార్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్) చేతులు కలిపాయి. ఈ మేరకు కుదిరిన ఒప్పందం ప్రకారం.. బ్లాక్‌బెర్రీ తన క్యుఎన్ఎక్స్, సెర్టికామ్ టెక్నాలజీ లైసెన్స్‌ను జెఎల్ఆర్‌కు ఇవ్వనుంది. అంతేకాకుండా నూతన ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ (ఇసియు) మాడ్యూల్స్ అభివృద్ధికి అవసరమైన ఇంజనీర్ల బృందాన్ని సమకూర్చనుంది. నెక్స్ట్ జెనరేషన్ ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్ తొలి ఇసియు ప్రాజెక్టు కానుందని కంపెనీ పేర్కొంది. కాగా ఈ రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పంద ఆర్థిక వివరాలు మాత్రం వెల్లడికాలేదు. బ్లాక్‌బెర్రీతో చేతులు కలిపినందు వల్ల సురక్షితమైన, భద్రతతో కూడిన నెక్స్ట్ జెనరేషన్ కనెక్టెడ్ కార్లను అభివృద్ధి చేయడానికి అవకాశం ఏర్పడుతుందని జెఎల్ఆర్ వెహికిల్స్ ఇంజనీరింగ్ డైరెక్టర్ డేవ్ నెస్‌బిట్ తెలిపారు. బ్లాక్‌బెర్రీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా డేటాను మరింత సమర్థవంతంగా ప్రాసెస్ చేయడానికి, భద్రంగా ఉంచడానికి ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33006.27	10114.75	30675	38480	65.11	68.72
129.92	40.50	225	480		

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

ఆర్‌కామ్ ఆస్తుల విక్రయానికి 'సుప్రీం' బ్రేక్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియోకు రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఆస్తుల విక్రయానికి మరోసారి అవరోధం ఏర్పడింది. బ్యాంకర్ల కన్సార్షియం అభ్యర్థన మేరకు స్పందించిన సుప్రీం కోర్టు ఆస్తుల్లో యథాతథ స్థితిని కొనసాగించాలని ఆర్‌కామ్‌ను ఆదేశించింది. జస్టిస్ ఎకె గోయెల్, జస్టిస్ ఆర్‌ఎఫ్ నారీమన్, జస్టిస్ యుయు లలిత్ సభ్యులుగా ఉన్న బెంచ్ ఆర్‌కామ్ ఆస్తుల విక్రయంపై బొంబాయి హైకోర్టు విధించిన స్టే ఎత్తివేయడానికి నిరాకరించింది. ఆస్తుల విక్రయంపై హైకోర్టు స్టే వ్యవహారంలో ఆర్‌కామ్, బ్యాంకుల కన్సార్షియం వాదనలను ఏప్రిల్ ఐదో తేదీన బెంచ్ పరిశీలించనుంది. ఆర్‌కామ్ కన్సాలిడేటెడ్ ఆస్తుల్లో వాటాను క్లెయిమ్ చేసుకునేందుకు ఎరిక్సన్‌ను అనుమతిస్తూ బొంబాయి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ట్రిబ్యునల్ ధ్రువీకరిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ఎస్‌బిఐ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది.

భారతీయ బ్యాంకులకు ఆర్‌కామ్ 42 వేల కోట్ల రూపాయలు చెల్లించాల్సింది. అనిల్ అంబానీ గ్రూప్‌లోని ఆర్‌కామ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్, రిలయన్స్ టెలికాం సంస్థలు ఆర్‌కామ్ కన్సాలిడేటెడ్‌లో సభ్య సంస్థలుగా ఉన్నాయి. ఆర్‌కామ్‌కు రుణాలందించిన ఆర్థిక సంస్థల్లో ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, ఎల్ఐసి, బార్‌క్లేస్ సహా 24 బ్యాంకులు, ఆర్థిక సహాయ సంస్థలు ఉన్నాయి. ఆర్‌కామ్ కన్సాలిడేటెడ్‌కు చెందిన ఆస్తులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా విక్రయించేందుకు అవి ఏర్పాట్లు చేశాయి.అయితే ఆర్‌కామ్ చేతిలోని స్పెక్ట్రమ్, సెల్ టవర్లు, 1.78 లక్షల కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ లైను, ఇతర మౌలిక వసతులను కొనుగోలు చేసేందుకు రిలయన్స్ జియో 17,300 కోట్ల రూపాయల డీల్ కుదుర్చుకుంది. సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించడంతో పాటు ఆర్‌కామ్ కన్సాలిడేటెడ్‌కు ఢిల్లీ, చెన్నైలో గల



రెండు ప్రాపర్టీలను 800 కోట్ల రూపాయలకు విక్రయించేందుకు కూడా సన్నాహాలు జరుగుతుండగా ఆర్‌కామ్ కన్సాలిడేటెడ్ ఆస్తుల విక్రయం నిలువరించాలని ఎరిక్సన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. మార్చి ఐదో తేదీన ఎరిక్సన్‌కు అనుకూలంగా ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేయగా దానికి వ్యతిరేకంగా ఆర్‌కామ్ చేసుకున్న అప్పీలును బొంబాయి హైకోర్టు మార్చి 8 తేదీన తిరస్కరించింది. ఇలా ఆది నుంచి ఈ డీల్‌కు ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి.

అన్నీ సానుకూలం అవుతాయంటున్న ఆర్‌కామ్

తమకు ఆర్‌బిఐ ఇచ్చిన గడువు ఆగస్టు 31లోగా ఆస్తుల విక్రయ ప్రక్రియ పూర్తి చేయగలమన్న విశ్వాసాన్ని ఆర్‌కామ్ ప్రకటించింది. సుప్రీం కోర్టు ఉత్తర్వులకు స్పందిస్తూ ఆర్‌కామ్ ఈ వ్యాఖ్యలు చేసింది.

చైనాపై కత్తి దూసిన ట్రంప్

నేడో రేపో వాణిజ్య ఆంక్షలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై కత్తి దూస్తున్నారు. చైనా వాణిజ్య ఉల్లంఘనలకు ప్రతిస్పందనగా వాణిజ్య ఆంక్షలు విధించే ఆస్కారం ఉన్నట్టు అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ప్రకటించింది. బీజింగ్ మేధోసంపత్తి హక్కులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి సంబంధించిన కట్టుబాట్లను ఉల్లంఘించిందనేందుకు బలమైన సాక్ష్యాలున్నట్టు అమెరికా వాణిజ్య ప్రతినిధి ప్రకటించారు. ఇందుకు ప్రతిగా యుఎస్‌టిఆర్ 301 కింద ట్రంప్ చైనాపై



వాణిజ్య ఆంక్షలు ప్రకటించనున్నట్టు వైట్‌హౌస్ ప్రిన్సిపల్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ రాజ్ షా తెలిపారు. అంతకు మించిన వివరాలు ప్రకటించడానికి అధికారులు నిరాకరించారు. తాము కోరిన వివరణలకు చైనా నుంచి వచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని అమెరికా యంత్రాంగం అధికారి ఒకరన్నారు. మార్కెట్ అనుకూల విధానాలు అనుసరిస్తామన్న హామీలను చైనా ఎంతవరకు ఆచరిస్తుందన్న అంశంపై ఎన్నో సందిగ్ధతలున్నట్టు పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఒకపక్క ఉత్తర కొరియాతో వాణిజ్య యుద్ధం సెగలు ఇంకా చల్లారకుండానే ఇప్పుడు ట్రంప్ చైనాపై కత్తి దూయడం ప్రపంచ మార్కెట్లను వణికిస్తోందని పరిశీలకులంటున్నారు.

సహజవాయువు ధర భారీగా పెంపు

న్యూఢిల్లీ: దేశీయ సహజవాయువు ధరను ప్రభుత్వం భారీగా పెంచనుంది. సహజవాయువు ఉత్పత్తిదారులు ధరల పెంపు కోసం ప్రభుత్వంపై కొంతకాలంగా ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్‌కు 2.89 డాలర్లు చెల్లిస్తుండగా ఏప్రిల్ ఒకటి నుంచి దీనిని 3.06 డాలర్లకు పెంచనున్నట్టుగా తెలిసింది. రేట్ల పెంపుతో సిఎన్‌జి ధరలు పెరుగుతాయి. విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరగడంతో వినియోగదారులపై భారం పడుతుంది. యూరియా ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్‌కు 3.06 డాలర్ల ధర గత రెండేళ్ల గరిష్ఠ స్థాయి అని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

- సాధారణంగా సహజవాయువు ధరలను ప్రభుత్వం ఆరు నెలలకోసారి సమీక్షిస్తుంది. అంతర్జాతీయంగా మిగులు సహజవాయువు ఉన్న అమెరికా, రష్యా, కెనడా వంటి దేశాల్లోని ధరల ఆధారంగా దేశీయ ధరలను నిర్ణయిస్తారు. ప్రస్తుత పెంపు ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు అమల్లో ఉంటుంది.
- భారత్ సహజవాయువు అవసరాల్లో సగానికి కంటే తక్కువే దేశీయంగా ఉత్పత్తి అవుతోంది. 50 శాతంపైగా మనం దిగుమతి చేసుకుంటున్నాం. దిగుమతి ధరలు దేశీయ ధరల కంటే రెట్టింపు స్థాయిలో ఉంటాయి.
- సహజవాయువు ధరల పెంపు నిర్ణయం వల్ల ప్రైవేట్ రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ బాగా లాభపడుతుంది. ధరలు గిట్టుబాటు కావడం లేదన్న భావనతో సహజవాయువు ఉత్పత్తిని గణనీయంగా తగ్గించిన ఈ సంస్థ ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. సర్కారు సంస్థ ఒఎన్‌జిసికి కూడా ఈ పరిణామం అనుకూలం. దేశీయ సహజవాయువు ఉత్పత్తిలో 70 శాతం వాటా ఒఎన్‌జిసిదే.
- ధరల పెంపు వల్ల సహజంగానే సిఎన్‌జి ధరలు పెరుగుతాయి. విద్యుత్ ఉత్పత్తి వ్యయం, ఎరువులు, పెట్రోకెమికల్స్ ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి.
- ప్రస్తుత ధరల పెంపు ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా, రిలయన్స్‌కు వర్తిస్తుంది. పన్నాముక్తా, తపతి, రవ్వ క్షేత్రాల్లో ఉత్పత్తికి ఇది వర్తించదు.

మళ్లీ ముసిరిన వాణిజ్య యుద్ధ భయాలు

130 పాయింట్లు దిగజారిన సెన్సెక్స్

ముంబై : ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలు పెరగడం మరోసారి స్టాక్ మార్కెట్‌ను నష్టాల బాటలోకి నెట్టింది. మూడు రోజుల వరుస లాభాలకు మార్కెట్ తెరదించింది. వాణిజ్య యుద్ధ భయాలు మరోసారి చెలరేగిన నేపథ్యంలో రియల్టీ, యంత్రపరికరాలు, టెక్నాలజీ, ఆటో, బ్యాంకింగ్ కౌంటర్లలో లాభాల స్వీకరణ లక్ష్యంగా భారీ అమ్మకాలు జరిగాయి. వాస్తవానికి ఉదయం మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమైనా యూరోపియన్ మార్కెట్లు నష్టాల బాట పట్టడంతో మధ్యాహ్నానికి నెగిటివ్ జోన్‌లోకి వెళ్లింది. బిఎస్ఇ సెన్సెక్స్ ఇంట్రాడేలో 33281.77-32963.31 పాయింట్ల మధ్య కదలాడి చివరికి 129.91 పాయింట్ల నష్టంతో 33006.27 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 40.50 పాయింట్ల నష్టంతో 10114.75 పాయింట్ల వద్ద క్లోజయింది. ఇన్వెస్టర్లు ప్రతీ ర్యాలీని అమ్మకాలకు అవకాశంగా మలుచుకుంటున్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు

వరుసగా బ్యాంకుల కుంభకోణాలు బయటపడుతూ



ఉండడం, కుంభకోణాలపై చార్జిషీట్లు దాఖలవుతూ ఉండడం ఆ రంగానికి చెందిన షేర్లను కుంగదీసింది. ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంక్, పిఎన్‌బి, కెనరా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, యస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు 2.62 శాతం మేరకు నష్టపోయాయి.

- నష్టపోయిన ఇతర షేర్లలో విప్రో, మహీంద్రా, మారుతి సుజుకీ, డాక్టర్ రెడ్డీస్, అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, బజాజ్ ఆటో, ఎల్ అండ్ టి, టిసిఎస్, కోల్ ఇండియా, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డిఎఫ్‌సి, పవర్ గ్రిడ్, హీరో మోటో కార్ప్, ఐటిసి, టాటా స్టీల్, హెచ్‌యుఎల్ ఉన్నాయి.
- ఒఎన్‌జిసి, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, ఆర్ఐఎల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, ఎన్‌టిపిసి ట్రెండ్‌కు ఎదురీది లాభాలతో ముగిశాయి.

డిహెచ్ఎఫ్ఎల్ రూ.300 కోట్ల సమీకరణ

గృహ నిర్మాణ రుణాలందించే దీవాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (డిహెచ్ఎఫ్ఎల్) నాన్ కన్వర్టిబుల్ బాండ్ల జారీ ద్వారా రూ.300 కోట్లు సమీకరించింది. ఒక్కోటి రూ.10 లక్షల విలువ గల మూడు వేలు ఎన్‌సిడిలు జారీ చేసినట్టు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజిలకు పంపిన సమాచారంలో తెలిపింది.

- మౌలిక వసతుల రంగానికి రుణాలందించే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఐఎఫ్ఐఎన్ ... ఎస్ఐఎస్ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజిలో 0.22 శాతం ఈక్విటీ షేర్లను 93.93 కోట్ల రూపాయలకు విక్రయించింది.
- అనుబంధ సంస్థ ప్రోమెథియాన్ హోల్డింగ్స్ యుకెలో 11.58 శాతం వాటాలను 450 కోట్ల రూపాయలకు ఎస్ఎస్‌జి క్యాపిటల్‌కు విక్రయించినట్టు రవాణా సొల్యూషన్ల సంస్థ కాక్స్ అండ్ కింగ్స్ ప్రకటించింది.

ఐఆర్‌బి ఇన్‌ఫ్రాకు రూ.3400 కోట్ల ఆర్డర్

మౌలిక వసతుల నిర్మాణ రంగంలోని ఐఆర్‌బి ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు జాతీయ రహదారుల సంస్థ నుంచి రూ.3,400 కోట్ల ఆర్డర్ లభించింది. దీని కింద ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్-మొరాదాబాద్ మధ్య 99.86 కిలోమీటర్ల నిడివి గల రోడ్డు నిర్మాణం చేపడుతుంది. దీంతో తమ చేతిలోని ఆర్డర్ల విలువ రూ.15,300 కోట్లకు చేరినట్టు కంపెనీ తెలిపింది.

శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ నిధుల సమీకరణ

శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ ప్రైవేటు ప్లేస్‌మెంట్ విధానంలో బాండ్ల జారీ ద్వారా రూ.1,830 కోట్లు సమీకరించింది. మెచ్యూరిటీ కాలపరిమితి, వడ్డీరేట్ల విషయంలో నాలుగు విభిన్నమైన ఆప్షన్లతో ఎన్‌సిడిలు జారీ చేసినట్టు ప్రకటించింది.

మిధాని ఇష్యూకు 64 శాతం సబ్‌స్క్రిప్షన్

న్యూఢిల్లీ : రక్షణ రంగానికి స్పెషాలిటీ ఖనిజాలు తయారుచేసి సరఫరా చేసే ప్రభుత్వ రంగ సంస్థ హైదరాబాద్‌కు చెందిన మిధాని పబ్లిక్ ఇష్యూ రెండో రోజు ముగిసే సమయానికి 64 శాతం సబ్‌స్క్రయిబ్ అయింది. రూ.438 కోట్ల సమీకరణ లక్ష్యంగా కంపెనీ ఇష్యూకు వచ్చింది. మొత్తం 4,87,08,400 వాటాలను విక్రయానికి పెట్టగా రెండో రోజున 3,10,74,150 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యుఐబిల విభాగం 1.09 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ కాగా నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల విభాగం ఒక శాతం ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయింది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో మాత్రం 31 శాతం సబ్‌స్క్రిప్షన్ మాత్రమే వచ్చింది.

దుబాయ్‌లో మెరాస్ 'బ్లూవాటర్స్'

» అపార్ట్‌మెంట్ల ప్రారంభ ధర రూ.3.5 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దుబాయ్‌కి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ మెరాస్ అక్కడి సముద్రంలో బ్లూవాటర్స్ పేరుతో భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టును నిర్మించింది. ఇందులో 698 బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్లు (1-4 బెడ్‌రూమ్స్), నాలుగు పెంట్ హౌజ్‌లు, 17 విల్లాలు ఉన్నాయి. అపార్ట్‌మెంట్ల ప్రారంభ ధర 3.5 కోట్ల రూపాయలుండగా.. పెంట్ హౌజ్ ధర 70 కోట్ల రూపాయల వరకు ఉందని మెరాస్ బ్లూవాటర్స్‌కు మార్కెటింగ్ భాగస్వామిగా ఉన్న రెయిన్ అండ్ హార్న్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ చిమ్మాని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహిస్తున్న సందర్భంగా గురువారంనాడిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. ముంబై, ఢిల్లీ





లోనూ రోడ్‌షోను నిర్వహిస్తామని, వీటి ద్వారా 100 బుకింగ్స్‌ను అంచనా వేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నుంచే 15 బుకింగ్స్ వస్తాయన్న అంచనాతో ఉన్నామన్నారు. రోడ్ షోలో భాగంగా అపార్ట్‌మెంట్‌ను బుక్ చేసుకున్న వాళ్లు మొదట అపార్ట్‌మెంట్ ధరలో 10 శాతం, అపార్ట్‌మెంట్‌ను హ్యాండోవర్ చేసినప్పుడు మరో 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని, మిగతా మొత్తం నాలుగేళ్లలో వడ్డీ లేకుండా వాయిదాల్లో చెల్లించే సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఉన్నతాదాయ వర్గాలు దుబాయ్‌లో అధికంగా ప్రాపర్టీలను కొనుగోలు చేస్తున్నారని, కొంత మంది పెట్టుబడుల కోసం మరికొంత మంది నివాసం కోసం కొనుగోళ్లు జరుపుతున్నారని ఆయన చెప్పారు. గత ఏడాదిలో భారత సంతతికి చెందిన వారు 7,000 ప్రాపర్టీలను కొనుగోలు చేశారని, వీటి విలువ 30,000 కోట్ల రూపాయలు ఉంటుందని ఆయన చెప్పారు. రెయిన్ అండ్ హార్న్‌కు బెంగళూరులో కార్యాలయం ఉందని, రానున్న కాలంలో హైదరాబాద్, ముంబై, రాజస్థాన్, గుజరాత్‌లో కార్యాలయాలను ప్రారంభించే యోచనలో ఉన్నట్టు సంజయ్ తెలిపారు.

కార్డు మోసాలకు చెక్

సరికొత్త సాఫ్ట్‌వేర్ టూల్‌ను తెచ్చిన అటామ్ టెక్

ముంబై : ఆన్‌లైన్ మోసాల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటిని నిరోధించడానికి దోహదపడే సరికొత్త సాఫ్ట్‌వేర్ టూల్‌ను పేమెంట్స్ సొల్యూషన్లు అందిస్తున్న అటామ్ టెక్నాలజీస్ అందుబాటులోకి తెచ్చింది. ఇ-షీల్డ్ పేరుతో తెచ్చిన ఈ సాఫ్ట్‌వేర్ టూల్ ఆధారంగా క్రెడిట్/డెబిట్ కార్డు కస్టమర్లు తమ కార్డును స్విచ్ ఆన్/ఆఫ్ చేసుకోవచ్చు. దీని ద్వారా కార్డుల వివరాలు తస్కరణకు గురికాకుండా, మోసపూరిత లావాదేవీలు జరగకుండా చూసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్లు ఉన్న వారు లేని వారు కూడా ఈ టూల్‌ను వినియోగించుకోవచ్చని, దీని ద్వారా బ్యాంకుల సెక్యూరిటీ వ్యయం కూడా తగ్గుతుందని అటామ్ టెక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ దేవాంగ్ నెరల్లా తెలిపారు. తమ కార్డును ఏయే చెల్లింపులకు అనుమతించాలి, వేటికి అనుమతించవద్దో కస్టమర్లు ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. స్మార్ట్‌ఫోన్ యాప్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సర్వీసులను వాయిస్, చాట్ ద్వారా యాక్టివేట్ చేసుకుని ఇ-షీల్డ్ సర్వీసులను పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, ఎటిఎంలు, పిఒఎస్ టెర్మినళ్లు లేదా విదేశీ లావాదేవీలు నిర్వహించే సందర్భాల్లో తమ కార్డును స్విచ్ ఆన్/ఆఫ్ చేయవచ్చని తెలిపారు. అన్ని బ్యాంకులకు ఈ సాఫ్ట్‌వేర్‌ను విక్రయించాలన్న లక్ష్యంతో ఉన్నామని ఆయన తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం.. 2017 సంవత్సరంలో 25,800 క్రెడిట్/డెబిట్ కార్డు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు జరిగాయి. వీటి ద్వారా కస్టమర్లకు 179 కోట్ల రూపాయల నష్టం వచ్చింది.



సువెన్‌కు 3 పేటెంట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కేంద్ర నాడీ మండల వ్యాధుల చికిత్సలో వినియోగించే న్యూ కెమికల్ ఎంటైటిస్ (ఎన్‌సిఇ)కు నార్వే, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి పేటెంట్లను అందుకున్నట్లు సువెన్ లైఫ్‌సైన్సెస్ వెల్లడించింది. ఈ పేటెంట్లు వరుసగా 2027, 2034, 2036 వరకు చెల్లుబాటులో ఉంటాయని తెలిపింది. అల్జీమర్స్, ఎడిహెచ్‌డి (అటెన్షన్ డెఫిసెంట్ హైపర్‌యాక్టివిటీ డిజార్డర్), హంటింగ్‌టన్స్, పార్కిన్‌సన్, స్క్రిజోఫీనియా వ్యాధి చికిత్సలో ఈ ఔషధాన్ని వినియోగిస్తారు.

సిఐఐ ఐడబ్ల్యుఎన్ చైర్‌పర్సన్‌గా శోభా దీక్షిత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యుఎన్) తెలంగాణ చైర్‌పర్సన్‌గా శోభా దీక్షిత్, వైస్ చైర్‌పర్సన్‌గా నందితా సేథి ఎన్నికయ్యారు. 2018-19 సంవత్సరానికి వీరు ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. శోభా దీక్షిత్ ప్రస్తుతం అల్పలా ఇండియా డైరెక్టర్‌గా వ్యవహరిస్తుండగా, నందితా సేథి.. జెన్ స్కిల్‌ప్రోక్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ అయిన ది అంత్రప్రెన్యూర్ జోన్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

బిగ్‌బజార్ స్టోర్లలో కొనుగోళ్లపై రుపే డిస్కౌంట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫ్యూచర్ గ్రూప్‌నకు చెందిన బిగ్‌బజార్, ఫుడ్ బజార్, ఇజోన్, ఎఫ్‌బిబిల్లో రుపే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోళ్లు చేస్తే 10 శాతం డిస్కౌంట్ లభించనుంది. మార్చి 23వ తేదీ నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు ఈ ఆఫర్ అమల్లో ఉంటుంది. డిస్కౌంట్‌ను పొందాలంటే కనీసం రూ.1,500 కొనుగోళ్లు చేయాల్సి ఉంటుంది. గరిష్ఠంగా రూ.250 డిస్కౌంట్‌ను మాత్రమే ఆఫర్ చేస్తున్నారు. రుపే కార్డు వినియోగదారులకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఫ్యూచర్ రిటైల్‌తో చేతులు కలిపామని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, బ్రాండింగ్) కునాల్ కలవటియా తెలిపారు. ఇదిలా ఉంటే.. మార్చి 23 నుంచి 25వ తేదీ వరకు ఫ్రీ షాపింగ్ వీకెండ్‌ను ఫ్యూచర్ రిటైల్ నిర్వహిస్తోంది. రూ.2,000అంతకు మించిన కొనుగోళ్లపై అంతేవిలువైన గిఫ్ట్ ఓచర్లు అందించనుంది.

వాటర్‌లైన్ డేటా సైన్స్‌లో ఇన్ఫోసిస్ పెట్టుబడి


న్యూఢిల్లీ: డేటా డిస్కవరీ, డేటా గవర్నెన్స్ సాఫ్ట్‌వేర్ సర్వీసులు అందిస్తున్న వాటర్‌లైన్ డేటా సైన్స్‌లో ఇన్ఫోసిస్ మరో 1.5 మిలియన్ డాలర్ల (9.77 కోట్ల రూపాయలు) పెట్టుబడి పెట్టింది. ఇంతకు ముందు ఈ కంపెనీలో 40 లక్షల డాలర్ల పెట్టుబడి పెట్టినట్టు ఇన్ఫోసిస్ తెలిపింది.

బులియన్




బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,540	31,480	31,610	31,350	30,690
క్రితం ముగింపు	31,310	---	31,440	31,160	30,440
22 క్యారెట్లు	29,210	29,200	29,080	29,070	29,230
క్రితం ముగింపు	28,990	---	28,920	28,940	28,990
వెండి (కిలో)	39,500	39,800	39,500	39,600	41,600
క్రితం ముగింపు	39,000	---	39,400	39,100	41,100

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.75 — నెక్ (100 గుడ్లు)




హైదరాబాద్	315.00	చిత్తూరు	363.00
వరంగల్	317.00	చెన్నై	370.00
విజయవాడ	315.00	నమక్కల్	360.00
గోదావరి	315.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	325.00	ముంబై	355.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	62.00	విజయవాడ	63.00
కరీంనగర్	63.00	గుంటూరు	63.00
వరంగల్	62.00	ఒంగోలు	65.00
మహబూబ్‌నగర్	62.00	చిత్తూరు	71.00
కర్నూలు	62.00	నెల్లూరు	71.00
విశాఖపట్నం	67.00	అనంతపురం	66.00
గోదావరి	63.00		

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.26	68.72
పౌండ్	83.90	97.30
యూరో	73.22	84.92
ఆస్ట్రేలియా డాలర్	45.87	53.08
బహ్రెయిన్ దినార్	160.49	183.92
కువైట్ దినార్	179.56	223.53
ఒమని రియాల్	157.16	179.80
సౌదీ రియాల్	15.76	18.67
సింగపూర్ డాలర్	45.14	53.47
యుఎఇ దిరమ్	16.13	18.85

టెక్ వ్యూ — కీలక మద్దతు స్థాయిలో...

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై 10200 వరకు వెళ్లినా ఇంట్రాడే బలహీనతలో పడి రోజంతా అదే ధోరణిలో ట్రేడవుతూ 40 పాయింట్ల నష్టంతో డే కనిష్ఠ స్థాయిలో క్లోజయింది. కొద్ది రోజుల కన్సాలిడేషన్ అనంతరం గరిష్ఠ నిరోధ స్థాయిల్లో నిలదొక్కుకోలేకపోగా మరోసారి కీలక మద్దతు స్థాయికి చేరువయింది. 200 డిఎంఏ వద్ద కూడా పరీక్ష ఎదుర్కొనబోతోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం బౌన్స్‌బ్యాక్ తప్పనిసరి.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10240 మద్దతు : 10100

- ప్రధాన మద్దతు స్థాయి 10100. కొద్ది నెలల్లో ఏర్పాటైన ప్రధాన మద్దతు, ప్రధాన కనిష్ఠ స్థాయి ఇది. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 9950.
- రికవరీ బాట పడితే ప్రధాన నిరోధం 10240 కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం 10300.
- బ్యాంక్ నిఫ్టీ మరోసారి కీలక మద్దతు స్థాయి 24000కి చేరువవుతోంది. తక్షణ అప్‌ట్రెండ్ ఆశల కోసం రికవరీ సాధించి తీరాలి.

■ వి.సుందర్ రాజా

ఆస్ట్రో వ్యూ — ముగింపు సెషన్ మెరుగు

తిథి : చైత్ర శుద్ధ షష్ఠి **నక్షత్రం:** రోహిణి

పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, మిథున, తుల రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10114.75 (-40.50)

ట్రెండ్ మార్పు వేళలు : ఉదయం 11.14 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి మెరుగ్గా ప్రారంభమై 11 గంటల వరకు అదే ధోరణిలో ఉండి తదుపరి 2.15 గంటల వరకు నిస్తేజంగా ట్రేడయి ఆ తర్వాత చివరి వరకు మెరుగ్గా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 11.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10155, 10190

మద్దతు స్థాయిలు : 10075, 10080

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 3.4(3.57)650
ADITYA SPIN. 9.13(8.7)210
AGRO TECH FO 647.95(654.9)283
AISHWARYA TE 5.41(5.51)1795
ALPHAGEO (I) 744.1(743.7)2318
ALU FLUORIDE 104.8(105.5)12269
AMAR RAJA BA 779.4(790.95)14119
ANDHRA BANK 42(43.05)407810
ANDHRA CEMEN 9.67(10)44435
ANDHRA PETRO 54(56.8)275661
ANJANI PORTL 177.05(182.45)1150
ASTRA MICRO 80.45(81.65)35688
AUROB.PHARMA 556.95(562.65)79170
AVANTEL LTD 525.9(539.95)6565
AVANTI FEEDS 2246.3(2269.85)8179
B.N.RATHI SE 38.2(39.5)30415
BALAJI AMINE 572.4(584.45)4613
BAMBINO AGRO 221.05(227.9)2836
BARTRONICSIN 10.56(11.11)16845
BHAGIRA.CHEM 299(286.4)4
BHAGYA INL 44.85(45.6)30437
BHARATFIN 1090.8(1078.85)25454
BNR UDYOG 26.8(25.75)141
CAMBRIDGE 66.2(67.45)2171
CCHHL 11.95(12.15)42241
CCL PRODUCTS 275.9(287.95)5316
CELESTIAL 14.65(14.9)12132
CIL SECURITS 26.55(27.85)1300
COROM INTER 519.85(524.3)10009
CUBEX TUBING 21.4(21)5090
CYBERMATE 2.66(2.88)80983
CYIENT 658.95(651.8)56239
DANLAW TECH. 74.85(71.55)6202
DECAN CEMENT 517.25(532)21
DHAN ROTO SP 44.5(46.8)3096
DIAMONPOWER 9.52(10.23)61333
DIVI'S LAB. 1069.05(1086.8)19587
DIVYA.GRANIT 98.3(95.15)1
DQ ENT 12.25(12.77)14701
DR.REDDY'S 2107.7(2141.9)40791
EMPEE SUGARS 2.89(2.89)5710
EVEREST ORG. 116.85(122.6)1099
FACOR ALLOYS 2.4(2.42)266853
FIRSTOBJ 14.75(15.2)26855
GATI LTD. 99.8(101.1)57150
GAYATRI BIO 6.62(6.32)182
GAYATRI PROJ 187.45(189.3)12728
GENNEX LAB 3.87(3.82)79550
GMR INFRASTR 17.5(17.9)2666570
GODAVARI DRU 32.05(33.85)416
GOLDST INFRA 186.2(183.05)96452
GOLDSTONE EN 12.57(13.15)7592
GRANULES (I) 104.6(107.3)113354
GVK POWERINF 14(14.7)1108885
HBL P SYS 46.65(47.75)72174
HERITGFOOD 727.75(725.75)8825
HIND.FLUROCA 9.61(9.16)300
I.C.S.A. IND 2.81(2.95)152442
IKF TECHNO .57(.58)53606
INCAP LTD. 82.8(87.15)1580
IPAPPM 291.1(294.9)4873
IVRCL LTD 3.55(3.57)88890
KAKATIYA CEM 243.35(250.5)6813
KALLAM SPG. 30.65(31.5)193148
KARAN WOO-SN 1.91(1.91)2300
KAVERI SEED 484.25(475.3)21513
KCP LTD 113.25(114.5)12990
KERNEX MICRO 39.45(41.5)3448
KNR CONST 291.2(296.35)6650
KREBS BIOCHM 167(167.45)1001
LANCO INFRA 1.12(1.17)501533
LOKESH MACH 52.6(55.55)13181
LOTUS CHOC 48.9(49.5)777
MADHUCON PRJ 21.35(22.25)19932
MOLD-TEK TEC 50.55(52.05)51712
MOSCHIP SEMI 33.15(34)46271
MSR INDIA 41.55(41.55)4886
N C L IND. 222.75(222.8)14303
NACLIND 41.55(41.65)21776
NATCO PHARM 781.85(781.4)28084
NCC 118.9(121.05)282153
NEHA INTER. 6.4(6.5)29607
NETTLINX LTD 79.4(71.75)24708
NEULAND LAB. 709.9(717.3)4490
NIHAR INFO 14.5(14.1)2355
NILE LTD. 710.65(710.85)16599
NTL 3.42(3.6)6820
OIL COUNTRY 33.8(36.3)267689
PADMALAYA TE 3.29(3.27)13532
PALRED 68.25(71.4)2602
PANYAM CEMEN 41(41.65)59764
PENNAR STEEL 53.45(53.85)48638
PFL INFOTECH 7.73(8.13)1801
PHYTOCHEM I. 62.3(63.55)2490
PITTI LAMIN. 82.65(84.85)13190
POKARNA LTD 198.45(194.05)3541
PRAJAY ENGS. 12.01(12.16)13719
PREMIER EXPL 336.65(344.75)6004
PRISM CEMENT 114.3(115.4)81190
RAIN 380.65(387.95)211029
RAJ PACKAGIN 36(37.25)2666
RAJVIR IND 39.2(41.15)200
REG.CERAMIC 5.25(5.05)1
RESTILE CER. 7.1(7.15)445
SAGAR CEM. 883.9(896)318
SAMKRG PIST. 279.05(282.7)3495
SAMPRE NUTRI 50(48.6)714
SANGHI IND. 114.8(113.85)30353
SATVAH.ISPAT 19.5(19.65)38536
SMPL 1.05(1.1)30624
SMS PHARMACE 75.95(76.15)15343
SREE RAYALA 149.9(153.1)1721
STEEL EXCH 26(26.15)21330
SUJANA INDUS .74(.77)82060
SURANATP 4.76(4.85)26569
SURYACHAKRA .87(.89)42028
SURYAMBA SP 68.15(68.2)661
SURYAVA SPIN 6.26(6.58)800
SURYLAK.COTT 67.2(69.6)17556
SUVEN LIFE S 169.95(169.2)47501
TAJ GVK HOTL 158.85(160.4)8208
TANLA 33(33.2)180808
TRANSCORP IN 30.6(32)3528
TRANSGENE BI 2.19(2.1)13210
TRANSPORT CO 264.4(262.35)1033
USHER AGRO 4.46(4.53)7001
VICEROY HOTE 14.7(14.95)60362
VIJAY TEXTIL 41.5(42)1938
VIMTA LABS 190.4(191.95)2002
VIRAT CRANE 55.05(56.25)2278
VIRINCHI 102.2(104.4)53429
VISAKA IND. 666.25(674.75)2088
VISTA PHARMA 39(39.95)27846
VIVIMED LABS 76.7(76.6)85613
VST INDUS. 2952(2926.3)36
WATERBASE 268.35(271.4)163413
XLENERGY 2.12(2.23)25802
YBRANTDIGI 4.62(4.82)345794
ZEN TECH 116.4(118.85)19416
ZENOTECH 40(40.5)6335

ఆధార్.. సూపర్ కార్డ్

సుప్రీంలో ఆధార్ సీఈవో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్



న్యూఢిల్లీ, మార్చి 22: ఆధార్ డేటా అత్యంత భద్రమని, దాన్ని ఎవరూ తీసుకోలేరని విశిష్ట సంఖ్య ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) సీఈవో అజయ్ భూషణ్ పాండే సుప్రీం కోర్టుకు స్పష్టం చేశారు. జాతి భద్రతకు సంబంధించిన అంశాలైతే తప్ప ఎవరి గురించీ ఎకాఎకిన తెలుసుకోవడం వీలుపడదని, హ్యాక్ కూడా కాదని తెలియజేశారు. "ఈ డేటాకు 2048-బిట్ ఎన్‌క్రిప్షన్ కోడ్ ఉంటుంది. దానిని ఛేదించడం ఎవరి తరమూ కాదు. సూపర్ కంప్యూటర్ వల్ల కూడా వెంటనే సాధ్యం కాదు. ప్రయత్నిస్తే 1300 కోట్ల ఏళ్ల తర్వాత ఆ కోడ్‌ను ఛేదించవచ్చేమో. డేటా ఒకసారి ఆధార్ సెంట్రల్ డేటాబేస్‌కు చేరిన తర్వాత మరి అది ఎవరికీ అందుబాటులోకి రాదు" అని స్పష్టం చేశారు. ఆధార్ కార్డు అవసరం, ప్రాముఖ్యత గురించి గురువారం సుప్రీంకోర్టులో ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఎదుట ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "అనేక అవసరాల నిమిత్తం ఆధార్ కార్డు అవసరం. "దీనిని పకడ్బందీగా రూపొందించారు. జీవితకాలం వాడవచ్చు. జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో వెరిఫై చేయగలిగే గుర్తింపు కార్డు ఇది. ఓటరు, రేషన్ కార్డులకు పరిమితులున్నాయి. ఓటరు కార్డును చిన్నపిల్లలకు జారీ చేయలేం. రేషన్ కార్డులు ఒక ప్రాంతానికే పనికొస్తాయి. అన్ని ప్రాంతాలకూ పనికొచ్చేలా ఈ కార్డు తెచ్చాం" అని వివరించారు.

కనీస నిల్వ లేకుండా కార్డు గీకితే బాదుడే!

న్యూఢిల్లీ, మార్చి 22: ఏటీఎంకు వెళ్లి డబ్బులేం తీసుకుంటాం.. షాపుకెళ్లి డెబిట్‌కార్డు గీకేద్దాం అనుకుంటున్నారా! అయితే జాగ్రత్త.. మీ ఖాతాలో కనీస నిల్వ ఉందో లేదో చెక్ చేసుకొని కార్డు స్వైప్ చేయండి! లేదంటే బ్యాంకులు 'లావాదేవీల తిరస్కరణ' చార్జీలు కూడా వసూలు చేస్తున్నాయ్! ఓ వైపు నగదు వినియోగాన్ని తగ్గించి డెబిట్ కార్డుల వాడకాన్ని పెంచమని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా.. మరోవైపు బ్యాంకులు ఖాతాదారుల నుంచి అకారణంగా చార్జీలు వసూలు చేస్తున్నాయి! ఖాతాలో కనీస నిల్వ లేనప్పుడు డెబిట్ కార్డుతో లావాదేవీ నిర్వహించడానికి ప్రయత్నిస్తే బ్యాంకు దాన్ని తిరస్కరిస్తుంది (డిక్లైన్ చేస్తుంది). డెబిట్ కార్డు స్వైప్ చేసినప్పుడు లావాదేవీ తిరస్కరణకు గురైన ప్రతిసారీ బ్యాంకులు రూ.17-25 వరకు వసూలు చేస్తున్నాయి. దీనికి జీఎస్టీ అదనం! ఏటీఎం, పీవోఎస్ యంత్రాల్లో ఇలా డిక్లైన్ అయిన ప్రతి లావాదేవీకి ఎస్బీఐ రూ.17, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు రూ.25 చొప్పున చార్జీలు వేస్తున్నాయి. ఇలాంటి చార్జీలు ఎందుకు వసూలు చేస్తున్నారో కూడా తెలియడం లేదని, ఇది డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహించాలన్న ప్రభుత్వ ఆకాంక్షకు విరుద్ధమని బొంబాయి ఐఐటీ ప్రొఫెసర్ ఆశిష్ దాస్ పేర్కొన్నారు. బ్యాంకు చార్జీలపై గతంలో ఆయన అనేక పరిశోధనా నివేదికలు అందజేశారు. కనీస నిల్వలు లేకుండా డెబిట్ కార్డును స్వైప్ చేయడం వల్ల బ్యాంకులపై ఎలాంటి చార్జీలు పడవని, అయినా వినియోగదారుల నుంచి ఎందుకు వసూలు చేస్తున్నారో తెలియడం లేదని దాస్ అన్నారు. ఒకవేళ కార్డుల దుర్వినియోగాన్ని అడ్డుకొనేందుకే అని బ్యాంకులు చెబితే.. కనీసం రెండు లావాదేవీల వరకైనా చార్జీలు విధించకూడదని సూచించారు.

భారత్ బ్రహ్మోస్త్రం

» బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

» కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించడంలో దిట్ట

న్యూఢిల్లీ/పోఖ్రాన్, మార్చి 22: ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను విజయవంతంగా పరీక్షించారు. స్వదేశీ పరిజ్ఞానం జోడించి రష్యా సహకారంతో డీఆర్‌డీవో తయారు చేసిన ఈ క్షిపణిని రాజస్థాన్‌లోని పోఖ్రాన్ అణు క్షిపణి పరీక్ష కేంద్రం నుంచి గురువారం ఉదయం 8.42 నిమిషాలకు ప్రయోగించామని, అది కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించిందని రక్షణ మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. ఇది దేశ రక్షణ వ్యవస్థను మరింత బలపరుస్తుందని వెల్లడించారు. బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయంలో పాలుపంచుకున్న వారందరినీ అభినందించారు.

బ్రహ్మోస్ విశేషాలు:

- అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి.
- భారత్‌లోని బ్రహ్మపుత్ర, రష్యాలోని మాస్కోవా నదుల పేరు మీదే బ్రహ్మోస్ పేరు ఏర్పడింది.
- భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్‌పీవో మషినోస్ట్రోయేనియా ఉమ్మడి ప్రాజెక్టు ఇది.
- బ్రహ్మోస్ 2006 నుంచి నేవీ, ఆర్మీకి సేవలందిస్తోంది.
- గతంలో ఇది2.8 మాక్ వేగంతో ప్రయాణించేది. ప్రస్తుతం దీని వేగాన్ని 5.0మాక్(6125.220కిలోమీటర్/గంట)కు పెంచారు.(1మాక్=1225.044 కిలోమీటర్/గంట)
- భూమిపై నుంచి, గాలిలో, నీటిపై నుంచి ప్రయోగించవచ్చు.
- దీని వార్‌హెడ్ బరువు 200 నుంచి 300 కిలోల బరువు ఉంటుంది.



విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదిస్తున్న బ్రహ్మోస్ క్షిపణి

తప్పులు చేశాం.. వెరీ సారీ!

ముమ్ముందు జరక్కుండా చూస్తాం: మార్క్ జుకర్‌బర్గ్



వాషింగ్టన్, మార్చి 22: డేటా ఉల్లంఘన కుంభకోణంపై ప్రపంచానికి ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారు. తమ మాధ్యమంలో వినియోగదారుల వివరాలకు పకడ్బందీగా రక్షణ కల్పించడంలో విఫలమయ్యామని ఆయన న్యూయార్క్ టైమ్స్‌కు, సీఎన్‌ఎన్ ఇంటర్వ్యూల్లో ఒప్పుకున్నారు. ఈ కుంభకోణం గత 5 రోజులుగా ప్రపంచాన్ని కదిపి కుదిపేస్తున్నప్పటికీ మౌనం దాల్చిన ఆయన ఎట్టకేలకు పెదవి విప్పారు. వివిధ దేశాలు ఆయనకు సమన్లు పంపడంతో ఆయన తన వాదన వినిపించక తప్పలేదు. అమెరికా, ఫ్రాన్స్ లాంటి అగ్రరాజ్యాల ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయడానికి కొన్ని దేశాలు, సంస్థలు ఫేస్‌బుక్‌ను వాడుకోడానికి ప్రయత్నించిన మాట వాస్తవమని తొలిసారిగా జుకర్‌బర్గ్ వెల్లడించారు. అయితే ఆ ప్రయత్నాలను తాము అడ్డుకున్నామని చెప్పిన ఆయన త్వరలో భారత్‌లో జరగబోయే ఎన్నికల్లో ఇలాంటివి చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తలదూరిస్తే జుకర్‌బర్గ్‌ను భారత్‌కు రప్పించి విచారణ జరుపుతామని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించిన నేపథ్యంలో ఆయన మాటలనడం విశేషం.

ఇంటర్వ్యూ వివరాలివీ:

అసలేం జరిగింది? తప్పెక్కడ జరిగింది?

ఇది మాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఉల్లంఘించడమే.. ఒప్పుకుంటాను. దీనికి క్షమాపణలు చెబుతున్నాను. ప్రజల వివరాలను కాపాడాల్సిన మౌలిక బాధ్యత మాపై ఉంది. ఇప్పుడు మా బాధ్యతేంటంటే మళ్లీ ఇలాంటివి జరక్కుండా చూడడం. ఇందుకోసం కొన్ని ప్రాథమిక అంశాలు మేం చేయాల్సి ఉందని భావిస్తున్నాను. అందులో ఒకటేంటంటే అలెగ్జాండర్ కోగన్ లాంటి వ్యక్తులకు భారీగా సమాచారం చేరకుండా నిరోధించడం. కోట్లాది మంది డేటాను మా నుంచి తీసుకొని దుర్వినియోగం చేశారాయన. కేంబ్రిడ్జ్ అనలిటికా లాంటివి పుట్టుకురాకుండా చూడాలి. పెద్ద ఎత్తున డేటాను మా ప్లాట్‌ఫాం నుంచి పొంది ఉన్న యాప్‌ల కార్యకలాపాలపై దర్యాప్తు చేయాలి. కేంబ్రిడ్జ్ అనలిటికా గురించి తెలిసినపుడే దీనిని చేసి ఉండాల్సింది.

కేంబ్రిడ్జ్ అనలిటికాపై చర్యలు తీసుకుంటారా?

అసలేం జరిగిందో మేం మొదట అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం మనకి మీడియా ద్వారా మాత్రమే కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ 5 కోట్ల మంది డేటాను చట్టవిరుద్ధంగా పొంది దాన్ని ఇతరత్రా పనులకు వాడుకుంది అన్నది తెలుసు. మేం మా ఆడిట్‌ను మొదట చేసి ఇప్పటికీ కేంబ్రిడ్జ్ అనలిటికా సంస్థ ఫేస్‌బుక్ డేటాను యాక్సెస్ చేయగలుగుతోందన్న విషయాన్ని ధ్రువపర్చుకుంటేనే చట్టపరమైన చర్యలు తీసుకోగలం.

మీరు సకాలంలో సరైన చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు.. దీనికి మీరేమంటారు?

అవును.. మేం ముందే తగిన చర్యలు తీసుకొని ఉండాల్సింది. బహుశా మేం చేసిన అతి పెద్ద తప్పిదం అదేనేమో! డేటా పోర్టబిలిటీకు సమ్మతిస్తూనే మన డేటాను లాక్ చేసి పరిరక్షించుకోవడం అనేది చేయాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాం.

మీరు చెబుతున్న బిజినెస్ మోడల్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారా?

ఫేస్‌బుక్‌పై పెద్ద అపవాదేంటంటే.. మేం డేటాను అమ్ముకుంటామన్నది. మేం ఎవరికీ ఏ డేటానూ విక్రయించం. వ్యక్తిగత వివరాలను, గోప్యతను పరిరక్షిస్తూనే పోటీ ప్రపంచం గనుక మేం అందజేసే సేవలను ఉపయోగించుకొని పరిశోధనల కోసమో లేక వాణిజ్య ప్రకటనల్లో ఉండే ఉత్పత్తుల మంచీ చెడుల గురించో ఇలా ఒకదానికి షేరింగ్‌కి వీలు కల్పిస్తాం.

ఎన్నికల ప్రక్రియలో ఫేస్‌బుక్ తలదూర్చినట్లు వచ్చిన ఆరోపణలపై ఏమంటారు?

2017లో ఫ్రెంచ్ ఎన్నికల సమయంలో నకిలీ అకౌంట్లను గుర్తించడానికి ఏఐ ఉపకరణాలను మేం వాడాం. 2016 తర్వాత ఏఐ ఉపకరణాలతో 30వేల నకిలీ అకౌంట్లను గుర్తించాం. అందులో మెజారిటీ అకౌంట్లు రష్యా నుంచి వచ్చినవే. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఉపయోగించిన యుక్తులనే వారు ఆ మరుసటి ఏడాదీ వాడేందుకు యత్నించారు. వాటిని తొలగించాం. ఈ ఏడాది అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగబోతున్నాయి. భారత్‌లోనూ ఎన్నికలు జరగబోతున్నాయి. అన్ని ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసే శక్తులు పెచ్చరిల్లకుండా చూస్తాం.

అమెరికా మధ్యంతర ఎన్నికలను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వినిపిస్తోంది!

అవును... రష్యా ఆ పని చేస్తుంది. అందుకే సెక్యూరిటీ, కంటెంట్ రివ్యూ (సమాచార భద్రత- పర్యవేక్షణ) నిమిత్తం ప్రస్తుతం పనిచేస్తున్న 15వేల మందికి తోడు మరో ఐదువేల మందిని తీసుకోబోతున్నాం.

అమెరికా, బ్రిటన్ మిమ్మల్ని విచారించాలని కోరుకుంటున్నాయి. కాంగ్రెస్ ఎదుట హాజరవుతారా?

అలా హాజరవడమే కరెక్టని అంతా భావిస్తే సంతోషంగా హాజరవుతా. నిజానికి చాలా విషయాల్లో ఫేస్‌బుక్ తరచూ కాంగ్రెస్ ఎదుట హాజరవుతూ వాంగ్మూలం ఇస్తోంది.



సరిహద్దుల్లోకి ఎర్రదండు!

» పీఎల్ఏలో బోర్డర్ ఫోర్స్ విలీనం

» భారత్‌ను నేరుగా ఢీకొనే వ్యూహం

» చైనాలో సైనికీకరణ క్రమం వేగవంతం

బీజింగ్, మార్చి 22: చైనాలో సైనికీకరణ ప్రక్రియ వేగవంతం అయింది. 'రక్తపాతం సృష్టిస్తాం. కానీ, అంగుళం భూమిని వదిలిపెట్టం' అన్న అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ హెచ్చరికల నేపథ్యంలో, భారత్‌తో పంచుకొంటున్న సరిహద్దుల్లోని తన శ్రేణులను ఆ దేశం శక్తివంతం చేసింది. తన బోర్డర్ ఫోర్స్‌ను అత్యున్నత సైనిక వ్యవస్థ అయిన పీఎల్ఏ (పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ)లో కలిపేసింది. డోక్లాం వివాదంతో భారత్-చైనా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు డ్రాగన్ దేశం తీసుకొన్న తాజా నిర్ణయం మరింత ఆజ్యం పోయడం ఖాయమని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్‌ను నేరుగా ఎదుర్కొనే దిశగా చైనా అడుగులు పడుతున్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా చైనాలో బోర్డర్ ఫోర్సు ప్రభుత్వం ఆధీనంలో ఉంది. పౌర సాయుధ పోలీసు విభాగాల్లో ఒకటిగా కొనసాగింది. తాజా నిర్ణయంతో ఈ విభాగం పూర్తిగా రద్దయింది. ఈ బలగాలను పీఎల్ఏలో కలిపేశారు. ఇకపై పీఎల్ఏ శ్రేణులే సరిహద్దుల్లో కాపలా కాయనున్నాయని చైనా అధికార వార్తా సంస్థలు ఒక కథనం ప్రచురించాయి. చైనాలో ప్రభుత్వం కన్నా పార్టీ అత్యంత శక్తివంతమైంది. మిలిటరీ దాడులు, సైనిక చర్య, యుద్ధం తదితర కీలక సైనిక నిర్ణయాలను పార్టీ నాయకత్వమే తీసుకొంటుంది. కాగా, భారత్- చైనా దేశాల మధ్య ఘర్షణతో కూడిన ఐక్యత కొనసాగుతోందని ఐరాసలో భారత దౌత్యవేత్త సయ్యద్ అక్బరుద్దీన్ పేర్కొన్నారు.

శాంతి కోసం భద్రతను బలిపెట్టం: రాష్ట్రపతి

"శాంతి సాధనకు భారత్ కట్టుబడి ఉంటుంది. కానీ, దేశ సరిహద్దుల విషయంలో రాజీ పడేది లేదు. శక్తినంతా ఉపయోగించి సరిహద్దులను కాపాడుకొంటాం" అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ స్పష్టం చేశారు. లుధియానా సమీప హల్వారా ప్రాంతంలో భారత వైమానిక దళ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



సీసీ కెమెరాలు ఆపేశారు!

జయ వార్డులో ఆమె ఒక్కరే పేషంట్.. ఇతరుల్ని వేరే వార్డులకు తరలించారు

అపోలో చైర్మన్ ప్రతాపరెడ్డి వెల్లడి.. జయ హనుమాన్ సీరియల్ చూశారు

ఆమే రిమోట్ స్విచాఫ్ చేశారు.. కాఫీ తీసుకోబోతూ కన్నుమూశారు

జైలు బెంగతోనే జయ ఆరోగ్యం పాడైంది.. గవర్నర్, మంత్రులతో మాట్లాడింది.. అందుకు సాక్ష్యాలున్నాయి: శశికళ

చెన్నై, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, తమిళనాడు మాజీ సీఎం జయలలిత తమ ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు ఐసీయూలో సీసీ కెమెరాలను స్విచ్‌ఆఫ్ చేశారని అపోలో గ్రూప్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జయలలిత ఆసుపత్రిలో చేరిన రోజు నుంచీ మరణించే వరకు 75 రోజుల పాటు మొత్తం ఐసీయూను స్వాధీనం చేసుకొన్నారని తెలిపారు. అందులోని రోగులను ఇతర ఐసీయూలకు తరలించారని, మొత్తం 24 బెడ్‌లు ఉండే ఐసీయూలో జయ ఒక్కరే ఉన్నారని వివరించారు. ఆమెను చూడటానికి ఎవర్నీ లోపలికి అనుమతించలేదని చెప్పారు. ఆమెను ఎవరూ చూడకూడదనే సీసీటీవీలు తొలగించినట్లు తెలిపారు. గురువారం చెన్నైలో జరిగిన ఒక వైద్య సదస్సు సందర్భంగా విలేకరులకు ఆయన సమాధానం ఇచ్చారు. జయలలితకు అంతర్జాతీయ స్థాయిలో వైద్య చికిత్సలందించామని, ఆసత్రిలో చేరినప్పటి నుంచి మృతి చెందే వరకు అందించిన చికిత్సల వివరాలను జస్టిస్ ఆర్ముగస్వామి కమిటీకి సమర్పించామన్నారు. జయలలిత ఆస్పత్రిలో ఉన్నపుడు బాగానే ఉన్నారని, గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావుకు చేయి ఊపారని, ఇతర మంత్రులతోనూ, కావేరీ జల వివాదంపై అధికారులతోనూ మాట్లాడారని, తన దగ్గర వాటికి సంబంధించి సాక్ష్యాలున్నాయని శశికళ... ఇటీవల జస్టిస్ ఎ.ఆర్ముగస్వామి కమిషన్‌కు సమర్పించిన ప్రమాణపత్రంలో పేర్కొన్నారు. ప్రమాణపత్రం మీడియాకు లీక్ కావడంతో అందులోని అంశాలపై విలేకరులు ప్రతాపరెడ్డిని ప్రశ్నించారు. సీసీటీవీ ఫుటేజీ ఉందా? అని అడగ్గా, కెమెరాలను స్విచ్ ఆఫ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. జయ అపస్మారక స్థితిలో, ఆందోళనకర పరిస్థితిలోనే ఆస్పత్రిలో చేరారని, చికిత్సలందించిన తర్వాత ఆమె బాగా కోలుకున్నారని వివరించారు. డిశ్చార్జ్ అవుతారనుకున్న సమయంలో ఆకస్మికంగా గుండెపోటు రావటంతో మృతి చెందారన్నారు. జయ చికిత్స పొందుతుండగా ఎంతమంది చూశారన్న వివరాలు తమ వద్ద లేవని ప్రతాప్ సి.రెడ్డి చెప్పారు. జయ ఆఖరి క్షణం వరకూ ప్రాణాలతో పోరాడారని శశికళ... జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మరణించే ముందు రోజు... డిసెంబర్ 4 సాయంత్రం 4.20 గంటలకు బెడ్డుపై లేచి కూర్చున్నారని తెలిపారు. టీవీలో 'జై వీరహనుమాన్' సీరియల్ కూడా చూశారని, ఆ సీరియల్ ముగిశాక ఆమే స్వయంగా రిమోట్‌తో టీవీని ఆఫ్ చేశారని, ఆ సమయంలో ఒక మహిళా డాక్టరు, నర్సు తనతో పాటే గదిలో ఉన్నారని వివరించారు. జయ మరణంపై ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, సీఎం పళనిస్వామిని కూడా విచారించాలని శశికళ తరపు న్యాయవాదులు విచారణ సంఘాన్ని కోరినట్టు తెలిసింది. అక్రమాస్తుల కేసుతో జయలలిత తీవ్రఒత్తిడికి గురయ్యారని, ఆ ఒత్తిడి వల్లే తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారని శశికళ ప్రమాణ పత్రాల్లో వెల్లడించారు. అక్రమాస్తుల కేసులో 2014లో కోర్టు జైలు శిక్ష విధించినప్పటి నుంచే జయ మనస్తాపానికి గురయ్యారని, ఆ దిగులుతోనే ఆమెకు అనారోగ్యం ఏర్పడిందని శశికళ ఆ పత్రాల్లో పేర్కొన్నారు. 2016 సెప్టెంబరు 22 రాత్రి 9.30 గంటలకు బాత్‌రూంలో స్పృహతప్పి పడిపోవడంతో ఇద్దరు భద్రతాధికారును, డ్రైవర్‌ను పిలిచి ఆమెకు సపర్యలు చేశామని తెలిపారు. అపోలో ఆస్పత్రికి చేర్చినపుడు కూడా ఆమె స్పృహలోనే ఉండి 'ఎక్కడికి' అని అడగ్గా 'ఆస్పత్రి'కి అని తెలిపినట్టు పేర్కొన్నారు. జయ అనుమతితోనే ఆస్పత్రిలో వీడియోలు తీశానని, వాటిని కూడా విచారణ కమిషన్‌కు సమర్పిస్తున్నట్లు తెలిపారు.



కరణ్ థాపర్‌కు జీకే రెడ్డి అవార్డు ప్రదానం

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జర్నలిస్టు కరణ్ థాపర్... జీకే రెడ్డి స్మారక అవార్డును అందుకున్నారు. కాంగ్రెస్ ఎంపీ టీ సుబ్బిరామిరెడ్డి స్థాపించిన ఈ అవార్డు ఏటా జర్నలిజం రంగంలో విశేష కృషి చేసిన వారికి అందజేస్తారు. గురువారం ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ అవార్డును అందజేశారు. అవార్డు కమిటీ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రులు కరణ్ సింగ్, ఆనంద్ శర్మ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కురియన్, ఎంపీ కేవీపీ రామచంద్ర రావు, వివిధ దేశాల రాయబారులు పాల్గొన్నారు.

ఇస్రో కోసం ప్రత్యేక పెన్‌డ్రైవ్

» ఒకే ఒక సిస్టమ్‌లో పనిచేస్తుంది

» వేరే సిస్టమ్‌లో పెడితే పాడైపోతుంది

» తమిళనాడు కుర్రాళ్ల ఆవిష్కరణ: జావడేకర్

న్యూఢిల్లీ, మార్చి 22: దేశ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో కోసం.. డేటా చోరీ సాధ్యంకాని ప్రత్యేకమైన సురక్షిత పెన్‌డ్రైవ్‌ను తమిళనాడు విద్యార్థులు రూపొందించినట్టు కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. ఆ పెన్‌డ్రైవ్ ఒక్క కంప్యూటర్‌లో మాత్రమే పనిచేస్తుందని.. వేరే కంప్యూటర్‌కు కనెక్ట్ చేస్తే దానంతటదే పాడైపోతుందని వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'లో ఆ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ హ్యాకథాన్‌లో భాగంగా.. 27 కేంద్ర ప్రభుత్వ విభాగాలు, 17 రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన 900 సమస్యల నుంచి 408 సమస్యలను ఎంపిక చేసి విద్యార్థులకు ఇచ్చామన్నారు. వీటిని పరిష్కరించేందుకు దేశ నలుమూలల నుంచి 17,400 టీములు ముందుకు రాగా.. 1296 ఎంట్రీలను గ్రాండ్‌ఫైనల్‌కు ఎంపిక చేసినట్టు మంత్రి వెల్లడించారు.

ఎమ్మెల్సీ వైవీబీకి సీఎం అక్షింతలు!

» సినీ పరిశ్రమపై చేసిన వ్యాఖ్యలు.. వెనక్కి తీసుకోవాలని ఆదేశం

» ఆపై మీడియా ఎదుట వైవీబీ వివరణ

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా ఉద్యమంలో పాల్గొనడం లేదంటూ సినీ పరిశ్రమకు చెందిన వారిమీద ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆపై ఆయనకు అక్షింతలు వేసినట్లు సమాచారం. వైవీబీ వ్యాఖ్యలపై గురువారం ఉదయం టెలికాన్ఫరెన్స్‌లో ఎంపీ మురళీమోహన్ సీఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజేంద్ర ప్రసాద్‌ను వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నాయకులు సంయమనంతో మాట్లాడాలని, వ్యక్తిగత అజెండాలకు తావులేదని సూచించారు. ఆ తర్వాత ఇదే అంశంపై అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన వైవీబీ.. సినీ పరిశ్రమపై వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు.

బెదిరింపు కాల్స్ వస్తున్నాయి

» లోక్‌సభ స్పీకర్‌కు అరకు ఎంపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు అరకు ఎంపీ కొత్తపల్లి గీత గురువారం ఫిర్యాదు పత్రం అందించారు. గతంలో తన నియోజకవర్గంలో పర్యటించినప్పుడు కూడా కొందరు తనపై దాడి చేయడానికి ప్రయత్నించారని, దానిపై రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదని ఆ లేఖలో ఎంపీ ప్రస్తావించారు.

బీజేపీకి వ్యతిరేకంగా మహా కూటమి

తెరపైకి వచ్చిన మరో నేత శరద్ యాదవ్




న్యూఢిల్లీ, మార్చి 22: బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటు చేస్తానంటూ మరో సీనియర్ నేత రంగంలోకి దిగారు. ఆయనే, జేడీయూ నుంచి బహిష్కరణకు గురైన మాజీ ఎంపీ శరద్ యాదవ్. బీజేపీ వ్యతిరేక కూటమి అంటూ మమతా బెనర్జీ, బీజేపీ-కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పాటు చేస్తానంటూ సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 'మతతత్వ' బీజేపీకి వ్యతిరేకంగా 2019 ఎన్నికల్లోపే మహా కూటమి ఏర్పాటు చేస్తానంటూ ఇప్పుడు శరద్ యాదవ్ ముందుకొచ్చారు. ప్రతిపక్షాలను ఏకం చేయడమే తన లక్ష్యమన్నారు. లఖ్‌నవూ పర్యటనలో భాగంగా ఆయన పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. సామాజిక న్యాయం కోసం పోరాడడం ద్వారా మాత్రమే బీజేపీ మతతత్వాన్ని అడ్డుకోగలమని చెప్పారు. ఇందుకు తాను దేశమంతా తిరుగుతున్నానని, ప్రజలను కలుస్తున్నానని, బీజేపీ, దాని మతతత్వానికి వ్యతిరేకంగా పార్టీలను కూడగడుతున్నానని చెప్పారు. వాజపేయి, ఆడ్వాణీ నాయకత్వంలో తాను ఎన్డీయే కన్వీనర్‌గా పని చేశానని, అప్పట్లో దానికి జాతీయ అజెండా ఉండేదని, ఇప్పుడు పరిస్థితులు మారాయని తెలిపారు. ఇప్పుడు విభజన రాజకీయాలు నడుస్తున్నాయని, మత ప్రాతిపదికన మోదీ ప్రభుత్వం ప్రజలను విభజిస్తోందని విమర్శించారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్‌ల్లో బీజేపీ ఓటమి కీలకమని, 2019 ఎన్నికల్లోనూ ఆ పార్టీ పరాజయాన్ని రుచి చూడబోతోందని చెప్పారు. ఈసారి హిందూ-ముస్లిం అజెండా కూడా పని చేయదన్నారు. బీజేపీ 'రాజకీయ అవినీతి'కి పాల్పడిందని, గోవా, మణిపూర్, మేఘాలయల్లో కాంగ్రెస్‌కు ఎక్కువ స్థానాలు వచ్చినా రాజకీయ హుందాతనాన్ని, నైతికతను తుంగలోకి తొక్కి ఆ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఇప్పటికే అఖిలేశ్‌ను కలిసిన శరద్.. త్వరలో మాయావతిని కలుస్తానన్నారు.

కేసీఆర్ ఫ్రంట్ విఫలమే: కరత్

» ప్రాంతీయ పార్టీల మధ్య వైరుధ్యాలెన్నో

» అందర్నీ కూడగట్టి నిలబెట్టడం సులువు కాదు



న్యూఢిల్లీ, మార్చి 22: తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మూడో కూటమి నిర్మించడానికి చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించబోవని సీపీఎం నాయకుడు ప్రకాశ్ కారత్ అభిప్రాయపడ్డారు. "ఒక్క కేసీఆరే కాదు, ఎవరు చేసినా అంతే.. బీజేపీయేతర, కాంగ్రెసేతర కూటమి నిర్మించడం అంత సుళువు కాదు. ఎందుకంటే ప్రాంతీయ ఆకాంక్షలు వేరు... విధానాల్లో, ప్రాంతీయ ప్రయోజనాల్లో ఎన్నో వైరుధ్యాలుంటాయి.. ఇవన్నీ వాటి వాటి నిర్ణయాలను ప్రభావితంచేస్తాయి. ఆ ప్రాంతీయ పార్టీలు ఒక గొడుగు కిందకి రావడం అసాధ్యం. ఒకవేళ కూడగట్టినా అవి నిలబడవు. అదీకాక- డీఎంకే, ఆర్జేడీ లాంటి పక్షాలు ఎప్పటికీ కాంగ్రెస్‌తోనే ఉంటాయి. బీజేపీని ఓడించాలంటే ఒక్కటే మార్గం. రాష్ట్రాల వారీగా బీజేపీ-వ్యతిరేక ఓటు చీలకుండా చూసుకోవాలి. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో జరిగినదిదే" అని కారత్- పార్టీ పత్రిక 'పీపుల్స్ డెమొక్రసీ'లో రాసిన ఓ సంపాదకీయంలో పేర్కొన్నారు. తెలంగాణలోని టీఆర్ఎస్, ఆంధ్రలోని టీడీపీ, ఒడిషాలోని బీజేడీ ..కాంగ్రెస్ సారథ్యంలో పని చేయడానికి ఇష్టపడవని ఆయన అందులో రాశారు. గతంలో యూపీఏ తరహాలో ఓ కూటమి ఏర్పాటుచేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని. అయితే కాంగ్రెస్ పట్ల విశ్వసనీయత లేనందున దాని సారథ్యానికి మిగిలిన పార్టీలు సమ్మతించవని, అంచేత కాంగ్రెస్ నేతృత్వ ఫ్రంట్ కూడా విఫలమవుతుందని కారత్ విశ్లేషించారు.

కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో రాజీ వద్దు


» ఖర్చే కాదు... ఫలితాలూ ముఖ్యమే

» ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి నిధులు రాబట్టే విషయంలో రాజీపడొద్దని, కేంద్రానికి కావాల్సిన నివేదికలు అందించి మరీ నిధులు రాబట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి 5వ సమావేశాన్ని ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం వేల కోట్ల రూపాయిలు ఖర్చు చేయడం ఒక్కటే ముఖ్యం కాదని, ఉత్తమ ఫలితాలు సాధించడం కూడా ప్రధానమేనని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సంతోషం ప్రాతిపదికగా అన్ని శాఖల పనితీరు ఉండాలని చెప్పారు. దళితవాడల్లో, గిరిజన తండాల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చ జరగాలని, మరింత మందికి లబ్ధి చేకూరేలా చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎస్సీ, ఎస్టీల తలసరి ఆదాయం పెంచేందుకు ప్రయత్నించాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో కనీసం రెండు వర్చువల్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గత ఏడాది జరిగిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి మండలి సమావేశంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగానికి సంబంధించి 11 శాఖలకు గాను 58 నిర్ణయాలు తీసుకోగా అందులో 30 నిర్ణయాలు అమలయ్యాయి. మరో 19 నిర్ణయాలు అమలు దశలో ఉన్నాయి. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగానికి సంబంధించి మొత్తం 9 శాఖలకు గాను 32 నిర్ణయాలు అమలయ్యాయి. మరో 11 నిర్ణయాలు అమలు దశలో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 180 ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వర్చువల్ క్లాస్‌రూంలు సిద్ధంగా ఉన్నాయని, ఫైబర్ కనెక్టివిటీ కోసం ఎదురుచూస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఎల్ఈడీ బల్బుల వినియోగిస్తున్నామని, పలు చోట్ల ప్రయోగాత్మకంగా సోలార్ పవర్ రూఫ్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2018-19 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ల నుంచి ఏఏ పథకాలకు ఎంత ఖర్చు చేయనున్నారో వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కోసం రూ.9,847.13 కోట్లు కేటాయించగా రూ.8995.34 కోట్లు వినియోగించారు. ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం రూ.3528.75 కోట్లు కేటాయించగా రూ.3009.64 కోట్లు ఖర్చు చేశారు. సమావేశంలో సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, సాంఘిక సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ఎలావెనిల్‌కు స్వర్ణం

సిడ్నీ: సిడ్నీలో జరుగుతున్న జూనియర్ ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ ఎలావెనిల్ వలరివన్ మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ పోటీలో స్వర్ణం సాధించింది. వ్యక్తిగత స్వర్ణంతోపాటు శ్రేయ అగర్వాల్, జీనా ఖిట్టాలతో కలిసి టీమ్ స్వర్ణం గెలిచింది. 18 ఏళ్ల ఎలావెనిల్ ఫైనల్లో 249.8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, చైనీస్ తైపీకి చెందిన షిన్ రజతం, చైనాకు చెందిన వాంగ్ కాంస్యం నెగ్గారు.



సతీష్ శివలింగం

మళ్లీ టాప్ లేపాలి!

ఈసారి బరిలో 16మంది వెయిట్‌లిఫ్టర్లు

కామన్వెల్త్ క్రీడల వెయిట్ లిఫ్టింగ్‌లో భారత లిఫ్టర్ల ప్రదర్శన ఎప్పుడూ మెరుగ్గానే ఉంటోంది..ప్రతి క్రీడల్లోనూ ఈ విభాగంలో భారత్ సాధిస్తున్న పతకాలు పెరుగుతుండడమే అందుకు తార్కాణం.. గత గ్లాస్గో గేమ్స్‌లో అయితే ఈ కేటగిరీ పతకాల్లో భారత్‌ది టాప్ ప్లేస్..ఆ అగ్రస్థానం ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడిస్తున్న తరుణాన గోల్డ్‌కోస్ట్ క్రీడల్లో మరింత రాణించాలని లిఫ్టర్లు పట్టుదలతో ఉన్నారు.. అందుకే నెల ముందుగానే అక్కడికి వెళ్లి ముమ్మురంగా ప్రాక్టీస్ చేస్తున్నారు..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కామన్వెల్త్ క్రీడల్లో భారత్ భారీగా పతక ఆశలు పెట్టుకొన్న అంశాల్లో వెయిట్ లిఫ్టింగ్ ఒకటి. పురుషులు, మహిళల విభాగాల్లో ఎనిమిదేసి కేటగిరీల్లో మొత్తం 16 మంది భారత లిఫ్టర్లు ఈసారి అదృష్టం పరీక్షించుకోనున్నారు. వచ్చేనెల 4 నుంచి 15 వరకూ జరిగే క్రీడల్లో నైజీరియా, ఆస్ట్రేలియా, మలేసియా, సమోవా దేశాల నుంచి భారత లిఫ్టర్లకు పోటీ ఎదురయ్యే అవకాశముంది. గత ఏడాది జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో భారత్ మూడు స్వర్ణ పతకాలు సాధించింది. వీటిని సతీష్ శివలింగం (77 కిలోలు), రాగాల వెంకట రాహుల్ (85 కిలోలు), ప్రదీప్ సింగ్ (105 కిలోలు) కైవసం చేసుకొన్నారు. ఇక గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో సతీష్ 77 కిలోల విభాగంలో మొత్తం 328 కిలోల బరువెత్తి పసిడి పతకం చేజిక్కించుకోవడం విశేషం. ఇటీవలి ప్రదర్శన ప్రకారం చూస్తే గోల్డ్‌కోస్ట్‌లో ఫ్రాంకోయిస్ ఎతౌండి (ఆస్ట్రేలియా), అబ్దుల్ ముబిన్ రహీమ్ (మలేసియా)లు సతీష్‌కు ప్రధాన ప్రత్యర్థులు కానున్నారు. అయితే వీరిద్దరూ కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో సతీష్‌కంటే చాలా తక్కువ బరువులే ఎత్తడం గమనార్హం. 'ఇటీవలి నా ప్రదర్శన చక్కగా ఉంది. అందువల్ల స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకొంటానన్న నమ్మకం ఉంది. గాయాలపాలు కాకుండా ఉండేందుకు శిక్షణలో అతిగా బరువులెత్తే ప్రయత్నం చేయడం లేదు' అని సతీష్ చెప్పాడు. మొత్తం భారత జట్టంతా ప్రస్తుతం మెల్‌బోర్న్‌లో శిక్షణ పొందుతోంది.

సమోవా, మలేసియా నుంచి పోటీ...

85 కిలోల విభాగంలో రాగాల వెంకట్‌కు సమోవా లిఫ్టర్ డాన్ ఒపెలోగ్, మహ్మద్ ఫజ్రుల్ అజైర్ మహ్మద్ (మలేసియా) నుంచి కఠిన పోటీ తప్పేలా లేవు. 'సంప్రదాయంగా అత్యధిక బరువు విభాగాల్లో మేం ఎప్పుడూ బాగా రాణించలేదు. కానీ 105 కిలోలలో ప్రదీప్ ప్రదర్శన సంతృప్తికరంగా ఉండడంతో అతడికి స్వర్ణ పతకం చాన్స్ ఉంది. అయితే సమోవాకు చెందిన సనేలే మావొ, 2014 కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ డేవిడ్ కటోవటావ్ (కిర్బిత్)ల నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది' అని వెయిట్‌లిఫ్టింగ్ జట్టు చీఫ్ కోచ్ విజయ్ శర్మ చెప్పాడు. కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో మావొ, కటోవటావ్ లిద్దరినీ ప్రదీప్ వెనక్కునెట్టినా.. భారత లిఫ్టర్‌కంటే గతంలో వారిద్దరూ మెరుగైన ట్రాక్ రికార్డు కలిగి ఉన్నారు.



మీరాబాయి చాను

మహిళల్లో ఎప్పుడూ మనమే..

మహిళల వెయిట్ లిఫ్టింగ్‌లో భారత్ ఎప్పుడూ మెరుపులు మెరిపిస్తూనే ఉంది. గతంలో మల్లీశ్వరి, కుంజరాణి దేవి, ప్రస్తుతం మీరాబాయి చానుల ప్రతిభ అంతర్జాతీయంగా జేజేలు అందుకొంది. ఇటీవల అమెరికాలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ చేజిక్కించుకొని మీరాబాయి చరిత్ర సృష్టించింది. డోపింగ్ ఆరోపణలతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చైనా పాల్గొనకపోయినా.. 48 కేజీల విభాగంలో మొత్తం 194 కిలోల బరువెత్తిన చాను వరల్డ్ రికార్డు సృష్టించింది. నిరుటి కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో మీరాబాయ్ అలవోకగా టైటిల్ నెగ్గింది. రెండు, మూడు స్థానాలు పొందిన పపువా న్యూ గినియా, శ్రీలంక లిఫ్టర్లు చానుకంటే ఎంతో వెనుకంజలో ఉండడం గమనార్హం. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో 48 కిలోలలో బంగారు పతక విజేత సంజిత చాను ఈసారి 53 కిలోల విభాగానికి మారింది. ఈ కేటగిరిలోనూ ఆమె స్వర్ణ పతక రేస్‌లో ముందంజలో ఉండడం విశేషం. అయితే మేరీ రనైవొసోవా (మారిషస్), లోవా డికాటౌ (న్యూగినియా)ల నుంచి సంజితకు పోటీ ఎదురుకానుంది. ఇక ఫిజి, ఇంగ్లండ్ లిఫ్టర్లనుంచి ప్రతిఘటన ఎదురైనా 69 కేజీలలో పూనమ్ యాదవ్ టైటిల్ రేసులో అగ్రభాగాన ఉంది. 2010 ఢిల్లీ కామన్వెల్త్ క్రీడల్లో భారత్ రెండు స్వర్ణ, రెండు రజత, నాలుగు కాంస్యాలతో కలిపి ఎనిమిది పతకాలు సాధించింది. తర్వాతి గ్లాస్గో క్రీడల్లో భారత లిఫ్టర్లు మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి 12 పతకాలు (మూడు స్వర్ణ, నాలుగు రజత, ఐదు కాంస్య) చేజిక్కించుకున్నారు. వెయిట్‌లిఫ్టింగ్ పతకాల పట్టికలో భారత్ టాప్‌లో నిలిచింది. 'ఉత్తమ మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ తోడ్పాటువల్లే వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ సత్తా చాటుతోంది. జట్టంతా నెలరోజుల ముందుగానే ఆస్ట్రేలియా వెళ్లింది. అందువల్ల అక్కడి వాతావరణ పరిస్థితులకు వారు అలవాటుపడతారు' అని శర్మ పేర్కొన్నాడు.




రాహుల్

'అంబేడ్కర్'పై వ్యాఖ్యలు నావికావు

హార్దిక్ పాండ్యా వివరణ

న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసింది తాను కాదని క్రికెటర్ హార్దిక్ పాండ్యా వివరణ ఇచ్చాడు. అంబేడ్కర్ అంటే తనకు ఎంతో గౌరవమని, ఆయనను కించపరిచే వ్యాఖ్యలు తాను ఎందుకు చేస్తానని అన్నాడు. తన పేరుతో ఉన్న నకిలీ అకౌంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, దానికీ తనకు ఎటువంటి సంబంధం లేదని పాండ్యా వివరణలో పేర్కొన్నాడు. గత డిసెంబర్ 26న 'ఏ అంబేడ్కర్? దేశాన్ని విభజించే రాజ్యాంగాన్ని తయారుచేసిన వ్యక్తా? లేక దేశంలో రిజర్వేషన్ అనే జాడ్యాన్ని వ్యాప్తి చేసిన అంబేడ్కరా?' అని ఎట్ సర్‌హార్దిక్3777 అనే ట్విట్టర్ ఖాతా నుంచి ట్వీట్ రావడం దుమారం రేపింది. అయితే తన ట్విట్టర్ ఖాతా 'ఎట్‌హార్దిక్‌పాండ్యా7' అని పాండ్యా గుర్తుచేశాడు. అయితే అంతకుముందే ఈ ట్వీట్‌పై డి.ఆర్.మేఘ్వాల్ అనే న్యాయవాది ఫిర్యాదు మేరకు పాండ్యాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జోధ్‌పూర్ స్థానిక కోర్టు ఆదేశించింది. తొలుత జోధ్‌పూర్‌లోని పోలీస్ స్టేషన్, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదుకు నిరాకరించారు.



టాప్-20లో సాత్విక్ జోడీ

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ షెట్టి ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ టాప్-20లోకి దూసుకెళ్లింది. తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 20వ స్థానంలో నిలిచింది. ఆల్ ఇంగ్లండ్‌లో ప్రీ క్వార్టర్స్‌కు చేరడంతో వీరి ర్యాంక్ మెరుగుపడింది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ రెండో ర్యాంక్‌లో ఉండగా.. హెచ్ఎస్ ప్రణయ్ 12వ, సాయి ప్రణీత్ 15వ స్థానాల్లో ఉన్నారు. మహిళ సింగిల్స్‌లో సింధు 3, సైనా నెహ్వాల్ 12వ ర్యాంకుల్లో నిలిచారు. కామన్వెల్త్ క్రీడల ముందు ర్యాంకింగ్ మెరుగుపడడం సాత్విక్-చిరాగ్ ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే..!

షమి.. ఫిక్సర్ కాదు

- బీసీసీఐ క్లీన్‌చిట్
- 'బి' గ్రేడ్ కాంట్రాక్టుకు ఎంపిక
- ఐపీఎల్‌లోనూ బరిలోకి..

ముంబై: భార్య హసీన్ జహా చేస్తున్న ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరవుతున్న పేసర్ మహ్మద్ షమికి ఊరట లభించింది. అతడిపై హసీన్ చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను తోసిపుచ్చుతూ బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) క్లీన్‌చిట్ ఇచ్చింది. అంతేకాకుండా షమిని తిరిగి సెంట్రల్ కాంట్రాక్ట్ 'బి' జాబితాలోకి తీసుకుంటున్నట్టు భారత క్రికెట్ బోర్డు ప్రకటించింది. 'బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం చీఫ్ నీరజ్ కుమార్ తమ రహస్య నివేదికను పరిపాలకుల కమిటీ (సీఓఏ)కి అందించారు. దీని ప్రకారం షమిపై ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని సీఓఏ భావించింది' అని బీసీసీఐ తెలిపింది. దీంతో ఇక అతడిని తిరిగి సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలోకి తీసుకోవడానికి బోర్డుకు కూడా ఎలాంటి ఇబ్బందీ లేకుండా పోయింది. షమికి లభించిన 'బి' కాంట్రాక్ట్‌తో ఏడాదికి రూ.3 కోట్లు అందుతాయి. ఇక బోర్డు నిర్ణయంతో ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు తరఫున కూడా షమి బరిలోకి దిగనున్నాడు. మ్యాచ్‌లను ఫిక్సింగ్ చేసినందుకు ఇంగ్లండ్‌కు చెందిన మహ్మద్ భాయ్ నుంచి షమి డబ్బులు తీసుకున్నాడని, ఇదంతా పాకిస్థానీ మహిళ అలీష్బా ద్వారా షమికి చేరేదని భార్య హసీన్ ఇదివరకే ఆరోపించిన విషయం తెలిసిందే. దీంతో పరిపాలకు కమిటీ విచారణకు ఆదేశించింది. అయితే ఈ ఆరోపణలను ప్రారంభం నుంచీ షమి ఖండిస్తున్నాడు. తనకు షమితో పరిచయం ఉన్నా ఫిక్సింగ్‌లను పాల్పడలేదని మహ్మద్ భాయ్ తెలిపాడు. మరోవైపు ఫిక్సింగ్ ఆరోపణల నుంచి షమి బయటపడినా శారీరక.. మానసిక వేధింపులు, గృహ హింస, హత్యాయత్నంపై హసీన్ చేసిన ఫిర్యాదుపై పోలీసుల క్రిమినల్ విచారణ మాత్రం కొనసాగుతోంది.



భాయ్ ద్వారా అమ్మాయిలతో పరిచయాలు..: షమి భార్య హసీన్ జహా అతడిపై తాజాగా మరోసారి ఆరోపణలు చేసింది. లండన్ వ్యాపారవేత్త మహ్మద్ భాయ్.. షమికి ఎంతో మంది అమ్మాయిలను పరిచయం చేశాడని తెలిపింది. అలాగే మంజు మిశ్రా అనే అమ్మాయితో కూడా షమికి అక్రమ సంబంధం ఉందని ఆరోపించింది.

సచిన్‌కు కాంబ్లీ పాదాభివందనం

ముంబై: సచిన్ టెండూల్కర్... వినోద్ కాంబ్లీ. ప్రపంచ క్రికెట్‌లో వీరిద్దరికి మించిన స్నేహ చరిత్ర ఇంకెవరికీ కనిపించదేమో.. ఒకే పాఠశాల, ఒకే రాష్ట్ర జట్ల తరఫున ఆడడంతో పాటు దేశానికి కూడా ప్రాతినిధ్యం వహించారు. అయితే ఆ మధ్య వీరిద్దరి మధ్య కాస్త దూరం పెరిగినా ఇప్పుడు మళ్లీ ఒక్కటయ్యారు. ముంబై టీ20 లీగ్ సందర్భంగా ఈ ఫ్రెండ్స్ మధ్య చోటు చేసుకున్న ఓ సరదా సన్నివేశం ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. బుధవారం జరిగిన



ఫైనల్లో కాంబ్లీ కోచ్‌గా వ్యవహరిస్తున్న శివాజీ పార్క్ లయన్స్ జట్టు ట్రయంప్ నైట్స్ చేతిలో ఓడింది. అవార్డుల కార్యక్రమంలో భాగంగా వేదికపై సచిన్, గవాస్కర్ ఉన్నారు. రన్నరప్ మెడల్‌ను కాంబ్లీకి గవాస్కర్ అందించాల్సి ఉండగా.. ఎవరూ ఊహించని విధంగా కాంబ్లీ పక్కనే ఉన్న తన స్నేహితుడు సచిన్ కాళ్లకు మొక్కడంతో అంతా అవాక్కయ్యారు. వెంటనే తేరుకున్న సచిన్.. కాంబ్లీని లేపి గట్టిగా హత్తుకోవడంతో అక్కడ అంతా నవ్వులు విరిశాయి.

టీటీ స్టార్ సౌమ్యజిత్‌పై రేప్ కేసు



కామన్వెల్త్ గేమ్స్ నుంచి తొలగింపు ?

న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ మహ్మద్ షమిపై అతడి భార్య హసీన్ జహా చేసిన వివాహేతర సంబంధాల ఆరోపణల దుమారం సద్దుమణగకముందే..కోల్‌కతాకే చెందిన మరో భారత మేటి క్రీడాకారుడిపై ఏకంగా రేప్ కేసు నమోదు కావడం సంచలనం రేపింది. దేశ అగ్రశ్రేణి టీటీ ప్లేయర్, కామన్వెల్త్ క్రీడల్లో పసిడి పతకం సాధిస్తాడని అంచనాలున్న సౌమ్యజిత్ ఘోష్‌పై కోల్‌కతాలోని బరాసత్ మహిళా పోలీస్ స్టేషన్‌లో బుధవారం రేప్ కేసు దాఖలైంది. ఈ నేపథ్యంలో టేబుల్ టెన్నిస్ సమాఖ్య (టీటీఎఫ్ఐ) ఘోష్‌ను సస్పెండ్ చేయడంతోపాటు కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత జట్టు నుంచి అతడిని తొలగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈమేరకు శుక్రవారం జరిగే టీటీఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారని తెలుస్తోంది. పశ్చిమబెంగాల్‌లోని సిలిగురికి చెందిన సౌమ్యజిత్ అత్యంత పిన్న వయస్సులో 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. అంతేకాదు అత్యంత పిన్నవయస్సు (19 ఏళ్లు)లో జాతీయ టీటీ చాంపియన్‌గా నిలిచిన రికార్డూ సొంతం చేసుకొన్నాడు. 2016 రియో ఒలింపిక్స్‌లోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక..24 ఏళ్ల ఘోష్‌కు 2014లో సామాజిక మాధ్యమం ద్వారా 14 ఏళ్ల బాలిక ఒకరితో పరిచయం ఏర్పడింది. తనను వివాహం చేసుకొంటానని చెప్పి లొంగదీసుకోవడంతో 2016లో తాను గర్భం దాల్చానని, అనంతరం తనను సౌమ్యజిత్ వదిలించుకోవాలని చూశాడని ఆ బాలిక తన ఫిర్యాదులో పేర్కొంది. గర్భవతి అయ్యాక తమ రెండు కుటుంబాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయని చెప్పింది. ఈ నేపథ్యంలో కుటుంబ ఆచార వ్యవహారాలు తెలుసుకొనేందుకు తమ ఇంట్లో ఉండాలని సౌమ్యజిత్ తనను కోరాడని 18 ఏళ్ల ఆ యువతి వివరించింది. అతడి ఇంట్లో ఉన్న సమయంలో ఘోష్ కుటుంబసభ్యులు తనకు బలవంతంగా అబార్షన్ చేయించారని ఆరోపించింది.

ఆరోపణలు అవాస్తవం: ఆ యువతి ఆరోపణలను సౌమ్యజిత్ ఖండించాడు. 'ఆ యువతి చెప్పేవన్నీ అవాస్తవాలు. నేను ఎలాంటి తప్పు చేయలేదు. మేం కలిసి ఉన్నది నిజమే. ఆమెతో విడిపోయిన అనంతరం ఏడాదిన్నరగా నన్ను, నా కుటుంబాన్ని, స్నేహితులను బ్లాక్‌మెయిల్ చేస్తోంది. నా కెరీర్‌ను దెబ్బతీసేందుకు కామన్వెల్త్ క్రీడల ముంగిట ఓ ప్రణాళిక ప్రకారం ఇలా వ్యవహరిస్తోంది' అని ఘోష్ అన్నాడు. తనను టీటీఎఫ్‌పై సస్పెండ్ చేయనున్న విషయం తెలియదన్నాడు. సమాఖ్య అధికారులతో మాట్లాడతానని సౌమ్యజిత్ చెప్పాడు.

ఇంగ్లండ్ ఢమాల్!

- 58 పరుగులకే ఆలౌట్
- కుప్పకూల్చిన బోల్ట్, సౌతీ
- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 175/3

ఉదయం 6.30 నుంచి • స్టార్‌స్పోర్ట్స్ సెలెక్ట్ 1లో...

ఐదుగురు డకౌట్లు.. ప్రపంచ మూడో ర్యాంకర్ సహా పది మంది ఆటగాళ్లు కలిపి చేసినవి 24 పరుగులే.. కానీ చివర్లో పేసర్ ఒవర్టన్ అజేయంగా ఒక్కడు చేసిందే 33 పరుగులు... కేవలం 20.4 ఓవర్లలోనే ముగిసిన ఇన్నింగ్స్‌లో 58 పరుగులకు ఆలౌట్.. న్యూజిలాండ్ పేసర్లు బౌల్ట్, సౌథీ సాగించిన ఊచకోతతో తొలి రోజు ఇంగ్లండ్ వణికిన తీరిది. ఆఖరి వికెట్‌కు 29 పరుగులు రావడంతో టెస్టుల్లో అత్యల్ప స్కోరుకు అవుటైన చెత్త రికార్డుకు మాత్రం దూరం కావడం వీరికి ఊరటనిచ్చే విషయం..



బౌల్ట్ (6 వికెట్లు)

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో ప్రారంభమైన డే అండ్ నైట్ టెస్టులో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ అవమానకరంగా సాగింది. పేసర్లు ట్రెంట్ బౌల్ట్ (6/32), టిమ్ సౌథీ (4/25) నిప్పులు చెరిగే స్వింగ్ బంతులకు తమ బ్యాట్లను అడ్డం పెట్టడం కూడా మరిచిపోయిన పర్యాటక జట్టు చిగురుటాకులా వణికింది. ఎంతలా అంటే వీరిద్దరి ధాటికి ఓ దశలో 27 పరుగులకే తొమ్మిది మంది ఆటగాళ్లు పెవిలియన్‌లో కూర్చున్నారు. ఆఖరికి క్రెయిగ్ ఒవర్టన్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 33 నాటౌట్) ఎదురొడ్డి నిలవడంతో ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 20.4 ఓవర్లలో 58 పరుగులకు ఆలౌట్ అయింది. స్టోన్‌మన్ (11) రెండో అత్యధిక స్కోరర్. ఒవర్టన్, అండర్సన్ కలిసి ఆఖరి వికెట్‌కు 29 పరుగులు జత చేయడంతో జట్టు 'పరువు' దక్కించుకుంది. ఎందుకంటే అండర్సన్ (11 బంతుల్లో 1) కనుక తొలి బంతికే అవుట్ అయితే టెస్టుల్లో అత్యల్ప స్కోరును నమోదు చేసిన జట్టుగా కివీస్‌తో సమంగా నిలిచేది. 1995లో ఇంగ్లండ్‌పై కివీస్ ఇదే మైదానంలో 27 పరుగులకు ఆలౌటైంది. ఇక రూట్, స్టోక్స్, బెయిర్‌స్టో, మొయిన్ అలీ, బ్రాడ్ పరుగుల ఖాతానే తెరవలేకపోయారు. ఓవరాల్‌గా ఇంగ్లండ్‌కు టెస్టుల్లో ఇది ఆరో అత్యల్ప స్కోరు. 1887లో ఓసారి 45 పరుగులకే ఆలౌటైంది. అయితే ఆ టెస్టులో ఇంగ్లండే గెలవడం విశేషం.. కానీ కివీస్‌పై ఇంత తక్కువ స్కోరు నమోదు చేయడం ఇదే తొలిసారి. ఇక కెప్టెన్ కేన్ విలియమ్సన్ (91 బ్యాటింగ్) అద్భుత ఆటతీరుతో కివీస్ తొలి రోజు గురువారం ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 175 పరుగులు చేసింది. రెండో రోజు విలియమ్సన్ సెంచరీ చేస్తే కివీస్ తరఫున అత్యధిక శతకాలు (18) సాధించిన ఆటగాడిగా నిలుస్తాడు. నికోల్స్ (24 బ్యాటింగ్) క్రీజులో ఉండగా కివీస్ ఇప్పటికే 117 పరుగుల ఆధిక్యంలో ఉంది. అండర్సన్‌కు రెండు వికెట్లు పడ్డాయి. లాథమ్ వికెట్‌ను తీయడం ద్వారా స్టువర్ట్ బ్రాడ్ టెస్టుల్లో 400 వికెట్లు పూర్తి చేసుకున్నాడు.



400 వికెట్ల బ్రాడ్

భారత జట్లకు సులువైన డ్రా

- థామస్, ఉబెర్ కప్ ఫైనల్ టోర్నీ

న్యూఢిల్లీ: థామస్, ఉబెర్ కప్ ఫైనల్లో భారత జట్లకు సులువైన డ్రా ఎదురైంది. మే 20 నుంచి 27 వరకు బ్యాంకాక్‌లో జరిగే పోటీల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. ఉబెర్ కప్ గ్రూప్-ఎలో భారత మహిళల జట్టుతోపాటు జపాన్, కెనడా, ఆస్ట్రేలియా జట్లు ఉన్నాయి. పురుషుల థామస్ కప్ గ్రూప్-ఎలో టీమిండియాతోపాటు చైనా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా జట్లు ఆడనున్నాయి. గ్రూప్ టాపర్‌గా ఉన్న రెండు జట్లు నాకౌట్‌కు చేరుకుంటాయి. సులువైన డ్రా నేపథ్యంలో భారత జట్లు నాకౌట్ చేరే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

థామస్ కప్

గ్రూప్-ఎ: చైనా, భారత్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా; గ్రూప్-బి: ఇండోనేసియా, కొరియా, కెనడా, థాయ్‌లాండ్; గ్రూప్-సి: చైనీస్ తైపీ, జపాన్, జర్మనీ, హాంకాంగ్; గ్రూప్-డి: డెన్మార్క్, మలేసియా, రష్యా, అల్జీరియా.

ఉబెర్ కప్

గ్రూప్-ఎ: భారత్, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా; గ్రూప్-బి: థాయ్‌లాండ్, చైనీస్ తైపీ, జర్మనీ, హాంకాంగ్; గ్రూప్-సి: కొరియా, డెన్మార్క్, రష్యా, మారిషస్; గ్రూప్-డి: చైనా, ఇండోనేసియా, ఫ్రాన్స్, మలేసియా.

మధ్యాహ్నం 2 గం. నుంచి • సోనీ సిక్స్‌లో

ఎల్గర్ శతకం

సౌతాఫ్రికా 266/8

కేప్‌టౌన్: ఓపెనర్ డీన్ ఎల్గర్ (253 బంతుల్లో 17 ఫోర్లు, 1 సిక్స్‌తో 121 బ్యాటింగ్) అజేయ శతకంతో రాణించినా దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేయడంలో విఫలమైంది. ఓ దశలో 220/2తో పటిష్టంగా కనిపించిన ఈ జట్టు ఆ తర్వాత ఆసీస్ బౌలర్ల ధాటికి 37 పరుగుల వ్యవధిలో ఆరు వికెట్లను కోల్పోయింది. దీంతో తొలి రోజు గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో 8 వికెట్లకు 266 పరుగులు చేసింది. స్టార్ బ్యాట్స్‌మన్ డివిల్లీర్స్ (64) అర్ధ సెంచరీ, ఆమ్లా (31) ఓ మాదిరి స్కోరు మినహా వీరి ఇన్నింగ్స్‌లో మెరుపుల్లేవు. మిగతా వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఎల్గర్, డివిల్లీర్స్ మధ్య మూడో వికెట్‌కు 128 పరుగులు జత చేరాయి. ప్రస్తుతం రబాడ (6) క్రీజులో ఉన్నాడు. కమిన్స్‌కు నాలుగు, హాజెల్‌వుడ్‌కు రెండు వికెట్లు పడ్డాయి.

భారత్‌పై ఆసీస్ గెలుపు

నేటి మ్యాచ్
ఇంగ్లండ్ X ఆస్ట్రేలియా
ఉ. 10 నుంచి
స్టార్‌స్పోర్ట్స్-1లో...



మంధాన (67)

ముంబై: భారత పర్యటనలో మంచి జోరుమీదున్న ఆస్ట్రేలియా మహిళల జట్టు టీ20 ట్రైసిరీస్‌లో గ్రాండ్‌గా బోణీ చేసింది. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత్‌పై ఆస్ట్రేలియా ఆరు వికెట్లతో నెగ్గి పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగుల ఛేజింగ్ రికార్డును సమం చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (41 బంతుల్లో 67) కెరీర్ బెస్ట్ అర్ధ శతకంతో చెలరేగడంతో భారత్ 5 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. మిథాలీ 18, అనూజ పాటిల్ 35, హర్మన్‌ప్రీత్ 13 పరుగులు చేశారు. టీ20ల్లో ఆసీస్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. లక్ష్య ఛేదనలో బెత్ మూనీ (45) రాణించడంతో టీ20ల్లో అత్యధిక స్కోరును ఆస్ట్రేలియా 18.1 ఓవర్లలో నాలుగో వికెట్లు కోల్పోయి ఛేదించింది. వెటరన్ జులన్ గోస్వామి (3/30) రాణించింది. 153 పరుగుల లక్ష్య ఛేదనలో విల్లానీ (39), లానింగ్ (35 నాటౌట్) కూడా గౌరవప్రదమైన స్కోర్లు చేయడంతో ఆసీస్ మరో 11 బంతులు మిగిలి వుండగానే విజయాన్ని అందుకుంది.



వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ సాంకేతికలోపం కారణంగా శ్రీకాకుళం జిల్లా సోంపేట సమీపంలోని పంటపొలాల్లో దిగిపోయింది. ఈ హెలికాప్టర్ గురువారం కోల్‌కతా నుంచి చెన్నై వెళ్తుండగా ఇంజన్‌లో సమస్య తలెత్తడంతో, అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

'టెట్' ఫలితాలపై అభ్యంతరాలుంటే తెలపండి

» 95 మంది ఫలితాలు విత్‌హెల్డ్‌లో: కన్వీనర్ వెల్లడి

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టెట్ ఫలితాలపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు తమ అభ్యర్థనలు పంపుకోవచ్చని 'టెట్' కన్వీనర్ ఎ. సుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 24 నుంచి 31 వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు http://cse.ap.gov.in/DSE, http://aptet.apcfss.in ద్వారా అభ్యర్థనలను పంపుకోవాలన్నారు. కోరుకున్న అభ్యర్థులకు రెస్పాన్స్ షీట్ అందజేస్తామని, అందుకుగాను రూ.200లు ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. వేర్వేరు కారణాలతో మొత్తం 95 మంది అభ్యర్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

జనన ధ్రువీకరణ మరింత సులభం!

» ప్రమాణ పత్రం ఇస్తే చాలు.. మార్గదర్శకాలు విడుదల

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పుట్టిన తేదీని నిర్ధారించే ఏ ఒక్క ఆధారమూ లేని వారు ఇకపై సొంతంగా ఒక్క ప్రమాణపత్రం ఇస్తే చాలు! జనన ధ్రువీకరణ జరిగిపోయినట్లే. తప్పుడు సమాచారం ఇస్తే మాత్రం క్రిమినల్ చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది! ఈ మేరకు రెవెన్యూశాఖ సమీకృత కులధ్రువీకరణ పత్రం జారీలోని మార్గదర్శకాలను సులభతరం చేస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక సీఎస్ మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.



శ్రీకాకుళం జిల్లా సోంపేట సామాజిక ఆస్పత్రిలో 4కేజీల బరువుతో బాలుడు జన్మించాడు. పుట్టిన శిశువులు సాధారణంగా రెండున్నర కిలోలు ఉంటారు. కానీ ఈ బాలుడు 4కిలోల బరువున్నా ఆరోగ్యంగానే ఉన్నాడు. - సోంపేట

పీపీఏ అక్కర్లేదు!!

» పర్యవేక్షక బాధ్యత రాష్ట్రమే చూస్తోంది

» వేగంగా పోలవరం స్పిల్‌వే పనులు

» నవయుగ సంస్థ చేపట్టాక జోరు

» పీఎంకేఎస్‌వై పోర్టల్‌లో ప్రాజెక్టు పురోగతి

» కేంద్రానికి మసూద్ కమిటీ నివేదిక

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి ఎలాంటి పనీ లేదని.. అసలా సంస్థే అక్కర్లేదని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది. రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఇక దానికెలాంటి పనీ లేకుండా పోయిందని తెలిపింది. మోదీ ప్రభుత్వంతో టీడీపీ మైత్రీబంధాన్ని తెంచుకున్న దరిమిలా పోలవరం ప్రాజెక్టు భవితపై విభిన్న ప్రచారాలు చోటు చేసుకుంటున్న సమయంలో కేంద్ర జల వనరుల శాఖ ఎస్.మసూద్ హుస్సేన్ అధ్యక్షతన నియమించిన నిపుణుల కమిటీ ఈ మేరకు నివేదిక ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కమిటీ ఈ నెల 15 నుంచి 17 దాకా రాష్ట్రంలో పర్యటించింది. పోలవరం ప్రాజెక్టులో క్షేత్రస్థాయి పర్యటన చేసింది. అనంతరం నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించింది. ఇందులో పోలవరం పనుల తీరును ప్రశంసించింది. స్పిల్ వే, స్పిల్ చానల్ కాంక్రీట్ పనుల బాధ్యతలను నవయుగ ఇంజనీరింగ్ సంస్థ చేపట్టాక వేగం పెరిగిందని కితాబిచ్చింది. 'ప్రాజెక్టు నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే చేపడుతోంది. ప్రస్తుత తరుణంలో పీపీఏ పాత్ర ఏమిటో స్పష్టత లేదు. అందుచేత దీని పాత్రను సమీక్షించాలి. పునర్నిర్వచించాలి. పోలవరం ప్రగతి సమాచారాన్ని ప్రధానమంత్రి కిసాన్ సంచాయి యోజన (పీకేఎస్‌వై) వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాలి. ప్రాజెక్టు వద్ద ఎకో టూరిజం కోసం విస్తృత ప్రచారం చేయాలి' అని సూచించింది. ఇంకా ఏమన్నదంటే..



డయాఫ్రమ్‌వాల్..

74 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పనుల్లో థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ అవసరం.

కాఫర్ డ్యాం..

నిర్మాణం మెథడాలజీ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. అయినా గ్రౌటింగ్ పనులు మొదలయ్యాయి. 2019 మార్చి నాటికి కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తయితే గోదావరి జలాల మళ్లింపు ప్రారంభమవుతుంది. కాంక్రీట్ బెంచింగ్ ప్లాంట్ పనుల్లోనూ పురోగతి కనిపిస్తోంది.

రేడియల్ గేట్లు ..

రేడియల్ క్రస్ట్ గేట్లకు సంబంధించి మెటీరియల్ సమీకరించారు. గేట్లకు పెయింటింగ్ వేసేముందు శాండ్ బ్లాస్టింగ్ చేయాల్సి ఉంది.

హెడ్‌వర్క్స్/స్పిల్‌వే పనులు

నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్.. హెడ్‌వర్క్స్‌లో అంతర్భాగమైన స్పిల్‌వే పనుల బాధ్యత తీసుకున్నాక వేగం పెరిగింది. 2017 నవంబరు, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ పనులు చాలా మందకొడిగా సాగాయి. ఈ నెల రెండో వారం నుంచి రోజుకు 3000 క్యూబిక్ మీటర్ల చొప్పున కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. రోజుకు 6000 క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీటు వేయాలన్నది భారీ లక్ష్యమే. ఇది నెరవేరాలంటే.. రోజువారీ పర్యవేక్షణ అవసరం.

సహాయ, పునరావాసం, భూసేకరణ..

ప్రాజెక్టు కోసం అదనంగా 16621.71 ఎకరాలను సేకరించాల్సి ఉంది. సహాయ పునరావాస కార్యక్రమాలు 2019 నాటికి పూర్తి కావాలి. పైడిపాకలో నిర్మించిన సహాయ పునరావాస కాలనీని పరిశీలించాం. లబ్ధిదారులతో మాట్లాడాం. వారు సంతృప్తిచెందారు.

ఐకానిక్ బ్రిడ్జి..

ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం నిర్మాణానికి సామగ్రిని సరఫరా చేసేందుకు స్పిల్ చానల్ మీదుగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం తలపెట్టింది. ఇది భవిష్యత్‌లో ఉభయ గోదావరి జిల్లాలను కలిపే వారధిగా ఉపకరిస్తుంది. టూరిజం అభివృద్ధికీ ఉపయుక్తంగా ఉంటుంది. ఈ బ్రిడ్జి డిజైన్లు ఖరారు దశలో ఉన్నాయి. స్పిల్ చానల్ కాంక్రీటు పనులకు అంతరాయం లేకుండా దీనిని నిర్మించాలని ప్రతిపాదించారు. డ్యాం డిజైన్ సమీక్ష ప్యానెల్ (డీడీఆర్‌పీ)కి ఈ ప్రతిపాదనలు పంపాలి.

పోలవరాన్ని సందర్శించిన కమిటీలో మసూద్‌తో పాటు పీపీఏ సీఈవో ఎస్.కె.హాల్దర్, పీపీఏ సభ్య కార్యదర్శి ఆర్.కె.గుప్తా, సీడబ్ల్యూసీ జాతీయ ప్రాజెక్టుల విభాగం డైరెక్టర్ జీఎల్ బన్సల్, సీఈ రంగారెడ్డి, శాస్త్రవేత్త ఆర్.చిత్ర, అనిల్ జైన్, కన్వీనర్ అనిల్ జైన్, రాష్ట్ర జల వనరుల కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు ఎస్ఈ రమేశ్ బాబు, పోలేశ్వరరావు, శ్రీనివాస్ యాదవ్, ఎం.నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

1089 కోట్లు విడుదల

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,089.07 కోట్లు విడుదల చేస్తూ కేంద్ర జలవనరుల శాఖ నిర్ణయం తీసుకుంది. రూ.1,994.37కోట్ల మేర నాబార్డు నుంచి రుణం తీసుకోవాల్సి ఉంటుందని ఈనెల 20న కేంద్ర ఆర్థికశాఖను కోరగా.. రూ.1,400కోట్లు రుణంగా తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. ప్రాజెక్టుపై వ్యయం చేసిన రూ.1,089.07కోట్లకు సంబంధించిన బిల్లులను పీపీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంపింది. వీటిని ఆర్థికశాఖ ఆమోదించడంతో సత్వర సాగు నీటి అభివృద్ధి పథకం(ఏఐబీపీ) కింద రాష్ట్రానికి విడుదల చేయాలని కేంద్ర జలవనరుల శాఖ గురువారం నిర్ణయించింది. మిగిలిన రూ.310.93 కోట్లకు సంబంధించి బిల్లులను కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది.



బస్సును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీత

» జిల్లాకో వావ్ వాహనం

» విద్యార్థినులతో సీఎం వీడియో కాన్ఫరెన్సు

» నైపుణ్య రథాన్ని ప్రారంభించిన చంద్రబాబు

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఆఫ్ వీల్స్(వావ్) పేరిట చేపట్టిన నైపుణ్య రథం కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. సచివాలయంలో గురువారం నాడు జెండా ఊపి నైపుణ్య రథాన్ని ఆయన ప్రారంభించారు. వరల్డ్ ఆఫ్ వీల్స్ అనే పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ఎంతో వినూత్నమైనదని అన్నారు. ఈ నైపుణ్య రథం ఒక్కటే రాష్ట్రమంతా తిరగడం కాకుండా, ప్రతి జిల్లాకూ ఒక్కో రథం ఉండాల్సిందేనని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ కోగంటి సాంబశివరావును ముఖ్యమంత్రి ఆదేశించారు. సమాజంలో మారుమూల ప్రాంతాల్లోనూ ప్రజలను చైతన్య పరచి శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. హ్యూలెట్ ప్యాకర్డ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, గ్రైడ్ ఫౌండేషన్ ఫర్ డెవలప్‌మెంట్ సంయుక్త నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య రథం పరుగులు తీస్తుందని సీఎం చెప్పారు. రథంలో వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయం ఉండడంతో కాలేజీ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు.



కలెక్టర్ భాస్కర్‌కు సంఘీభావం తెలుపుతున్న రైతులు

'పోలవరం'పై ఎవరికీ భయపడం

» పరిహారంలో పైసా అవినీతి లేదు

» పశ్చిమ కలెక్టర్ భాస్కర్

ఏలూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలవరం ప్రాజెక్టు పరిధి రైతులకు పరిహారం చెల్లింపుల్లో ఒక్క పైసా తప్పు జరగలేదని, ఈ విషయంలో ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ స్పష్టం చేశారు. ఇంతవరకు తమకు అన్యాయం జరిగిందనిగానీ, భూసేకరణలో వివక్ష చోటు చేసుకుందనిగానీ ఏ ఒక్క రైతూ తనవద్దకు రాలేదని, అందరికీ న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. భూ పరిహారం చెల్లింపుల్లో కలెక్టర్ చొరవతో తమకు న్యాయం జరిగిందని బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాలకు చెందిన 200 మంది రైతులు గురువారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మెరుగైన పరిహారం అందించడానికి ఏటా భూముల రిజిస్ట్రేషన్ విలువను పెంచుతూ ఉండబట్టే తమ భూములకు ఊహించని ధర లభించిందని, కానీ కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, దీంతో మనస్తాపం చెంది సంఘీభావం తెలపాలనే ఉద్దేశంతో తాము ఇక్కడకు వచ్చామని దొరమామిడికి చెందిన పెద్ది లీలాప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. కొంతమంది చేసే అల్లరి వల్ల ప్రాజెక్టు ఆగిపోతుందన్న భావన కలిగించి అధికారులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారని, వారి కుట్రలను సహించబోమని ముప్పినవారిగూడేనికి చెందిన కాకర్ల వెంకటరమణ, బుట్టాయిగూడేనికి చెందిన గద్దే సత్యనారాయణ, దుక్కిన వెంకటరమణ, దొరమామిడికి చెందిన సుబ్రహ్మణ్యం అన్నారు. కలెక్టరుపై బురదచల్లినా ఊరుకోబోమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వంశధార ప్రాజెక్టు భూసేకరణ విషయంలోనూ చట్టప్రకారమే పనిచేశానని, కొందరు అప్పట్లో బురద చల్లారని, తన తర్వాత ఈనాటి వరకు భూసేకరణ పూర్తి కాలేదని చెప్పారు. ప్రభుత్వాధికారిగా నిజాయితీగా, నియమనిబంధనలకు లోబడే పనిచేస్తానని స్పష్టం చేశారు.

పోలవరాన్ని ఆపే కుట్ర

» వైసీపీ, జనసేనతో బీజేపీ కుమ్మక్కు

» పట్టిసీమపై ఆరోపణలు కేంద్రం కుట్రే

» మోదీని ప్రశ్నిస్తే సీబీఐ ఎంక్వైరీలా?

» టీడీపీ ఎమ్మెల్యేలు, నేతల ఆగ్రహం

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న బీజేపీ ఆరోపణలపై టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టును ఆపేందుకు వైసీపీ, జనసేనలతో కలిసి ఆ పార్టీ కుట్ర పన్నుతోందని విరుచుకుపడ్డారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు వేర్వేరుగా మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ దేశంలో ఎమర్జెన్సీ విధిస్తే.. ఇప్పుడు ఏపీలో బీజేపీ ఆ వాతావరణం కల్పించాలని చూస్తోందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమ ధ్వజమెత్తారు. టీడీపీ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటులో చర్చ జరిగితే తన అసలు రంగు బయటపడుతుందన్న భయంతో సభ జరక్కుండా బీజేపీ అడ్డుకుంటోందని ఆరోపించారు. రాజధాని అమరావతి నిర్మాణం ఆపాలని, పోలవరం నిర్మాణం జరగకూడదని చూస్తోందన్నారు. పొత్తున్నప్పుడు పట్టిసీమను పొగిడి.. సీఎం చంద్రబాబుకు, అధికారులకు సన్మానం చేయాలన్న బీజేపీ శాసన సభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు.. ఇప్పుడు అభాండాలు వేస్తూ, సీబీఐ విచారణ చేయించాలనడం బ్లాక్‌మెయిల్ చేయడమేనని వ్యాఖ్యానించారు. పోలవరం జోలికి వస్తే రైతులు తిరగబడతారని హెచ్చరించారు. పవన్ కల్యాణ్ ఎవరి డైరెక్షన్‌లో నడుస్తున్నారో అందరికీ తెలుసని చెప్పారు. జనసేన నేతలకే టచ్‌లో ఉండని ఆయన.. 40 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పట్టిసీమపై విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు డెల్టా రైతుల్ని అవమానపరిచే విధంగా ఉన్నాయన్నారు. డెల్టా ప్రాంతం ఎడారిగా మారుతుందన్న ఆందోళనతోనే చంద్రబాబు గోదావరి నీటిని పట్టిసీమ ద్వారా తీసుకొచ్చారని.. దీనివల్ల పంటలు విరగపండుతుంటే..సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని ఇప్పుడు బీజేపీ డిమాండ్ చేయడం వెనుక కారణాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. విభజనతో ఏపీకి కాంగ్రెస్ చేసిన గాయాన్ని బీజేపీ ప్రభుత్వం మాననివ్వకుండా మరింత గాయం చేస్తోందని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మండిపడ్డారు. కేంద్రం చేసిన అన్యాయానికి నిరసన తెలుపుతూ నల్ల ఫ్యాంటు, నల్ల షర్టు, నలుపు బూట్లు, నల్ల వాచీ ధరించి, నలుపు బ్రీఫ్‌కేస్ చేతపట్టి ఆయన అసెంబ్లీకి వచ్చారు. పట్టిసీమపై బీజేపీ సభ్యులు మూడేళ్ల తర్వాత అవినీతి ఆరోపణలు చేయడం కేంద్రం కుట్రలో భాగమన్నారు. మోదీని ప్రశ్నించేవారిపై సీబీఐ ఎంక్వైరీలు, ఐటీ దాడులు చేయించినట్లే.. ఏపీకి జరిగిన అన్యాయంపై నిలదీస్తున్న చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై కుట్ర జరుగుతున్నట్లు అనుమానంగా ఉందని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి వ్యాఖ్యానించారు. బాబుకు ఎలాంటి హాని తలపెట్టినా రాష్ట్ర ప్రజలందరికీ హాని చేసినట్లేనన్నారు. బీజేపీ ఆపరేషన్ గరుడ ప్రారంభించిందని.. అందులో భాగంగానే బీజేపీ నేతలు పట్టిసీమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. జగన్ గజదొంగ అని.. ఏ-2 ముద్దాయి విజయసాయిరెడ్డిని పీఎంవోలోకి ఎలా అనుమతిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు.

మీ తాత తరం కాదు: వెంకన్న

చంద్రబాబును బోనెక్కిస్తానని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఉడత ఊపులు ఊగుతున్నారని టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న మండిపడ్డారు. విజయసాయిరెడ్డిని పుట్టించిన వాళ్లకు కూడా అది సాధ్యం కాదని అన్నారు. ఏ-1 ముద్దాయి.. రూ 46 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని.. ఆ అవినీతికి సహకరించి అక్రమాలకు పాల్పడిన ఏ-2 ముద్దాయి విజయసాయిరెడ్డిని బహిరంగంగా ఉరితీయాలని మీడియాపాయింట్‌లో వ్యాఖ్యానించారు. చంద్రబాబుపై కేసులు పెట్టిన జగన్ తల్లి విజయలక్ష్మికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన విషయాన్ని వైసీపీ నేతలు మరచిపోతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక రిట్లు వేసి, వాటిని స్వయంగా ఉపసంహరించుకున్న విషయాన్ని గుర్తుచేశారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107*
Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.